PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ

ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 325 | విజయవాడ, ఆదివారం 30 జూన్ 2024 | 8 + 8 పేజీ + స్నేహ వెల : 7.00
Vol No | Vijayawada, Sunday 30 June 2024 | Rs

టి20 ప్రపంచకప్ మనదే

- మెరుపు బౌలింగ్‌తో హార్దిక్ పాండ్యా, సూపర్ క్యాచ్‌తో సూర్యకుమార్
- ఉత్కంఠ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై ఏడు పరుగుల తేడాతో గెలుపు

8

అమరావతి ప్రభుత్వ కాంప్లెక్స్‌కు 1575 ఎకరాలు

నోటిఫై చేసిన ప్రభుత్వం

రాజధాని నిర్మాణంలో మరో ముందడుగు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి నిర్మాణంలో మరో ముందడుగు పడింది. ఈ ప్రాంతంలో చేపట్టనున్న గవర్నమెంట్ కాంప్లెక్స్ భవనాలకు 1575 ఎకరాల భూమిని ప్రభుత్వం గుర్తించింది.ఆ ప్రాంతాన్ని సిఆర్‌డిఎ శనివారం నోటిఫై చేసింది. ఈ మేరకు సిఆర్‌డిఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ శనివారం గెజిట్ విడుదల చేశారు. సిఆర్‌డిఎ చట్టం సెక్షన్ 39 ప్రకారం బహిరంగ ప్రకటన కూడా జారీ చేశారు. రాయపూడి. నేలపాడు, లింగాయపాలెం,శాఖమూరు, కొండమరాజుపాలెం సరిహద్దుల్లో ఉన్న ప్రాంతాన్ని నోటిఫై చేస్తున్నట్లు ఈ ప్రకనటలో పేర్కొన్నారు. అమరావతి రాజధాని నగరంలోని 217 చదరపు కిలోమీటర్ల పరిధిలో మొత్తం ప్లానుకు గతంలో రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ ప్లాను పరిధిలో ఎక్కడ ఏమి నిర్మించాలన్నా దానికి గుర్తిస్తూ సిఆర్‌డిఏ విడివిడిగా నోటిపికేషన్ ఇవ్వాల్సి ఉంది. 2019కు ముందు అప్పటి టిడిపి ప్రభుత్వం ప్రస్తుతం ఈ ప్రాంతంలో అమరావతి గవర్నమెంటు కాంప్లెక్స్ నిర్మాణానికి ప్లాను రూపొందించింది. దీనిలో శాశ్వత

సెక్రటేరియట్, హైకోర్టు, ప్రభుత్వ కార్యాలయాలు ఉండనున్నాయి. దీనిలో సెక్రటేరియట్ భవనాల నిర్మాణానికి అడుగు భాగంలో ర్యాఫ్ట్ కూడా వేశారు. ఇది గిన్నిస్‌బుక్ ఆఫ్‌రికార్డులోనూ ఎక్కింది. మొత్తం 1575 ఎకరాల పరిధిలో వేసిన ఈ ప్లానును అప్పట్లో నోటిఫై చేయలేదు. ఆలోపు ఎన్నికలు రావడం, ఇతర ప్రక్రియ మొత్తం ఆగిపోయింది. ఇప్పుడు మరలా తెలుగుదేశం ప్రభుత్వం రావడంతో అమరావతి గవర్నమెంటు కాంప్లెక్స్(ఎజిసి) నిర్మించబోయే ప్రాంతం మొత్తాన్ని నోటిఫై చేసింది.

బీహార్‌కు 'హోదా'

- నీట్ నిందితులకు కఠిన శిక్ష
- కేంద్రానికి నితీష్ కుమార్ మెలిక
- జెడియు జాతీయ కార్యవర్గం డిమాండ్

న్యూఢిల్లీ : కేంద్ర ఎన్‌డిఎ ప్రభుత్వంలో కీలక భాగస్వామిగాఉన్న బీహార్ ముఖ్యమంత్రి, జెడియు నేత నితీష్‌కుమార్ మోడీ సర్కారుకు గట్టి మెలిక పెట్టారు. తమ రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇచ్చి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జరిగిన ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఏకంగా తీర్మానం చేయించారు. దీనితో పాటు జాతీయ స్థాయిలో వివాదాస్పదంగా మారిన నీట్ అంశాన్ని కూడా ఈ సమావేశంలో ప్రస్తావించారు. పేపర్ల లీకేజికి కారకులైన వారిని కఠింగా శిక్షించాలని డిమాండ్ చేయడంతో పాటు, పరీక్షల్లో అక్రమాలు నిరోధించేందుకు ప్రత్యేకమైన కఠిన చట్టాన్ని రూపొందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. జెడియు చేసిన ఈ డిమాండ్‌తో మోడీ సర్కారుకు మద్దతిస్తున్న టిడిపితో పాటు, మన రాష్ట్రంలో ప్రతిపక్ష వైసిపి కూడా ప్రత్యేక హోదా కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేవిషయంలో మౌనం దాల్చడం చర్చనీయాంశమైంది. నీట్ విషయంలో కూడా ఈ

నితీష్‌కుమార్‌ను సన్మానిస్తున్న జెడియు నేతలు

రెండు పార్టీలు ఇప్పటి వరకు ఏమీ మాట్లడకపోవడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్‌లోని అధికార, ప్రతిపక్ష పార్టీలు అనుసరిస్తున్న ఈ వైఖరికి భిన్నంగా ఎన్‌డిఎకు మద్దతిస్తూనే జెడియు బీహార్‌కు ప్రత్యేకహోదా ఇచ్చి తీరాలని డిమాండ్ చేయడంతో పాటు, హోదా సాధన కోసం పోరాటాన్ని సాగిస్తామని కూడా జాతీయ కార్యవర్గ సమావేశంలో చేసిన తీర్మానంలో జెడియు పేర్కొంది. 'హోదా బీహార్‌కు అత్యంత ముఖ్యమైన విషయం. దీనిని సాధించి తీరాలి. ' అని కూడా తీర్మానంలో పేర్కొన్నారు. పన్నెండు మంది సభ్యులతో ఎన్‌డిఎ కూటమిలో మూడవ పార్టీగా జెడియు ఉండటం గమనార్హం. సమావేశం ముగిసిన తరువాత జెడియు జాతీయ ప్రతినిధి కెసి త్యాగి మాట్లాడుతూ 'బీహార్‌కు ప్రత్యేకహోదా డిమాండ్ కొత్తదేమి కాదు. రాష్ట్రాన్ని వేగంగా అభివృద్ధిచేయడానికి అదిఎంతో కీలకం' అని అన్నారు. దీనితో పాటు విద్యా సంస్థల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లను 50నుండి 65శాతానికి పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు కొట్టి వేయడంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని కూడా ఈ సమావేశంలో తీర్మానించినట్లు ఆయన చెప్పారు. పార్టీ పనితీరును మరింత మెరుగుపరిచేందుకు గానూ రాజ్యసభ ఎంపి సంజయ్ ఝాను కార్యనిర్వాహక అధ్యక్షుడిగా చేసినట్లు త్యాగి చెప్పారు.

పోలవరం నిర్వాసితుల పునరావాసంపై శ్వేతపత్రం ప్రకటించాలి

సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రాజెక్టు జాప్యంలో కేంద్ర ప్రభుత్వ బాధ్యత తేల్చండి

ముంపును శాస్త్రీయంగా నిర్ధారించండి

3

బాపట్ల జిల్లాలో ఘోరం

- బాలికపై సామూహిక అత్యాచారం

6

ఐపిసి స్థానంలో బిఎన్ఎస్

- ఒకటోతేదీ నుండి అమలుకు ఆదేశాలు
- గెజిట్ విడుదల

3

నీట్‌ను ఎత్తివేయాలి

- ప్రధాని మోడీ,రాహుల్‌కు స్టాలిన్ లేఖ
- అలాగే ఎనిమిది రాష్ట్రాల ముఖ్యమంత్రులకూ..

3

ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- టిడిపి కార్యాలయంలో వెల్లువెత్తిన వినతులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజాసమస్యల పరిష్కారానికి త్వరలోనే ప్రత్యేక వేదిక ఏర్పాటు చేస్తామని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి టిడిపి కార్యాలయానికి తరలివచ్చిన ప్రజల నుంచి శనివారం ఆయన వినతులు స్వీకరించారు. సామాన్య ప్రజలు, కార్యకర్తలు ముఖ్యమంత్రిని కలిసేందుకు భారీగా తరలిరావడంతో టిడిపి కార్యాలయం కిక్కిరిసిపోయింది. దీంతో అక్కడ గందరగోళం ఏర్పడటంతో కొంతసేపు వినతిపత్రాల స్వీకరించడాన్ని నిలిపివేశారు. సర్దుబాటు అయిన తరువాత మరలా స్వీకరించారు. అందరి నుంచి

టిడిపి కార్యాలయంలో మహిళ సమస్యలను వింటున్న చంద్రబాబు

వినతిపత్రాలు తీసుకున్న చంద్రబాబు వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భారీగా తరలివస్తున్న ప్రజలను కలిసేందుకు ఇకపై ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని పార్టీ నేతలకు సూచించారు. ఈ సందర్భంగా చంద్రబాబు తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఐదేళ్ల ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడ్డారో వెల్లువలా వస్తున్న ఈ విన్నపాలను చూస్తే అర్థమవుతోందని ఆయన అన్నారు. ప్రజా సమస్యలు చాలా ఉన్నాయని, వాటన్నింటినీ పరిష్కరించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. గత ప్రభుత్వం సరిగా పనిచేయనందునే సమస్యలతో ప్రజలు భారీగా వస్తున్నారని చెప్పారు. ప్రజా ఇబ్బందులు చూస్తుంటే ఎంతో బాధనిపిస్తోందని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారానికి త్వరలోనే ప్రత్యేక వేదిక ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీ కార్యాలయంలో కూడా ప్రజా సమస్యలు గుర్తించి వాటికి సత్వర పరిష్కారం లభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎయు ప్రతిష్టను దెబ్బతీసిన విసిపై చర్యలు తప్పవు

- కూటమి ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ప్రతిష్టాత్మక ఆంధ్ర యూనివర్సిటీ ప్రతిష్టను దిగజార్చి విసిగా రాజీనామా చేసిన పివిజిడి.ప్రసాదరెడ్డిపై చర్యలు తప్పవని కూటమి ప్రజాప్రతినిధులు అన్నారు. దేవాలయంలాంటి ఎయును రాజకీయ కేంద్రంగా మార్చి భ్రష్టు పట్టించారని విమర్శించారు. అనకాపల్లి ఎంపి సిఎం.రమేష్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ తూర్పు, దక్షిణ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ ఎయును శనివారం సందర్శించారు. అనంతరం వారంతా మీడియాతో మాట్లాడుతూ ప్రసాదరెడ్డిపై విచారణ జరిపి శిక్షించాలని గవర్నర్‌ను కోరారు. రాజీనామా చేసినంత మాత్రాన ప్రసాదరెడ్డిని, ఆయన అరాచకాల్లో భాగస్వామ్యులైన వారినీ వదిలిపెట్టేది లేదన్నారు. ఆచార్య వృత్తిలో ఉంటూ వైసిపి కార్యకర్తగా పని చేశారని, విశ్వవిద్యాలయాన్ని వైసిపి కార్యాలయంగా మార్చివేశారని విమర్శించారు. రూ.100 కోట్ల రుసా నిధుల ఓను దుర్వినియోగం చేశారని, అర్హత లేకపోయినా నచ్చిన వారికి వందల సంఖ్యలో ఉద్యోగాలు ఇచ్చి పునరావాస కేంద్రంగా మార్చారని ఆరోపించారు. సిఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ నేతృత్వంలో ఎయుకు మరలా పూర్వ వైభవం తీసుకొస్తామని చెప్పారు.

ప్రక్షాళన దిశగా గ్రామ, వార్డు సచివాలయ శాఖ

- కీలకశాఖల్లోకి ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎమినిటీస్ సెక్రటరీలు
- కసరత్తు చేస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ వార్డు సచివాలయాల శాఖను ప్రక్షాళన చేసే ఆలోచనలో ప్రభుత్వం కసరత్తును ప్రారంభించింది. ఇందులో భాగంగా సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పట్టణ ప్రాంతాల్లో పనిచేసే వార్డు ఎమినిటీస్ సెక్రటరీలను (మౌళిక వసతుల కల్పన కార్యదర్శి) ఇతర శాఖల్లోకి మార్చాలని యోచిస్తోంది. ఈ రెండు విభాగాల్లో సుమారు 14,500 మంది ఉన్నారు. వీరిని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గృహ నిర్మాణ, ఆర్అండ్‌బి, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖలకు బదిలీ చేసి, ఆయా శాఖల్లో సిబ్బంది కొరతను అధిగమించాలని కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.

అభివృద్ధి కార్యాక్రమాలకు సంబంధించిన ప్రతిపాదనలు, వాటి అమలులో అమినిటీస్ సెక్రటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ల పాత్ర చాలా ప్రధానమైనది. ప్రత్యేకించి నిర్మాణ రంగానికి సంబంధించి గృహాల నిర్మాణ ప్రణాళికకు ఆమోదం మొదలుకొని నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా చూడాల్సిన బాధ్యత కూడా వీరిదే. అలాగే మంచినీటి పైపులైన్లు, రహదారులు, కాల్వల పనుల పర్యవేక్షణ, అనుమతుల మంజూరు వంటి పనులు కూడా వీరి చేయాల్సివుంది. ప్రస్తుతం గృహ నిర్మాణ శాఖలో తగిన సంఖ్యలో ఖాళీలు భర్తీ చేయకపోవడంతో పనులు నత్తనడకనసాగుతున్నాయనే విమర్శ ఉంది. గృహ నిర్మాణ శాఖ ప్రధాన కార్యాలయంలో కీలకమైన మూడు డిజిఎం , రెండు జనరల్ మేనేజర్లు, ఒక ఇడి పోస్టు ఖాళీగా ఉంది. జిల్లాల విషయంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గృహ నిర్మాణం, ఆర్అండ్‌బి, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖల్లో ఉన్న ఖాళీలకు గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులతో భర్తీ చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు సమాచారం.

రైతుల డిమాండ్లు సాధించే వరకు పోరాటమే

- రైతు సంఘాల సమన్వయ సమితి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు రైతు ఉద్యమాలు కొనసాగుతాయని ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి తెలిపింది. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో సమన్వయ సమితి నాయకులు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వడ్డే శోభనాదీశ్వరరావు మాట్లాడుతూ ఢిల్లీ రైతులు సాగించిన 14 మాసాల ఉద్యమం ఫలించిందన్నారు. రైతులకు ద్రోహం చేసిన బిజెపి సంఖ్యాబలం తగ్గిందని చెప్పారు. ఎన్‌డిఎ కూటమి భాగస్వామ్య పార్టీల సహకారం లేకుండా కేంద్రప్రభుత్వ మనుగడ లేదని చెప్పారు. బిజెపి బలం తగ్గటానికి రైతు ఉద్యమమే ప్రధాన కారణమని తెలిపారు. సంయుక్త కిసన్ మోర్చా ప్రవేశపెట్టిన రైతు డిమాండ్లను బలపరచడం వల్ల కాంగ్రెస్ కొంతమేర లాభపడిందని తెలిపారు. మూడో సారి అధికారంలోకి వచ్చిన బిజెపి విధానాల్లో ఎటువంటి మార్పు రాలేదన్నారు. నిజమైన రైతు సంఘాల ప్రతినిధులతో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి చర్చించలేదని చెప్పారు. అనుకూల నకిలీ రైతు ప్రతినిధులతో చర్చలు జరపడం, వాటినే రైతు సంఘాల ప్రతినిధులతో జరిపిన చర్చలుగా చెప్పుకోవడం ప్రధానమంత్రి నరేంద్రమోడీకే చెల్లిందని విమర్శించారు. పార్లమెంట్‌లో రైతు సమస్యలు చర్చకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలపై వచ్చిన వినతులపై కొత్తగా ఏర్పడిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నెల రోజుల వ్యవధిలో పరిష్కరించే వైపు అడుగులు వేయాలని కోరారు. ఢిల్లీలో జరిగే జులై 10న సంయుక్త కిసాన్ మోర్చా అనుబంధ రైతు సంఘాల ప్రతినిధులందరు విస్తృత సమావేశానికి హాజరు కావాలని రైతు నేతలకు విజ్ఞప్తి చేశారు.

ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో పంటలకు, రైతులకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి బీమా కల్పించాలని కోరారు. ఎపి రైతు సంఘం (దాసరి భవన్) నాయకులు కెవివి ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో 14 కోట్ల మంది రైతుల్లో కనీసం 62 వేల మందికి కూడా బీమా సౌకర్యం లభించడం లేదని వాపోయారు. రైతు కూలీ సంఘం నాయకులు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ 10 ఎకరాల లోపు రైతులు 99 శాతం ఉన్నారని, వీరికి ప్రభుత్వ సహాయం అధికంగా అవసరమని చెప్పారు. ఈ సమావేశంలో ఎఐకెఎస్ రాష్ట్ర నాయకులు ఎం కృష్ణయ్య, ఎపి రైతు సంఘాల నాయకులు చుండూరు రంగారావు, కొల్లా రాజమోహన్, ఆళ్ల గోపాలకృష్ణయ్య, కూరప్రసాద్, డి హరినాథ్, తోట ఆంజనేయులు, ప్రభాకర్, ప్రసాద్ బాబు, ఎం వీరబాబు, జి ప్రసాద్, ఎం హరిబాబు, రాధాకృష్ణా, ఎ భవానీ, సూర్యనారాయణ, బి శ్రీనివాసులు, బసవయ్య తదితరులు మాట్లాడారు.

రైతు సంఘాల నాయకులు అతుల్‌కుమార్ అంజన్, యేర్నేని నాగేంద్రబాబు, మాజీమంత్రి యేర్నేని సీతాదేవీ, ఈనాడు సంస్థల అధినేత రామోజీరావుకు తొలుత నివాళులర్పించారు.

షీలా బిడే నివేదిక ప్రకారం ముందుకు..

- విభజన ఆస్తులపై సమీక్షలో మంత్రి నారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

హైదరాబాద్‌లో ఉన్న ఎపి ఆస్తులకు సంబంధించిన అంశంలో షీలాబిడే కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ముందుకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. విభజన చట్టం ప్రకారం ఉమ్మడి చట్టంలో నుండి హైదరాబాద్ వేరుపడటంతో ఇప్పుడు అక్కడున్న ఆస్తుల పంపిణీ చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో శనివారం సిఆర్‌డిఎ కార్యాలయంలో విభజన ఆస్తులకు సంబంధించిన అంశాలపై మంత్రి అధికారులతో చర్చించారు. ఈ చర్చల్లో పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆస్తుల విషయంలో నెలకొన్న విషయాలపై అధికారులు మంత్రికి వివరించారు. అలాగే హైదరాబాద్‌లో ఉన్న ఎపి హౌసింగ్ బోర్డు, డెక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ల్యాండ్ హోల్డింగ్స్ ఆస్తులపై గతంలోనే ఆస్తులు, అప్పులు జనాభా ప్రాతిపదికన విభజించిన అంశాలనూ ఎక్స్‌పర్ట్ కమిటీ ముందుంచినట్లు మంత్రికి వివరించారు. కమిటీ సిఫార్సులు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, తెలంగాణా నుండి రూ.5179 కోట్ల ఎపికి రావాల్సి ఉందని, ఆయా సంస్థల ఆస్తులకు సంబంధించి కోర్టుల్లో ఉన్న కేసులు త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చూడాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు.

కొనసాగుతున్న వివాదం

రాష్ట్ర విభజన పూర్తయి పదేళ్ల జరిగినా ఇప్పటికి రూ.వేల కోట్ల ఆస్తులకు సంబంధించిన అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య వివాదం కొనసాగుతూనే ఉంది. తొమ్మిది, పదో షెడ్యూలలో ఉన్న ఆస్తులు అప్పులు జనాభా ప్రాతిపదికన పంపిణీ చేసుకోవాల్సి ఉంది. అనంతరం తెలంగాణ ప్రాంతం ఎక్కడ ఆస్తులు అక్కడే ఉండాలనే విధంగా కొత్త ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. ఇప్పటికీ కొన్ని సంస్థల విషయంలో పీటముడి వీడటం లేదు. వాటిల్లో మున్సిపల్‌శాఖకు చెందిన ఆస్తులూ ఉన్నాయి.

టిడిపికి డిప్యూటీ స్పీకర్ పదవి ఆఫర్!

- గంటి హరీష్‌కి ఇస్తారా?

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవి ఆశించి భంగపడిన తెలుగుదేశం పార్టీని బుజ్జగించేందుకు డిప్యూటీ స్పీకర్ పదవిని బిజెపి ఆఫర్ చేసినట్లు తెలిసింది. లోక్‌సభలో సొంతంగా మెజార్టీ లేకపోయినప్పటికీ బిజెపి స్పీకర్ పదవి తన వద్దే అట్టిపెట్టుకుంది. అంతగా ప్రాధాన్యత లేని డిప్యూటీ స్పీకర్ పదవిని మిత్రపక్షానికి ఇవ్వజూపింది.. గత లోక్‌సభలో ఆ పదవి మోడీ ప్రభుత్వం భర్తీ చేయకుండా ఖాళీగా ఉంచింది. బిజెపి ఇచ్చిన ఈ ఆఫర్‌ను టిడిపి స్వీకరిస్తుందా లేక తిరస్కరిస్తుందా అన్నది చూడాలి. ఈ ఆఫర్‌ను టిడిపి అంగీకరిస్తే, లోక్‌సభ డిప్యూటీ స్పీకర్‌గా అమలాపురం ఎంపి గంటి హరీష్ అయ్యే అవకాశాలున్నాయి. గంటి హరీష్ తండ్రి జిఎంసి బాలయోగి 1998-99, 1999-2002ల్లో రెండుసార్లు లోక్‌సభ స్పీకర్‌గా పనిచేశారు. వరుసగా రెండుసార్లు స్పీకర్‌గా చేసిన నలుగురిలో జిఎంసి బాలయోగి మూడో వ్యక్తిగా నిలిచారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులు దుర్మరణం

ప్రజాశక్తి- నందిగామ (ఎన్‌టిఆర్ జిల్లా)

ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ మండలం ఐతవరం గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులు దుర్మరణం పాలయ్యారు. విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్ నుండి విజయవాడ వైపు వెళ్తున్న కంటైనర్ రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. అనంతరం లారీ ముందు ఉన్న ఐతవరం గ్రామానికి చెందిన వాటర్ లైన్‌మెన్ సంకు మాధవరావు(59), ఆయన కుమారుడు సంకు రామరాజు (39) మీదుగా వెళ్లింది. దీంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

- గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల ఆందోళన

ప్రజాశక్తి - పెదబయలు (అల్లూరి జిల్లా)

ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలు, పాఠశాలల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు శనివారం పెదబయలులో ఆందోళన చేపట్టారు. ఎంతో కాలంగా గిరిజన గురుకులాల్లో విధులు నిర్వర్తిస్తున్న తమకు ఉపాధ్యాయ నియామకాల్లో అన్యాయం చేస్తున్నారంటూ వారంతా వాపోయారు. తొలుత పెదబయలులోని గురుకుల కళాశాల, పాఠశాలల్లో విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. అనంతరం ఉన్నతాధికారుల దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లేందుకు తాడేపల్లికి బయలుదేరారు. 15 ఏళ్లుగా గిరిజన గురుకులాల్లో తాము పనిచేస్తున్నామని, ఐటిడిఎ అధికారులు మోడ్ ఆఫ్ అపాయింట్‌మెంట్ ద్వారా అతి తక్కువ వేతనం ఇస్తూ తమతో పనిచేయించుకుంటున్నారని తెలిపారు. ఉదయం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు విధులు నిర్వర్తిస్తూ విద్యార్థుల నుండి ఉత్తమ ఫలితాలు సాధించిపెడుతున్న తమపట్ల నిర్లక్ష్యం తగదన్నారు. గెస్ట్, పార్ట్‌టైం, అవుట్ సోర్సింగ్, థర్డ్ పార్టీల పేర్లతో వేతనాలు చెల్లిస్తూ కాలం వెల్లబుచ్చడం దారుణమన్నారు. ఎంత కష్టపడుతున్నా రూ.14 వేల వేతనమే దక్కుతోందని తెలిపారు. ప్రభుత్వ బెనిఫిట్స్ ఏవీ అందడం లేదని వాపోయారు.

సిఎం చంద్రబాబు ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టడం మంచిదే అయినప్పటికీ గురుకులాల్లో పోస్టుల భర్తీ జరిగితే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పునరాలోచించి ప్రస్తుతం విధుల్లో ఉన్నవారిని గురుకులం నిబంధనలను అనుసరిస్తూ రూల్ ఆఫ్ పొజిషన్‌లో ఉపాధ్యాయులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించి మెరుగైన వేతనం ఇవ్వాలని కోరారు.

నీట్ అవకతవకలపై విచారణ జరపాలి

- బిసి సంక్షేమ సంఘం

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

నీట్ పరీక్షలో అవకతవకలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) ద్వారా జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్షను రద్దు చేయాలని కోరారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడారు. ప్రశ్నాపత్రం లీకేజీకి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టిఎ ఉదాసీన వైఖరి కారణంగా బీహార్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో పేపర్ లీకేజీ జరిగిందన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు రోడ్డున పడ్డారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా భేషజాలకు పోకుండా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని నీట్

విలేకర్లతో మాట్లాడుతున్న కేసన శంకరరావు

పరీక్షను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ మాట్లాడుతూ మార్కుల గణనలో ఇష్టారీతిన వ్యవహరించిన ఎన్‌టిఎకు సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చిందని తెలిపారు. ఇకపై అర్హతా పరీక్షలన్నిటినీ అవకతవకలు జరగకుండా, సక్రమంగా నిర్వహించేలా కఠిన చట్టాలను తేవాలని డిమాండ్ చేశారు. ఈ కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని, లేకుంటే బిసి, ఎస్‌టి, ఎస్‌టి, ప్రజా సంఘాలతో కలిసి దీక్షలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

మహానందిలో మళ్లీ చిరుత సంచారం

ప్రజాశక్తి - మహానంది

నంద్యాల జిల్లా మహానంది క్షేత్రంలో మళ్లీ చిరుత సంచారం కలకలం రేపింది. శనివారం తెల్లవారుజామున గోశాల మందు చిరుత సంచరించినట్లు సిసి కెమెరాల ద్వారా ఆలయ అధికారులు గుర్తించారు. ఆలయ పరిసరాల్లో గోశాలను తక్షణమే మార్చాలని అటవీశాఖ అధికారులు సూచనలు చేశారు. చిరుత సంచారం గురించి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, మైకుల ద్వారా యాత్రికులను, గ్రామస్తులను అప్రమత్తం చేయాలని ఆలయ సిబ్బందికి అటవీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

తక్షణమే చిరుతను బంధించాలని గ్రామస్తులు, యాత్రికులు కోరుతున్నారు.

ఎలిమెంటరీ ఉమ్మడి పరీక్ష రద్దు

ప్రజాశక్తి, అమరావతి

రాష్ట్రంలో ఒకటి నుంచి 8 తరగతి (ఎలిమెంటరీ)లకు ఉమ్మడి పరీక్ష నిర్వహించాలంటూ రాష్ట్రం తెచ్చిన నూతన విధానాన్ని హైకోర్టు రద్దు చేసింది. విద్యా హక్కు చట్టంలోని సెక్షన్ 29 ప్రకారం ఎలమెంటరీ విద్యార్థులకు ఉమ్మడి పరీక్ష నిర్వహించడం చెల్లదని హైకోర్టు పేర్కొంది. రాష్ట్రం తెచ్చిన కొత్త విధానం ఎలిమెంటరీ విద్యార్థుల హక్కులను హరించేలా ఉందని చెప్పింది. ఈ పరీక్ష నిర్వహిస్తే విద్యార్థులు ఒత్తిళ్లకు, భయానికి, బాధలకు గురి అవుతారని స్పష్టం చేసింది. కాబట్టి ఎలమెంటరీ విద్యార్థుల తరగతి గది ఆధారిత మదింపు పరీక్ష (సిబిఎ) కోసం తెచ్చిన కొత్త విధానాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రొసీడింగ్స్ చెల్లవని జస్టిస్ వడ్డిబోయన సుజాత ఇటీవల తీర్పు చెప్పారు.

రాష్ట్రంలో కొత విధానాన్ని 2012-14 విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి వచ్చింది. అసైనమెంట్ టెస్ట్, యూనిట్ టెస్ట్, క్వార్టర్లీ, హాఫియర్లీ, వార్షిక పరీక్షలకు బదులు కొత్త విధానం అమల్లోకి వచ్చింది. ఆ తర్వాత విద్యా ప్రమాణాలను, నైపుణ్యాలను పెంపునకు వీలుగా ఒకటి నుంచి 10వ తరగతి వరకు ఉమ్మడి పరీక్ష విధానాన్ని అమలు చేయడమే లక్ష్యంగా సపోర్టింగ్ ది ఆంధ్రాస్ లర్నింగ్ ట్రాన్స్‌ఫార్మేషన్ (సాల్ట్) పేరుతో కొత్త విధానం తెచ్చింది. 1976 నుంచి ఉన్న జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డ్స్ (డీసీఈబీ)లకు పరీక్ష నిర్వహణ బాధ్యత ఇచ్చింది.

ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఉమ్మడి పరీక్షలను నిర్వహించాలని నిర్ణయించింది. సాల్ట్‌ను ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ విద్యా సంస్థలకు అమలు చేయడాన్ని యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ ఫెడరేషన్, కేవీఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ రెండేళ్ల క్రితం సవాల్ చేసిన పిటిషన్లను అనుమతిస్తూ హైకోర్టు తీర్పు చెప్పింది. కొత్త విధానం అమలుకు అధికారులు ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను కూడా రద్దు చేసింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

డిఎస్, రాథోడ్ మృతికి చంద్రబాబు సంతాపం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత ధర్మపురి శ్రీనివాస్(డిఎస్), ఆదిలాబాద్ మాజీ ఎంపి రమేష్ రాథోడ్ మృతిపట్ల టిడిపి అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతాపం ప్రకటించారు. సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉన్న డిఎస్ మంత్రిగా, ఎంపిగా తనదైన ముద్ర వేశారని తెలిపారు. ఆయన మరణం దిగ్భ్రాంతిని కలిగించిందని పేర్కొన్నారు. రాథోడ్ ఆకాల మరణం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. టిడిపితో రాథోడ్‌కు అనుబంధం ఉందని గుర్తుచేసుకున్నారు.

8న బిజెపి విస్తృత స్థాయి సమావేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బిజెపి విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జులై 8న రాజమహేంద్రవరంలో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఈ సమావేశానికి సంబంధించి పార్టీ నేతలతో ఆడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడినట్లు ఆమె తెలిపారు.

కెఆర్ఎంబి చైర్మన్‌గా అతుల్‌జైన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కృష్ణా నది యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) చైర్మన్‌గా కేంద్ర జల సంఘం ఉన్నతాధికారి అతుల్‌జైన్‌ను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి అనిల్‌కుమార్ శర్మ ఆదేశాలు జారీ చేశారు. డిఓపిటి ఆదేశాల మేరకు సెంట్రల్ వాటర్ ఇంజినీరింగ్ (గ్రేడ్ ఏ) సర్వీసులో ఉన్న అతుల్‌జైన్‌ను ప్రస్తుతం పూర్తిస్థాయి చైర్మన్‌గా నియమించారు. గతంలో తాత్కాలిక బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. సర్వీసు విషయంలో ఇటీవల ఢిల్లీ హైకోర్టు తీర్పు ఇచ్చిన అనంతరం మరోసారి కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. జులై ఒకటి నుంచి తాజా ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని పేర్కొన్నది.

వైసిపిపై దాడులను అడ్డుకోండి

- గవర్నర్‌కు వైసిపి వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, తక్షణమే జోక్యం చేసుకోవాలని గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను వైసిపి రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి, అయోధ్యరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. వైసిపి నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులను అడ్డుకోవాలని కోరారు. ఈ మేరకు శనివారం వైసిపి ప్రతినిధుల బృందం శుక్రవారం గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం అయోధ్యరామిరెడ్డి, సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతోందని, వైసిపి నాయకులను, మద్దతుదారులను లక్ష్యంగా చేసుకుని హింస, బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. దీనిపై గవర్నర్‌కు వివరించినట్లు తెలిపారు. ఈ దాడులపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించాలని డిమాండ్ చేశారు. కొన్ని జిల్లాల్లో ప్రభుత్వ ఆస్తులను కూడా టిడిపి కూటమి కార్యకర్తలు ధ్వంసం చేస్తున్నారని పేర్కొన్నారు. మాజీ సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను కూడా తగులబెట్టే పరిస్థితి రాష్ట్రంలో వచ్చిందన్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు చోద్యం చూస్తున్నారే తప్ప కేసులు నమోదు చేయడం లేదన్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం కేటాయించిన భూముల్లోనే, అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతే పార్టీ భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అయినా అక్రమ నిర్మాణాలంటూ పూర్తయ్యే దశలోని తమ పార్టీ భవనాలను కూల్చివేస్తుండటంపై గవర్నర్‌కు వివరించామని తెలిపారు. గవర్నర్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, మాజీ ఎంపి మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నారాయణమూర్తి ఉన్నారు.

ప్రభుత్వ రంగంలోనే స్టీల్‌ప్లాంట్‌ను నడపాలి

- పరిరక్షణ పోరాట కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ప్రభుత్వ రంగంలోనే వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రం నడపాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిసిహెచ్.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1134వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఎస్ఎంఎస్ విభాగానికి చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. సొంత గనులు కేటాయించి, ఆర్థిక సహాయం అందించి పూర్తి స్థాయిలో ఉత్పత్తి జరిపితే స్టీల్‌ప్లాంట్ లాభాల బాట పడుతుందని తెలిపారు. ప్రయివేటీకరణతో రిజర్వేషన్లకు విఘాతం ఏర్పడుతుందన్నారు. త్యాగా లతో ఏర్పడ్డ కర్మాగారాన్ని ఐక్య పోరాటాలతో కాపాడుకుంటామని స్పష్టం చేశారు.

కొండగట్టులో పవన్ కల్యాణ్ ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు అంజన్న ఆలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. డిప్యూటీ సిఎం హోదాలో తొలిసారి కొండగట్టుకు వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం పవన్‌కల్యాణ్‌ను శాలువాతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. కొండగట్టు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, గుట్టపై వంద గదుల నిర్మాణానికి టిటిడి ఆర్థిక సహకారం అందించాలని కొండగట్టు ఆలయ ఇఒ చంద్రశేఖర్ వినతిపత్రం అందజేశారు. పవన్‌కల్యాణ్‌ను చూసేందుకు ఆయన అభిమానులు పెద్దఎత్తున గుట్టపైకి చేరుకోవడంతో వారిని అదుపుచేయడం పోలీసులకు కష్టంగా మారింది. పవన్‌కల్యాణ్ స్వామివారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమైన సమయంలో ఆయన్ను కలిసేందుకు అభిమానులు పోటీపడ్డారు. అభిమానులను అదుపుచేసే క్రమంలో పోలీసులకు, పవన్ అభిమానులకు మధ్య స్వల్ప తోపులాట జరిగింది. కారులో నుంచే పవన్‌కల్యాణ్ అభిమానులకు అభివాదం చేస్తూ వెళ్లిపోయారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ప్రారంభానికి ముందు పవన్ తన ప్రచార వాహనం వారాహికి కొండగట్టులోనే పూజ చేయించారు.

ఉపాధ్యాయ ఖాళీల వివరాలు బయటపెట్టాలి

- మంత్రి లోకేష్‌కు డివైఎఫ్ఐ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఉపాధ్యాయ ఖాళీ పోస్టుల వివరాలను బయటపెట్టాలని ప్రభుత్వాన్ని డివైఎఫ్ఐ రాష్ట్రకమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు జి రామన్న, వై రాము రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు శనివారం లేఖ రాశారు. 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల పాఠశాలల్లో ఎన్ని ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయనే విషయాన్ని బహిర్గతం చేయాలని కోరారు. అలాగే మూతపడ్డ పాఠశాలల వివరాల, తెలుగు మీడియం, జిఒ 117 పేరిట రద్దు చేసిన ఉపాధ్యాయ పోస్టుల వివరాలను కూడా బహిరంగపర్చాలని కోరారు. ఎస్జీటి పోస్టుల భర్తీలో నాలుగు జిల్లాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. నెల్లూరులో 104, ప్రకాశంలో 124, శ్రీకాకుళంలో 144, అనంతపురంలో 183 పోస్టులు మాత్రమే చూపించారని వివరించారు. దీంతో ఈ నాలుగు జిల్లాల అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారని, ఈ పోస్టులు పెంచి న్యాయం చేయాలని కోరారు. అప్రెంటీస్ విధానాన్ని, జిఒ 117ను రద్దు చేయాలని కోరారు. ఏడేళ్లుగా డిఎస్సి నోటిఫికేషన్ లేదని, కాబట్టి వయోపరిమితి సడలింపు 47 ఏళ్లకు ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం రద్దు చేసిన పాఠశాలలు, పిఇటి పోస్టులను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది చివరి నాటికి రిటైర్డ్ అవుతున్న ఉపాధ్యాయుల లెక్కలు, రాష్ట్రంలో ఉన్న సింగిల్ టీచర్ పాఠశాలలను దృష్టిలో ఉంచుకుని పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ప్రస్తుతం డిఎస్సి పోస్టులలో ఎస్జిటి పోస్టుల సంఖ్యను పెంచి ప్రాథమిక విద్యను కాపాడాలని కోరారు. ఉపాధ్యాయుల పదవి విరమణ వయస్సు 62 నుంచి 58కు తగ్గించి యువత శక్తి సామర్థ్యాన్ని ప్రభుత్వం ఉపయోగించుకోవాలని కోరారు. త్వరలో డిఎస్సి నోటిఫికేషన్ వస్తున్న నేపథ్యంలో ఎస్సి,ఎస్టి,బిసి, మైనార్టీ నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణ, స్టడీ మెటీరియల్ ఇవ్వాలని కోరారు.

విజయవాడ-జగదల్‌పూర్ హైవేలో మార్పులు

- కేంద్రాన్ని కోరిన తెలంగాణ ప్రభుత్వం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విజయవాడ - జగదల్‌పూర్ హైవే (ఎన్‌హెచ్30) అలైన్‌మెంట్‌లో కొన్ని మార్పులు చేయాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. కొత్తగూడెం పట్టణం వద్ద బైపాస్ రోడ్ నిర్మించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఖమ్మంలో మీడియాతో తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. రహదారుల నిర్మాణంలో కేంద్రానికి పలు ప్రతిపాదనలు పెట్టామన్నారు. ఖమ్మం జిల్లాలో కొన్ని గ్రామాల మీదుగా హైవే వెళ్తునందున బైపాస్ రోడ్డు నిర్మించాలని కోరినట్లు తెలిపారు. జగ్గయ్యపేట - కొత్తగూడెం రహదారిని నాలుగు లైన్ల రోడ్‌గా విస్తరించాలని కేంద్రాన్ని కోరామన్నారు. భద్రాచలం - రాజమండ్రి జాతీయ రహదారి గతంలో మంజూరైనా పోలవరం ముంపు ప్రాంతం కావడంతో ఇప్పటికీ అది పెండింగ్‌లోనే ఉందని, ఆ రూట్‌ను దమ్మపేట, అశ్వారావుపేట మీదుగా రాజమండ్రి వెళ్లేలా మార్చాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు.

తెలుగోడికి ఎస్‌బిఐ పగ్గాలు..!

- ఛైర్మన్‌గా చల్లా శ్రీనివాసులు

న్యూఢిల్లీ : భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బిఐ) సారథి బాధ్యతలు తొలిసారి తెలుగు వ్యక్తికి దక్కనున్నాయి. తదుపరి ఛైర్మన్‌గా చల్లా శ్రీనివాసులు శెట్టి నియమితులు కానున్నారు. ప్రస్తుతం ఆయన మేనేజింగ్ డైరెక్టర్ హోదాలో ఉన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల చీఫ్ ఎగ్జిక్యూటివ్‌ల నియామక సంస్థ అయిన ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్‌స్ట్యూషన్ బ్యూరో (ఎఫ్ఎస్ఐబి) ఎస్‌బిఐ తదుపరి ఛైర్మన్‌గా శ్రీనివాసులు శెట్టిని ఎంపిక చేస్తూ సిఫార్సు చేసింది. ఈ మేరకు ఎఫ్ఎస్ఐబి శనివారం తన నోటిఫికేషన్‌లో వెల్లడించింది. కాగా.. దీనికి కేంద్ర కేబినెట్ కమిటీ, ప్రధానీ నరేంద్ర మోడీ తుది ఆమోదం తెలుపాల్సి ఉంటుంది. ఎస్‌బిఐ ఛైర్మన్ పదవీ కోసం ముగ్గురు మేనేజింగ్ డైరెక్టర్లను ఎఫ్ఎస్ఐబి ఇంటర్వ్యూ చేసింది. ప్రస్తుత ఛైర్మన్ దినేష్ కుమార్ ఖరా 2020 అక్టోబర్‌లో నియమితులు కాగా.. ఆయన పదవీకాలం 2024 ఆగస్టు 28తో ముగియనుంది.

పోలవరం నిర్వాసితుల
పునరావాసంపై శ్వేతపత్రం ప్రకటించాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్
- ప్రాజెక్టు జాప్యంలో కేంద్ర ప్రభుత్వ బాధ్యత తేల్చండి
- ముంపును శాస్త్రీయంగా నిర్ధారించండి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం నిర్వాసితుల పునరావాసంపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం ప్రకటించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండు చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రాజెక్టు నిర్మాణంలో చోటు చేసుకున్న అవకతవకలపై ఉన్నతస్థాయి విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని, నిర్వాసితులకు పరిహారం చెల్లింపు, పునరావాసం కల్పించడానికి తక్షణ ప్రాధాన్యతనిచ్చి నిధులు కేటాయించాలని కోరారు. దశలతో నిమిత్తం లేకుండా ఒకేసారి ఆర్అండ్ఆర్ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పోలవరంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన శ్వేతపత్రంలో ప్రాజెక్టు నిర్మాణానికి సర్వస్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులకు పరిహారం, పునరావాసం గురించి ప్రభుత్వాలు ఇప్పటి వరకూ తీసుకున్న చర్యలకు సంబంధించిన వివరాలు సమగ్రంగా లేవని తెలిపారు. గడిచిన పదేళ్లుగా నిర్వాసితులకు పరిహారం చెల్లించకుండా పునరావాసం కల్పించకపోవడంతోపాటు, వారు నివసిస్తున్న ప్రాంతాల్లో కనీస అభివృద్ధి లేక త్రిశంకుస్వర్గం మాదిరి నానా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ప్రాజెక్టు అంచనాల్లో లక్షాఆరువేల కుటుంబాలు నిర్వాసితులు అవుతారని పేర్కొనగా సామాజిక ఆర్థిక సర్వే పేరిట దాన్ని 96,660కి కుదించడం దారుణమని పేర్కొన్నారు. ఇప్పటి వరకూ మొదటిదశ పేరుతో 20 వేలమందిని గుర్తించి అరాకొర ప్యాకేజీ అమలు చేయగా సిపిఎం, గిరిజన సంఘాలు రాష్ట్రవ్యాప్త ఉద్యమం తరువాత కాంటూరు లెక్కలు మార్చకుండానే మరో 30 వేల కుటుంబాలు చేరుస్తామని గత రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. ఈ లెక్కలకూ, శ్వేతపత్రం లెక్కలకూ పొంతన కుదరడం లేదని పేర్కొన్నారు. దశలతో నిమిత్తం లేకుండా ఒకేసారి నిర్వాసితులందరికీ పూర్తిస్థాయి పునరావాసం కల్పించేందుకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు నిజానికి ఏళ్లు గడుస్తుంటే జనాభా పెరుగుదల, వయస్సు పెరగడంతో పద్దెనిమిదేళ్లు దాటిన వారి సంఖ్య కూడా పెరుగుతుందని తెలిపారు. కానీ బాధితుల సంఖ్యను తగ్గించడం నిర్వాసితుల పట్ల అమానుషత్వమేనని పేర్కొన్నారు. 2022 వరదల్లో ఊళ్లకు ఊళ్లు గోదాట్లో మునిగిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. . కాఫర్‌డ్యాం నిర్మాణం అనంతరం ఎన్ని అడుగుల మేర నీరు నిలిచింది, ఎన్ని అవాసాలు మునిగిపోయాయన్నది లెక్కతీయాలని కోరారు. ఆ ప్రాతిపదికగా ముంపు గ్రామాలను ప్రకటించాల్సి ఉందని పేర్కొన్నారు. గతంలో చేసిన కాంటూరు లెక్కలు తప్పని గోదావరి వరద ముంపు తేల్చిందని, ముంపును శాస్త్రీయంగా నిర్ధారించడానికి తిరిగి సర్వే చేపట్టాలని కోరారు. ఆగస్టు నెలలో గోదావరికి వరదలొచ్చే ప్రమాదమున్నందున పరివాహక గ్రామాల ప్రజలు ముంపు బారిన పడతారని, వారి భద్రతకు ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో తీవ్ర అక్రమాలు జరిగినట్లు శ్వేతపత్రంలో పేర్కొన్నారని, ఇది జాతీయ ప్రాజెక్టు కనుక డ్యామ్ నిర్మాణంలో జరిగిన అవకతవకలు, సకాలంలో నిధులివ్వకపోవడం, నిర్వాసితులను నిర్లక్ష్యం చేయడం వంటి అంశాల్లో కేంద్ర ప్రభుత్వం దాని ఆధీనంలో సంస్థలు బాధ్యత నుండి తప్పించుకోలేవని తెలిపారు. శ్వేతపత్రంలో కేంద్ర ప్రభుత్వం బాధ్యత గురించి ఒక్క ముక్క కూడా ప్రస్తావించకుండా దాని పాపాలను కాపాడే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేసిందని పేర్కొన్నారు. గత పదేళ్లలో పోలవరం నిర్మాణంలో ఆలస్యానికి పొరపాటుకు కేంద్రం బాధ్యత ఎంతో తేల్చాలని, ఎన్‌హెచ్‌పిసి, హైదరాబాద్ ఐఐటి వంటి సంస్థలు ప్రస్తావించిన సాంకేతిక అవకతవకలపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలన్నారు. ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యం కావడానికి, ప్రజాధనం దుర్వినియోగానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ తరుపున శ్రీనివాసరావు డిమాండు చేశారు.

నీట్‌ను ఎత్తివేయాలి

- ప్రధాని మోడీ,రాహుల్‌కు స్టాలిన్ లేఖ
- అలాగే ఎనిమిది రాష్ట్రాల ముఖ్యమంత్రులకు కూడా..

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

నీట్ కుంభకోణం దేశవ్యాపితంగా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్న నేపథ్యంలో ఈ నీట్ పరీక్షా విధానం నుంచి తమిళనాడును మినహాయించాలని ప్రధాని నరేంద్రమోడీకి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ లేఖ రాశారు. అలాగే ఈ జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్)ను ఎత్తివేయాలని కూడా ఆయన ఆ లేఖలో కోరారు.. ఆదే సమయంలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి, ఎనిమిది రాష్ట్రాల ముఖ్యమంత్రులకు తమిళనాడు ముఖ్యమంత్రి ఇదే విషయమై లేఖలు రాశారు. నీట్ మినహాయింపు కోసం తమిళనాడు చేస్తున్న డిమాండ్‌కు మద్దతు ఇవ్వాలని రాహుల్‌కు రాసిన లేఖలో ఆయన కోరారు. తమిళనాడు అసెంబ్లీ తీర్మానం చేసినట్లుగానే మీ రాష్ట్రాల అసెంబ్లీల్లో నీట్ రద్దుకు తీర్మానాలు చేయాలని తెలంగాణ, కర్ణాటక, కేరళ, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, పంజాబ్ ముఖ్యమత్రులకు ఆయన విజ్ఞప్తి చేశారు. వృత్తిపరమైన కోర్సుల అడ్మిషన్లు ప్రత్యేక ప్రవేశ పరీక్షతో కాకుండా 12వ తరగతి మార్కుల ఆధారంగా చేపట్టే పాత విధానాన్నే పునరుద్ధరించాలని స్టాలిన్ ప్రధానిని కోరారు. నీట్ అనేది విద్యార్థులపై అనవసరమైన అదనపు ఒత్తిడి అని ఆరోపించారు. 'ఈ ఎంపిక ప్రక్రియను తొలగించాల్సిన అవసరంపై ఇతర రాష్ట్రాలు కూడా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నాయి' అని ఆ లేఖలో పేర్కొన్నారు. . నీట్‌ను రద్దు చేయాలని కోరుతూ అసెంబ్లీ చేసిన బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపగా, కేంద్రం పెండింగ్‌లో పెట్టిందని ఆయన గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆ బిల్లుకు ఆమోదం తెలపాలని ఆయన కోరారు.

పింఛన్ల పంపిణీలో సిఎం

ఒకటిన పెనుమాకలో ప్రారంభం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వయంగా పాల్గొననున్నారు. సిఎం కార్యాలయం తెలిపిన సమాచారం మేరకు ఒకటవ తేదిన మంగళగిరి నియోజకవర్గంలోని పెనుమాకలో జరిగే సామాజిక పింఛన్ల పంపిణీ (ఎన్‌టిఆర్ భరోసా)లో సిఎం పాల్గొంటారు. ఉదయం ఆరు గంటలకే ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో సిఎం లబ్ధిదారులకు నేరుగా పింఛను అందచేస్తారు. అనంతరం జరిగే ప్రజావేదిక కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులు, ప్రజలతో మాట్లాడతారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు 65,18,496 మంది లబ్ధిదారులకు రూ.4,399.89 కోట్లు నగదు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అదే రోజు రాష్ట్ర వ్యాప్తంగా ఎంఎల్‌ఏలు, ఎంపిలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు అవుతారు.

పొరపాట్లకు తావు ఇవ్వకండి : సిఎస్

ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా పింఛన్లను సక్రమంగా పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. విజయవాడలోని సిఎస్ క్యాంపు కార్యాలయం నుంచి శనివారం కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పింఛన్ల పంపిణీకి సంబంధించి గ్రామ వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా ఇంటింటి పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించాలన్నారు. అవసరమైతే ఇతర విభాగాల సిబ్బంది సేవలను కూడా వినియోగించుకోవాలన్నారు. ఉదయం 6గంటలకే కార్యక్రమం ప్రారంభించాలని, మొదటి రోజే 95శాతానికి పైగా పింఛన్లు పంపిణీ పూర్తి చేయాలని చెప్పారు. గత ఏప్రిల్,మే, జూన్ నెలలకు 11 కేటగిరిల్లో పింఛన్ దారులకు పెంచిన ఫించన్ మొత్తం బకాయిలను కలిపి జూలై నెల పింఛన్ రూ.4వేలతో కలిపి పంపిణీచేయాలని సిఎస్ ఆదేశించారు.

ఇందుకు సంబంధించిన మొత్తాన్ని ప్రభుత్వం బ్యాంకులకు విడుదల చేసిన మొత్తాన్ని శనివారం రాత్రిలోగా విత్‌డ్రా చేసుకోవాలని చెప్పారు. ఏ బ్యాంకైనా డబ్బును శనివారంరాత్రికి ఇవ్వలేకపోతే , ఆ బ్యాంకులు ఆదివారం తెరిచి ఉంచి సంబంధిత పింఛన్ సొమ్ము మొత్తాన్ని డ్రా చేసి ఇవ్వాలని చెప్పారు. లీడ్ బ్యాంకు మేనేజర్ ఈ దిశలో అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మాట్లాడుతూ పింఛన్ల పంపిణీకి సంబంధించి ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ పథకం నూతన యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. దీనిని పింఛను పంపిణీ అధికారులు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో గ్రామవార్డు సచివాలయాల డైరెక్టర్ ఎం.శివప్రసాద్, ఆర్థిక శాఖ కార్యదర్శి కెవివి సత్యనారాయణ పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకుంటున్నాం : బాబు బహిరంగలేఖ

ఏప్రిల్ నెల నుండి పింఛను పెంచి ఇస్తామంటూ ఎన్నికల ప్రచారంలో చెప్పిన మాటను నిలబెట్టుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.ఈ మేరకు లబ్ధిదారులకు ఆయన బహిరంగ లేఖ రాశారు. ఆ లేఖను కూడా పింఛనుతో పాటు లబ్ధిదారులకు అందచేయనున్నారు. 'మేనిఫెస్టోలో చెప్పినట్లు పింఛన్ ఒకేసారి వెయ్యి పెంచి ఇకపై నెలనెలా రూ.4వేలు ఇవ్వనున్నాం,. అలాగే దివ్యాంగులకు రూ.3వేలు పెంచి రూ.6వేలు, ఇస్తున్నాం.' అని ఆయన లేఖలో పేర్కొన్నారు. 'ఏ ఆశలు, ఆకాంక్షలతో అయితే మీరు ఓట్లు వేసి గెలిపించారో వాటిని నెరవేర్చడమేతక్షణ, ప్రథమ కర్తవ్యంగా ఈ ప్రభుత్వం అడుగులు వేస్తోంది' అని తెలిపారు.

ఐపిసి స్థానంలో బిఎన్ఎస్

- ఒకటోతేదీ నుండి అమలుకు ఆదేశాలు
- గెజిట్ విడుదల చేసిన న్యాయశాఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఇక నుండి భారతీయ నాగరిక సురక్ష సంహిత అమల్లోకి రానుంది. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం శనివారం గెజిట్ విడుదల చేసింది. ఇప్పటికే దీనిపై అన్ని జిల్లాలకు స్పష్టమైన ఆదేశాలు వెళ్లాయి. అన్ని పోలీసు స్టేషన్లలోనూ అవసరమైన ఏర్పాట్లు చేయాలని, సిబ్బందిని నియమించాలని పేర్కొంటూ న్యాయశాఖ కార్యదర్శి వి.సునీత ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ప్రతి పోలీసుస్టేషన్లోనూ ఒక కంట్రోల్ రూము, ఎఎస్ఐ స్థాయికి తగ్గని అధికారిని ప్రత్యేకంగా నియమించాల్సి ఉంటుంది. స్టేషన్‌కు వచ్చే ప్రతి కేసునూ నమోదు చేయడం, ఆన్‌లైన్ పద్ధతిలో అప్‌లోడ్ చేయడం వంటివన్నీ చేయాలి. జులై ఒకటోతేదీ నుండి దీన్ని అమలు చేయాలని సూచించినా ప్రాక్టికల్‌గా పూర్తిగా అలవాటు అయ్యేందుకు కనీసం మూడు నెలలు పడుతుందని సీనియర్ ఐపిఎస్ అధికారులు చెబుతున్నారు. 2023 డిసెంబర్లో పార్లమెంటులో దీన్ని ఆమోదించారు. అన్ని రాష్ట్రాల్లోనూ అమలు చేయాలని కేంద్ర హోమ్‌శాఖ ఆదేశించింది. కొత్త చట్టం ప్రకారం భారతీయ నాగరిక సురక్ష సంహిత కింద కేసులు నమోదు చేయనున్నారు. ఇప్పటి వరకూ ఐపిసి, సిఆర్‌పిసి సెక్షన్లను కేసుల్లో నమోదు చేస్తున్నారు. వాటి స్థానంలో ఇక ముందు బిఎన్ఎస్ అని కేసు నమోదు చేయనున్నారు. అమలు కోసం ఒక్కరోజే వరుసగా పదికిపైగా జిఓలు జారీచేశారు.

బిఎన్ఎస్అమల్లోకి వస్తే

బిఎన్ఎస్ఎస్ అమల్లోకి వస్తే ప్రస్తుత ఉన్న పోలీసు స్టేషన్లలో స్వల్ప మార్పులు జరగనున్నాయి. సాక్షులను విచారించేందుకు జిల్లా, మండల, తాలూకా స్థాయిలో సెక్షన్ 3 సబ్‌సెక్షన్ 265 ప్రకారం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయనున్నారు. బిఎన్ఎస్ అమలు చేసేందుకు సబ్‌సెక్షన్ 194 ప్రకారం పోలీసులకు ప్రత్యేక అధికారాలు సంక్రమించేలా జిఓ నెంబరు 76 విడుదల చేశారు.

కోర్టులో కేసులు

దీనిని అమలు చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు వస్తాయని, ఇప్పటికే శిక్షలు అనుభవిస్తున్న వారు ఇంకా ఇబ్బందులు పడాల్సి వస్తుందని, బిఎన్ఎస్ అమలును నిలిపేయాలనీ కోరుతూ హైకోర్టుల్లో పిటీషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ సాగుతోంది. బిఎన్ఎస్ చట్టం సహజ న్యాయసూత్రాలకు భిన్నంగా ఉందని, రాజకీయ కక్షసాధింపులకు అవకాశం కల్పిస్తుందని పిటీషన్లు పేర్కొన్నారు. మరోవైపు బిఎన్ఎస్ అమలు చేయాల్సిందేనని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. దీనిపై అధికారుల్లో గందరగోళం నెలకొంది. కేసులున్న నేపథ్యంలో అమలు చేయాలా, కోర్టు ఆదేశాల కోసం ఎదురు చూడాలా అనే అంశంపై స్పష్టత కొరవడిందని సీనియర్ ఐపిఎస్ అధికారులు తెలిపారు.

పెండింగ్ బిల్లులు ఎవరు ఇస్తారు?

- అవినాష్‌పై పులివెందుల కౌన్సిలర్లు, వైసిపి నాయకుల అసంతృప్తి

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

వైఎస్ఆర్ జిల్లా పులివెందుల పట్టణంలో పనులు చేసిన వాటికి బిల్లులు మంజూరు కాలేదని, ఆ డబ్బులు ఎవరు ఇస్తారని, పార్టీ కోసం పనిచేసి నష్టపోయామని పులివెందుల కౌన్సిలర్లు, వైసిపి నాయకులు కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డిని ప్రశ్నించారు. కౌన్సిలర్లతో పాటు వైసిపి ముఖ్య నేతలతో ఎంపి అవినాష్ శనివారం సమావేశం నిర్వహించారు. కొంత కాలంగా కౌన్సిలర్లు పార్టీపై అసమ్మతితో ఉన్నారనే సమాచారంతో ఆయన ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా పాడా నిధులతో చేసిన పనులలో సుమారు రూ.250 కోట్ల నిధులు నిలిచిపోవడం పట్ల అసంతృప్తిగా ఉన్నట్లు తెలుసుకున్న అవినాష్‌రెడ్డి కౌన్సిలర్లను సముదాయించే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం బిల్లులు మంజూరు చేసే వరకు వేచి చూద్దామని, అవసరమైతే కోర్టును ఆశ్రయిద్దామని అవినాష్ సర్ది చెప్పారు. గెలుపు, ఓటములు సహజమేనని నిరుత్సాహపడకుండా ఆత్మ విశ్వాసంతో ముందుకు వెళ్దామని సూచించారు. మనందరికీ జగన్ అండగా ఉన్నారని పార్టీని అంటిపెట్టుకుని ఉండాలని కౌన్సిలర్లను కోరారు. కార్యక్రమంలో వైఎస్.మనోహర్‌రెడ్డి, వైఎస్.మదన్ మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు, వైసిపి ముఖ్య నేతలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి అవినాష్‌రెడ్డి

300 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - చోడవరం (అనకాపల్లి జిల్లా)

అనకాపల్లి జిల్లా చోడవరం ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో 300 కిలోల గంజాయిని శనివారం పోలీసులు పట్టుకున్నారు. వారికి అందిన సమాచారం మేరకు ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో తనిఖీలు ముమ్మరం చేశారు. ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా నుంచి అనకాపల్లి వైపు కారులో తరలుతున్న గంజాయిని గుర్తించారు. అనంత పంగి, కిముడు నిరంజన్‌లను అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.15 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

వొడాఫోన్ ఐడియా ఛార్జీల పెంపు

న్యూఢిల్లీ : రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్ బాటలోనే వొడాఫోన్ ఐడియా (విఐ) తన టారిఫ్‌లను పెంచింది. ప్రీపెయిడ్, పోస్ట్ పెయిడ్ మొబైల్ ఛార్జీలను 11-24 శాతం వరకు పెంచింది. రూ.179 ప్లాన్ ధర రూ.199కు చేర్చింది. రూ.459 ప్లాన్‌ను రూ.509కు పెంచింది. 28 రోజుల వ్యాలిడిటీతో 1 జిబి డేటా లభించే ప్లాన్ ఛార్జీని రూ.299 నుంచి రూ.349కు పెంచారు. యాడ్ ఆన్ డేటా ప్లాన్‌లు కూడా పెరిగాయి. ఒక్కరోజు వ్యాలిడిటీతో రోజుకు 1 జిబి డేటా ప్లాన్ ధర రూ.19 నుంచి రూ.22కు చేర్చింది. 6 జిబి రీఛార్జీ ధర రూ.39 నుంచి రూ.48కు పెంచింది. 5జి సేవలను అందుబాటులోకి తేవడానికి వచ్చే త్రైమాసికంలో పెట్టుబడులను ప్రకటించనున్నట్లు వొడాఫోన్ ఐడియా తెలిపింది.

ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

కొత్త నేర చట్టాలను వెనక్కి తీసుకోవాలని ధర్నా

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజా వ్యతిరేక నూతన నేర చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నెల్లూరు ఆర్‌టిసి బస్టాండ్ సెంటర్‌లో ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యాన శనివారం ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ.. ప్రజల హక్కులకు నష్టం చేకూర్చే కొత్త నేర చట్టాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ చట్టాలను అమలు చేయడం వల్ల ప్రజా సమస్యలపై పోరాడే కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు, కార్యకర్తలు నేరస్తులుగా పరిగణింపబడతారని తెలిపారు. పాలకులను ప్రశ్నించే వారిపై రాజకీయ కక్షలో భాగంగా తరచూ దాడులు చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు హరించివేయబడతాయన్నారు. దేశ ప్రజలను పీడించే కొత్త నేర చట్టాలను అమల్లోకి తీసుకురావడం సరికాదని వివరించారు. కొత్త నేర చట్టాలపై ప్రజల్లో విస్తృతంగా చర్చ జరగాలని, అప్పటి వరకు ఈ చట్టాలు అమలు కాకుండా పోరాటాలు చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. సిపిఐ నాయకులు దామా అంకయ్య మాట్లాడుతూ.. ప్రజా వ్యతిరేక నేర చట్టాలపై చర్చలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

రేషన్ బియ్యం మాఫియాకు అడ్డాగా కాకినాడ

- పోర్టు ద్వారా ఎగుమతులు
- మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రేషన్ బియ్యం మాఫియాకు కాకినాడ అడ్డాగా మారిందని, పోర్టు నుంచి ఇతర దేశాలకు ఎగుమతి అవుతున్నాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కాకినాడ పోర్ట్ కేంద్రంగా సాగిన రేషన్ ఎగుమతులపై సిఐడి విచారణకు అప్పగిస్తామని అన్నారు. కాకినాడ పోర్టు ఏరియాలో ఉన్న అశోక ఇంటర్నేషనల్ గోదాము, హెచ్ఒన్ బియ్యం గోదాములను, లాంగర్ రేవు యాంకరేజ్ పోర్టులో ఎగుమతి అవుతున్న బియ్యాన్ని ఆయన శనివారం తనిఖీ చేశారు. గోదాముల్లోని నిల్వలపై స్టాక్ రిజిస్టర్ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. తనిఖీల్లో బయటపడిన 5,800 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మాట్లాడుతూ.. రేషన్ మాఫియా అక్రమాలపై సిఐడి విచారణ కోరతామన్నారు. పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాకినాడ జిల్లా పర్యటనలో తొలిరోజు నిర్వహించిన తనిఖీల్లో 7,615 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేశామని తెలిపారు. లావన్ ఇంటర్నేషనల్, అయ్యప్ప ఎక్స్‌పోర్ట్, విశ్వ ప్రియా, సార్టెక్స్ ఇండియా, సరళా ఫుడ్స్, విఎస్.రాజు సన్స్ గోదాముల్లో పిడిఎస్ బియ్యానికి సంబంధించిన స్పష్టమైన ఆధారాలు దొరకాయన్నారు. రెండో రోజు తనిఖీల్లో పేదలకు అందాల్సిన బియ్యాన్ని కాకినాడ పోర్టు నుంచి ఆఫ్రికన్ దేశాలకు ఎగుమతి చేస్తూ భారీ అవినీతికి పాల్పడ్డుతున్నట్లు వెల్లడైందన్నారు. మిగిలిన గోదాములను తనిఖీ చేసి పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా రీసైక్లింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.1600 కోట్ల మొత్తంలో రూ.1000 కోట్లను రానున్న నాలుగు రోజుల్లో రైతుల ఖాతాలకు జమ చేయనున్నామని తెలిపారు.

ఎంఎస్ఎంఇ ఖాతాదారులకు యాక్సిస్ బ్యాంక్ సత్కారం

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

అంతర్జాతీయ ఎంఎస్ఎంఇ దినోత్సవం సందర్భంగా తమ ఖాతాదారులను సన్మానించినట్లు యాక్సిస్ బ్యాంక్ వెల్లడించింది. గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కాకినాడ, నెల్లూరు, కర్నూలు, రాజమండ్రి, అమలాపురం, అనంతపురం తదితర ప్రాంతాల్లోని యాక్సిస్ బ్యాంకు శాఖల్లో ఈ వేడుకలు ఘనంగా జరిగాయని ఆ బ్యాంక్ ఓ ప్రకటనలో తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లోని 250పైగా ఎంఎస్ఎంఇ కస్టమర్లను వారి కృషికి గాను సత్కరించినట్లు పేర్కొంది. ఈ కార్యక్రమంల్లో యాక్సిస్ బ్యాంక్ సీనియర్ ప్రతినిధులైన నూతి చక్రవర్తి, విజయ్ శెట్టి, రాజేంద్ర జై కుమార్, జె రవీంద్రనాథ్ పాల్గొని ఎంఎస్ఎంఇ రంగాల్లో రాణించిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. 2024 మార్చి 31 నాటికి ఎంఎస్ఎంఇ రంగ రుణాల్లో యాక్సిస్ బ్యాంకుకు 8.4శాతం మార్కెట్ వాటా ఉంది.



వారెన్ బఫెట్ రూ.44వేల కోట్ల దానం

న్యూయార్క్ : ప్రముఖ ప్రపంచ కుబేరుడు, బెర్క్‌షైర్ హత్‌వే ఛైర్మన్ వారెన్ బఫెట్ 5.3 బిలియన్ డాలర్లు (రూ.44,000 కోట్లు) దానం చేయాలని నిర్ణయించారు. ఇందులో 1.3 కోట్ల బెర్క్‌షైర్ హతావే స్టాక్స్‌ను బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్‌కు, నాలుగు కుటుంబ ఛారిటీలకు విరాళంగా ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

2006 తర్వాత బఫెట్ ఇస్తున్న అత్యధిక వార్షిక విరాళం ఇదే. తాజా విరాళంతో కలిపి స్వచ్ఛంద సంస్థలకు ఆయన అందించిన మొత్తం విరాళాలు 57 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.4.7 లక్షల కోట్లు) చేరాయి. గేట్స్ ఫౌండేషన్‌కు బఫెట్ 43 బిలియన్ డాలర్లకు పైగా విలువైన బెర్క్ షైర్ షేర్లను అందించారు.

కాంగ్రెస్ సీనియర్ నేత డిఎస్ కన్నుమూత

- నేడు అధికార లాంఛనాలతో నిజామాబాద్‌లో అంత్యక్రియలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ మాజీ సభ్యులు ధర్మపురి శ్రీనివాస్ (డిఎస్) (76) కన్నుమూశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం తెల్లవారుజామున మూడు గంటలకు తుది శ్వాస విడిచారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గుండెపోటుతో చనిపోయినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. డిఎస్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో చిన్న కుమారుడు ధర్మపురి అర్వింద్ ప్రస్తుతం నిజామాబాద్ ఎంపిగా ఉన్నారు. పెద్ద కుమారుడు సంజయ్ గతంలో నిజామాబాద్ మేయర్‌గా పనిచేశారు. ఆదివారం మధ్యాహ్నం నిజామాబాద్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సీనియర్ నేత డిఎస్ అంత్యక్రియలు అధికారలాంఛనాలతో నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. డిఎస్ మరణం పట్ల సిఎం రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తుచేసుకున్నారు. భౌతికకాయానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు నివాళులర్పించారు. భౌతికకాయంపై కాంగ్రెస్ జెండా కప్పారు. రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నేతలు సంతాపం ప్రకటించారు.

1948 సెప్టెంబర్ 27న జన్మించిన డిఎస్.. నిజాం కళాశాలలో డిగ్రీ పూర్తిచేశారు. 1989లో కాంగ్రెస్ పార్టీ తరపున బరిలోకి దిగారు. నిజామాబాద్ నుంచి తొలిసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. అనంతరం 1999, 2004లో ఎమ్మెల్యేగా గెలిచారు. 1989 నుంచి 1994 వరకు గ్రామీణాభివృద్ధి, ఐ అండ్ పిఆర్ మంత్రిగా.. 2004 నుంచి 2008 వరకు ఉన్నతవిద్య, అర్బన్ ల్యాండ్ సీలింగ్ శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పిసిసి అధ్యక్షులుగా పనిచేశారు. రాష్ట్ర విభజన తర్వాత 2015లో బిఆర్ఎస్‌లో చేరి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. అనంతరం మళ్లీ కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు.

నివాళులర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

జిడిపి స్థిర ఏడాది మార్పు..!

న్యూఢిల్లీ : స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) స్థిర ఏడాది మార్పునకు 26 మందితో కూడిన అడ్వైజరీ కమిటీ ఆన్ నేషనల్ ఎకౌంట్స్ స్టాటిస్టిక్స్ (ఎసిఎన్ఎఎస్)ను ఏర్పాటు చేస్తూ కేంద్ర గణాంకాల శాఖ నిర్ణయం తీసుకుంది. దీనికి ఛైర్మన్‌గా ఇన్స్‌ట్యూట్ ఆఫ్ ఎకానమిక్ గ్రోత్ మాజీ ప్రొఫెసర్ బిస్వంత్ గొల్డర్‌ను నియమించింది. సభ్యుల్లో సిఎస్ఒ మాజీ డైరెక్టర్ జనరల్ జిసి మన్న, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్ మౌసమి దాస్, ఇన్స్‌ట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్ డైరెక్టర్ చేతన్ ఘాటే ఉన్నారు. అదే విధంగా ఆర్‌బిఐ, నీతి అయోగ్, వ్యవసాయ మంత్రిత్వ శాఖ, జిఎస్‌టి నెట్‌వర్క్, వాణిజ్య మంత్రిత్వ శాఖల నుంచి ప్రతినిధులు కమిటీలో సభ్యులుగా ఉంటారు. జిడిపి నూతన స్థిర ఏడాది కోసం ఏర్పాటు చేసిన కమిటీ కాలపరిమితి ఐదేళ్లు లేదా తదుపరి స్థిర ఏడాది పూర్తి అయ్యే వరకు అమల్లో ఉంటుంది. ప్రస్తుతం 2011-12 స్థిర ధరల వద్ద జిడిపిని లెక్కిస్తున్నారు.

సంపాదకీయం

బద్ధకిస్తున్న భారతం

భారతదేశంలోని కిటకిటలాడే వీధుల్లో... జీవితం చురుకైన రంగుల్లో ప్రవహించేచోట... నిశ్శబ్ద మహమ్మారి బద్ధకం, ఉదాసీనత ముసుగు క్రమక్రమంగా ఆక్రమించుకుంటోంది. 'పెద్దలు ఒకప్పుడు తేజస్సుతో నిండిపోయారు/ ఇప్పుడు నిశ్చలంగా వున్నారు, చలనం లేదు/ వారి శరీరాలు క్షీణించాయి/ చింతించే ధోరణి పెరిగింది' అంటాడో కవి. ఆధునిక జీవన శైలికి అలవాటు పడుతున్న భారతీయులు- శారీరక శ్రమకు దూరమౌతూ... జబ్బులకు దగ్గరవుతున్నారు. ఫలితంగా మధుమేహం, ఊబకాయం క్రూరమైన హాస్యం చేస్తున్నాయి. హృదయ సంబంధ వ్యాధులు పెరుగుతున్నాయి. 'ఇచ్చోటనే సత్కవీంద్రుని కమ్మని కలము నిప్పులలోన కరిగిపోయె/ ఇచ్చోటనే భూములేలు రాజన్యుని అధికార ముద్రికల్ అంతరించే/ ఇచ్చోటనే లేత ఇల్లాలి నల్లపూసల సౌరు గంగలో కలిసిపోయె/ ఇచ్చోటనే ఎట్టి పేరెన్నికంగన్న చిత్రలేఖకుని కుంచియ నశించె'- ఈ భూమిని ఏమని వర్ణింతును... ఎందరెందరో మహానుభావులు ఈ భూమిలోనే కలిసిపోయారు అంటారు గుర్రం జాషువ. నదీగమనం వలే ఉరకలెత్తే జీవనాన్ని ఉపేక్షించి, నిద్రకైనా విరామమెరుగని ఆధునిక జీవనయాత్ర నుంచి దూరంకాలేక... ఇచ్చోటనే ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న వైనం, జాషువా చెప్పినట్లుగా అందరికీ వర్తిస్తుంది.

ఒక మనిషి ఆరోగ్యంగా వుండటానికి శారీరక శ్రమ ఎంత అవసరమో ఇప్పటికే అనేక నివేదికలు హెచ్చరిస్తూ వస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వున్న పెద్దల్లో మూడింట ఒక వంతు మంది తగినంత శారీరక శ్రమ చేయడం లేదని, వారానికి కనీసం 150 నిమిషాల తేలికపాటి శ్రమ కూడా చేయడంలేదని వెల్లడైంది. కాగా, సగం మంది భారతీయులు శారీరక శ్రమ చేయడంలేదని తాజాగా 'లాన్సెట్ గ్లోబల్ హెల్త్' పెద్ద బాంబు పేల్చింది. పురుషులతో పోల్చితే ఎక్కువమంది మహిళలు శారీరక శ్రమ చేయడంలేదని తెలిపింది. ఈ నివేదిక ప్రకారం...తగినంత శారీరక శ్రమ చేయనివారిలో మహిళలు 57శాతం వుంటే, పురుషులు 42 శాతం వున్నారు. 195 దేశాల్లో అధ్యయనం చేయగా, శారీరక శ్రమ లేని దేశాల జాబితాలో భారత్ 12వ స్థానంలో వుంది. భారత్ అప్రమత్తం కాకపోతే... కోరి రోగాలను కొని తెచ్చుకున్నట్టేనని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. జన్యు కారణాల వల్ల వచ్చే గుండె జబ్బులు, మధుమేహం వంటి జబ్బుల ముప్పు, మిగతావారికంటే భారతీయులకు పదేళ్ల ముందే మొదలవుతుందని చెబుతున్నారు.

కార్పొరేట్ల ధన దాహంతో పెరిగిన పనిగంటలు, ఎక్కువగా కూర్చుని చేసే ఉద్యోగాలు పెరగడం, వాతావరణ మార్పులు, సౌకర్యవంతమైన రవాణా సదుపాయాలకు పాలకుల నిర్లక్ష్యం తోడైంది. ఏ కాస్త తీరిక దొరికినా, ఆ సమయాన్ని స్మార్ట్‌ఫోన్లు, టీవీలు, సోషల్‌మీడియా దోచుకుంటున్నాయి. ఆ సమయంలో కళ్లకు, నోటికే తప్ప... శరీరానికి పనిలేదు. కళ్లు అలసటకు గురవుతుంటే, ఒళ్లు తిన్నది అరాయించుకోలేక భారమైపోతోంది. భారత్‌లో ఈ సంస్కృతి స్కూలు స్థాయి నుంచే మొదలవుతున్నది. పిల్లలు, యుక్తవయస్కుల్లో కూడా తగినంత శారీరక శ్రమ లేదని ఈ అధ్యయం చెబుతోంది. కార్పొరేట్ స్కూళ్లలో మార్కులు, ర్యాంకుల ఒత్తిడే తప్ప ఆటస్థలాలుండవు. చెమట కూడా పట్టని ఏసీ క్లాసురూమ్‌లలో పిల్లలు జీవమున్న రోబోలు. సరైన శారీరక శ్రమ లేకపోవడంతో లేప్రాయంలోనే ఊబకాయంతో ఆపసోపాలు. చిన్ననాటి నుంచి చదువుతో పాటు, ఆటపాటలను ప్రోత్సహించి, ఆరోగ్యవంతమైన యువతగా, దేశానికి పెట్టని కోటగా మార్చుకుంటున్న దేశాలు అనేకం వున్నాయి. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు పాఠశాలల్లో ఆటస్థలాలు, ఆటలు అవసరమని చైనా, క్యూబా వంటి దేశాలు తాము సాధిస్తున్న పతకాల ద్వారా చెప్పకనే చెబుతున్నాయి. భారత్‌లో అత్యధికంగా వున్న యువత-సంపూర్ణ ఆరోగ్యవంతులుగా వుండాలంటే... వెంటనే వ్యాయామం మొదలెట్టాల్సిందే. పెద్దలు సైతం వారానికి 150 నుంచి 300 నిమిషాలు సైక్లింగ్, వాకింగ్, జాగింగ్, స్విమ్మింగ్ వంటి వ్యాయామాలు మధ్యస్థంగా చేయొచ్చు. కాబట్టి మన శారీరక శ్రేయస్సుకు ప్రాధాన్యతనివ్వాలి. శారీరక శ్రమను జీవితంలో అంతర్భాగం చేసుకోవాలి. 'దేశమంటే మట్టికాదోయ్/ దేశమంటే మనుషులోయ్' అంటారు గురజాడ. దేశం సుసంపన్నంగా వుండాలంటే...దేశంలోని మనుషులంతా ఆరోగ్యంగా వుండాలి.

మహనీయుల మాట

రాజకీయ పరమైన స్వాతంత్ర్యం ఎంత వున్నా అది ఆకలితో అలమటించేవారిని సంతోష పెట్టలేదు.

- వి.ఐ. లెనిన్

సందర్భం

రైతు ఉద్యమాలే కా॥ కొరటాలకు నిజమైన నివాళి

జులై 1న కామ్రేడ్ కొరటాల వర్ధంతి

పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని నిర్మాణం చేయాల్సిందే. అదే సమయంలో పోలవరం నిర్మాణంలో సర్వం కోల్పోతున్న లక్ష మందికి పైగా నిర్వాసితులకు న్యాయమైన నష్టపరిహారం, పునరావాసం ప్రభుత్వం బాధ్యత అన్న విషయం మరువరాదు. వీటితో పాటు వెనుకబడ్డ ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం వెలుగొండ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలి. డెల్టా జిల్లాలలో ధాన్యం రైతులు ప్రభుత్వం నుండి వందల కోట్ల రూపాయలు బకాయిలు రాక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న పంటల బీమా పథకం కార్పొరేట్ కంపెనీలకు తప్ప రైతులకు లాభదాయకంగా లేదు. రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వాలు రైతు అనుకూల విధానాలను రూపొందించాలి. ఆలా చేయకపోతే...కొరటాల సత్యనారాయణ స్ఫూర్తితో సమరశీల రైతు ఉద్యమాలకు రాష్ట్ర రైతాంగం సిద్ధం కావాలి. అదే కామ్రేడ్ కొరటాలకు అర్పించే నిజమైన నివాళి.

కామ్రేడ్ కొరటాలగా అందరూ పిలుచుకునే ప్రియతమ నేత, సిపిఎం రాష్ట్ర కమిటీ పూర్వ కార్యదర్శి, పొలిట్‌బ్యూరో మాజీ సభ్యులు, రైతు, వ్యవసాయ కార్మిక, చేనేత కార్మిక సంఘాల ఉద్యమ సారథి కొరటాల సత్యనారాయణ 18వ వర్ధంతి జులై ఒకటవ తేది.

కొరటాల సత్యనారాయణ గుంటూరు జిల్లా అమృతలూరు మండలం ప్యాపర్రు గ్రామంలో 1923 సెప్టెంబర్ 24వ తేదీన భూస్వామ్య కుటుంబంలో జన్మించారు. విద్యార్థి దశలోనే పద్నాలుగేళ్ల వయసులో డిటెన్షన్‌కు వ్యతిరేకంగా జరిగిన విద్యార్థి ఉద్యమంతో ప్రజా జీవితంలోకి ప్రవేశించిన కొరటాల 2006 జులై 1వ తేదీన అనారోగ్యంతో మరణించే వరకు ఏడు దశాబ్దాల పాటు ఎర్రజెండా చేత పట్టుకుని అలుపెరుగని పోరాటం నిర్వహించారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్బంధ కాలంలో నాలుగేళ్ల పాటు అజ్ఞాత జీవితం గడిపారు. అజ్ఞాత జీవితంలో ఉండగా 1948లో అరెస్టు చేసి సుమారు మూడు సంవత్సరాలకు పైగా బళ్లారి, కడలూరు జైళ్లలో నిర్బంధించారు. చల్లపల్లి జమిందారుకు వ్యతిరేకంగా జరిగిన భూపోరాటంలో, పేదల స్వాధీనంలో ఉన్న బంజరు భూముల పోరాటంలో, నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని, కరువు నుండి రాయలసీమను విముక్తి చేసేందుకు రాయలసీమ ప్రాంతానికి కృష్ణా జలాలు మళ్లించాలని సాగిన పోరాటాలలో, రైతులు, చేనేత కార్మికుల ఆత్మహత్యలు నివారించాలని, రైతులకు పంటలకు మద్దతు ధరలు కల్పించాలని జరిగిన పోరాటాలలో కొరటాల క్రియాశీలక పాత్ర పోషించారు.

కె. ప్రభాకర రెడ్డి

రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా రాష్ట్రంలో కరువు, తుఫాన్ వంటి ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా బాధితుల పక్షాన నిలబడి ఉద్యమాలు నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంభవించిన పత్తి రైతుల ఆత్మహత్యలపైన, వరి, పత్తి, కంది, మిరప, పొగాకు వంటి పంటలకు కనీస మద్దతు ధరల కోసం ఉద్యమాలు నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకునిగా వ్యవసాయ కార్మికులకు బంజరు భూములు పంచాలని, కూలి రేట్ల పెంపుదల, ఉపాధి వంటి సమస్యలపై ఉద్యమాలు నిర్వహించారు. చేనేత కార్మిక సంఘం బాధ్యుడిగా చేనేత కార్మికుల మజూరి, రంగుల ధరలు, చేనేత కార్మికుల ఆత్మహత్యలు వంటి సమస్యలపై ఎనలేని కృషి చేశారు. తాను ఏ రంగంలో పని చేసినా ప్రజా సమస్యల పరిష్కారం కోసం లోతైన అధ్యయనంతో ఉద్యమ నిర్మాణానికి కొరటాల కృషి చేశారు.

రైతు వ్యతిరేక విధానాలపై...

2024 పార్లమెంట్ ఎన్నికలలో చావు తప్పి కన్ను లొట్ట పోయినట్లుగా బొటా బొటీ మెజారిటీతో, చంద్రబాబు, నితీష్ కుమార్ వంటి మిత్రుల మద్దతుతో కేంద్రంలో బిజెపి, నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి వచ్చింది. అయినా బిజెపి, నరేంద్ర మోడీ ప్రభుత్వం తన వెనుకటి విధానాల నుండి ఏ మాత్రం పక్కకు వైదొలగలేదన్నది స్పష్టమవుతున్నది.

జూన్ 19న 2024-25 సంవత్సరానికి 14 రకాల వ్యవసాయ ఉత్పత్తులకు కేంద్ర ప్రభుత్వం అరకొరగా మద్దతు ధరలను ప్రకటించి రైతాంగం పట్ల తన వైఖరిని మరోమారు వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలతో రైతాంగం క్వింటాలుకు వరి పైన రూ.712, కందులకు రూ.2,206, మినుములకు రూ.2,344, వేరుశనగకు రూ.1,713, పత్తికి రూ.2,224 నష్టపోతున్నారు. వ్యవసాయ ఖర్చులు 18 శాతం నుండి 35 శాతం వరకు పెరుగుతుంటే మద్దతు ధరలు మాత్రం 5 నుండి 10 శాతం మాత్రమే పెంచారు. పెట్టుబడిపై 50 శాతం (సి2+50 శాతం) లాభం కలిపి పంటలకు మద్దతు ధర నిర్ణయించాలన్న డా॥స్వామినాథన్ కమిటీ సిఫారసులను ఏ మాత్రం అమలు చేయకుండా పక్కన పెట్టిన ఘనత నరేంద్ర మోడీ ప్రభుత్వానిదే.

కార్పొరేట్ అనుకూల సాగు విధానాలు

నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం 2019లో తెచ్చిన మూడు రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని కోరుతూ నిర్బంధాలను లెక్క చేయకుండా రైతాంగం పెద్ద ఎత్తున చారిత్రాత్మక ఉద్యమం నిర్వహించింది. దీంతో ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. ఆ సందర్భంగా నరేంద్ర మోడీ స్వయంగా పార్లమెంటులో రైతులకు క్షమాపణలు చెప్పి మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కు తీసుకుంటున్నామని ప్రకటించారు. రైతుల ప్రతినిధులతో చర్చించి మద్దతు ధరలిచ్చేలా పార్లమెంటులో చట్టం తెస్తామని, విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరించుకుంటామని హామీ ఇచ్చారు. కాని ఆ చట్టాలను మరో రూపంలో అమలు చేస్తూ రైతు కేంద్రంగా ఉన్న మన వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నది. వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు అవసరమైన ఎఫ్‌సిఐ గిడ్డంగులను ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీలకు ఇస్తున్నది. విద్యుత్ రంగంలో తెస్తున్న సంస్కరణలతో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ప్రశ్నార్థకం కానుంది. వ్యవసాయ రంగంపైనే కాక, గృహ విద్యుత్ వినియోగదారులపైనా విపరీతంగా భారం పడే అవకాశం ఉంది.

రైతు వ్యతిరేక విధానాలపై ఉమ్మడి పోరాటాలు

రూ.20,000 వ్యవసాయ పెట్టుబడి సాయం, రూ.2 లక్షల వరకు పంట రుణాలు రద్దు, సున్నా వడ్డీ, పావలా వడ్డీ బకాయిల విడుదల వంటి ఎన్నికల హామీలను టిడిపి సంకీర్ణ ప్రభుత్వం అమలు చేయాలి. కేరళ తరహాలో రాష్ట్రంలో రైతు రుణ విమోచన చట్టం తీసుకురావాలి. పంటలకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధరలకు అదనంగా క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించి అమలు చేయాలి. కేంద్రం ప్రకటించని పంటలకు రాష్ట్ర ప్రభుత్వమే మద్దతు ధరలు ప్రకటించి అమలు చేయాలి. ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి మార్కెట్ ఒడుదుడుకులలో రైతుకు అండగా నిలవాలి.

పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని నిర్మాణం చేయాల్సిందే. అదే సమయంలో పోలవరం నిర్మాణంలో సర్వం కోల్పోతున్న లక్ష మందికి పైగా నిర్వాసితులకు న్యాయమైన నష్టపరిహారం, పునరావాసం ప్రభుత్వం బాధ్యత అన్న విషయం మరువరాదు. వీటితో పాటు వెనుకబడ్డ ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం వెలుగొండ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలి. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైసిపికి రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రజలు పెద్ద గుణపాఠం నేర్పారు. దీని నుండి తెలుగుదేశం ప్రభుత్వం పాఠాలు నేర్చుకోవాలి. వెనుకబడ్డ ప్రాంతాల సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

శ్రీకాకుళం జీడి మామిడి రైతులు, కోనసీమలో కొబ్బరి రైతులు, రాయలసీమలో ఉద్యానపంటల రైతులు, చిత్తూరు, ఎన్టీఆర్ జిల్లాలలో మామిడి రైతులు, కృష్ణా, గోదావరి డెల్టా జిల్లాలలో లక్షలాది మంది కౌలురైతులకు ప్రభుత్వం అండగా నిలవాలి. పత్తి, మిరప, చెరుకు, పొగాకు వంటి వ్యాపార పంటలు పండించే రైతులు మార్కెట్ ఒడిదుడుకులకు తీవ్రంగా నష్టపోతున్నారు. డెల్టా జిల్లాలలో ధాన్యం రైతులు ప్రభుత్వం నుండి వందల కోట్ల రూపాయలు బకాయిలు రాక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న పంటల బీమా పథకం కార్పొరేట్ కంపెనీలకు తప్ప రైతులకు లాభదాయకంగా లేదు. రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వాలు రైతు అనుకూల విధానాలను రూపొందించాలి. ఆలా చేయకపోతే...కొరటాల సత్యనారాయణ స్ఫూర్తితో సమరశీల రైతు ఉద్యమాలకు రాష్ట్ర రైతాంగం సిద్ధం కావాలి. అదే కామ్రేడ్ కొరటాలకు అర్పించే నిజమైన నివాళి.

/ వ్యాసకర్త ఎ.పి రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి /

జనవాక్యం

టోఫెల్‌పై స్పష్టత అవసరం

గత ఏడాది మన రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మూడు నుండి తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంచే ఉద్దేశంతో టోఫెల్‌ను ప్రవేశ పెట్టింది. గత ఏడాది కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే ఈ కోర్స్ అమలయింది. ఈ విద్యా సంవత్సరం నుండి టోఫెల్ ఒక సబ్జెక్టుగా ఉంటుందని అప్పటి విద్యా శాఖాధికారులు ప్రకటించారు. ప్రస్తుతం ప్రభుత్వం మారిన నేపథ్యంలో టోఫెల్‌పై ఒక స్పష్టత రావాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే ఇంగ్లీష్ పాఠ్య పుస్తకంతో పాటు, వర్క్‌బుక్ కూడా విద్యార్థులకు ఉంది. తొమ్మిది, పదవ తరగతి విద్యార్థులకు పాఠ్య పుస్తకం, వర్క్‌బుక్‌తో పాటు, ఉప వాచకం కూడా వుంది. ఇటువంటి పరిస్థితులలో ఇంగ్లీష్ సిలబస్ విద్యార్థులతో పాటు, ఉపాధ్యాయ సిబ్బందికి కూడా భారంగా మారిందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. టోఫెల్ ఉద్దేశం మంచిది అయినప్పటికీ, సిలబస్ పూర్తి చేయడానికి పాఠశాల పని దినాలు సరిపోవని ఉపాధ్యాయ సిబ్బంది అంటున్నారు. దీనిపై పునఃసమీక్ష చేయాల్సిన అవసరం ఉందని వారు చెబుతున్నారు.

- యం. రాంప్రదీప్, తిరువూరు.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

ప్రస్తుతం

కొత్త మలుపుల్లో కేంద్ర రాష్ట్ర రాజకీయాలు



ఎన్‌డిఎలో కీలక భాగస్వామి అయినప్పటికీ రాష్ట్రంలో టిడిపి నాయకత్వమే వుంది గనక లౌకికతత్వానికి, మత సామరస్యానికి భంగం కలిగించే ఎలాంటి చర్యలకూ అవకాశం ఇవ్వరాదని ప్రజాస్వామిక వాదులు ఆకాంక్షిస్తున్నారు. రాష్ట్రంలో అసహన రాజకీయాలు, కక్ష సాధింపు వాతావరణం మారాలని, మీడియాపై ఆటంకాలు తొలగిపోవాలని ఎదురు చూస్తున్నారు. విభజిత రాష్ట్రంలో వరుసగా మూడు సార్లు ప్రభుత్వాలు మారుతున్న నేపథ్యంలో ఈ రెండు రాష్ట్ర పార్టీల మధ్యనే పరిభ్రమిస్తూ కేంద్రం పాత్ర మరుగుపడే పరిస్థితికి అవకాశమివ్వడం వాంఛనీయం కాదు. పోలవరంపై శ్వేతపత్రం విడుదల చేయడం వరకూ బాగానే వున్నా ఈ మొత్తం వ్యవహారంలో కేంద్రం పాత్రపై పల్లెత్తు మాట అనకుండా వుండటం ఎలా సాధ్యం? రాజధాని నిర్మాణం, విభజన సమస్యలు హామీలు అన్నిటికీ ఇది వర్తిస్తుంది. ఇప్పటికీ వైసిపి కేంద్రంలో బిజెపినే మోస్తున్న తీరు చూస్తే ఎ.పి లో మోడీ ద్వంద్వ రాజకీయంలో మార్పు లేదనే అర్థమవుతుంది.

ఎన్నికలు ముగిసి కొత్త సభలు కొలువు తీరిన సందర్భం. ఎ.పి శాసనసభ సభ్యుల ప్రమాణాలతో వాయిదా పడగా పార్లమెంటు ఉభయ సభలు వేడివేడిగా నడుస్తున్నాయి. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వాల తొలి అడుగులు వాటి పని తీరు ఎలా వుండబోయేది సంకేత ప్రాయంగా చెబుతున్నాయి. స్వంత మెజార్టీ కోల్పోయి మిశ్రమ సర్కారుగా మారినప్పటికీ మోడీ ప్రభుత్వం మౌలికంగా హిందుత్వ కార్పొరేట్ ఏకపక్ష నమూనాలోనే నడవబోతుందని స్పష్టమై పోతున్నది. గత రెండు పర్యాయాలు కాంగ్రెస్ కోరినా ప్రతిపక్ష హోదా ఇవ్వడానికి నిరాకరించిన స్పీకర్ ఈసారి అనివార్యంగా ప్రజల తీర్పుతోనే రాహుల్ గాంధీని ప్రతిపక్ష నేతగా ప్రకటించాల్సి వచ్చింది. అయితే దీటైన ప్రతిపక్ష వేదికగా 'ఇండియా' వున్నా ప్రజాస్వామ్య స్ఫూర్తితో వ్యవహరించే ప్రసక్తి లేదని లోక్‌సభ తొలి సమావేశాలనే వాయిదా వేయడం ద్వారా కేంద్రం చెప్పేసింది. దేశమంతటినీ ఆందోళన పరిచిన నీట్‌పై చర్చకు నిరాకరించడంలో నిరంకుశత్వం ప్రస్ఫుటమైంది. అలాగే డిప్యూటీ స్పీకర్ పదవికి ప్రతిపక్షాల అభ్యర్థనను పరిశీలించడానికి కూడా నిరాకరించడంలో సర్కారు సిద్ధం కాకపోవడం దాని భయాన్ని ప్రతిబింబిస్తున్నది. పదేళ్ల పోరాటం తర్వాత భారత రాజకీయ రంగంలో ప్రజాస్వామ్య లౌకిక శక్తుల పోరాటానికి ఒకింత చోటు లభించడం సానుకూల పరిణామం.

ఎ.పి విషయానికి వస్తే కేంద్రంలో పాలక కూటమి అతి పెద్ద మద్దతుదారుగా వున్న తెలుగుదేశం, దాని మిత్రపక్షాలైన జనసేన, బిజెపిల పాలన ప్రారంభమైంది. మోడీకి స్వంతంగా మెజార్టీ లేదుగనక కింగ్ మేకర్‌గా చంద్రబాబు నాయుడు స్పీకర్ పదవి కోరతారని, ఏదో తేడా వస్తుందని మీడియాలో వెలువడిన ఊహాగానాలు నిజం కాలేదు. ఎ.పి బిజెపి అధ్యక్షురాలైన పురందేశ్వరి పేరు తెలుగు మీడియాలో విరివిగా వినిపించినా ఆ ప్రభావం కనిపించలేదు. డిప్యూటీ స్పీకర్‌గా బిజెపి భాగస్వామ్య పక్షాలకు అవకాశం అంటున్నారు గనక ఏం జరిగేది చూడవలసి వుంటుంది. ఏమైనా టిడిపి, దాని తర్వాత ప్రధాన మద్దతుదారుగా వున్న జెడియులు ఎ.పి, బీహార్ రాజకీయాల కోణంలో రాష్ట్రాల కోసం తప్ప కేంద్ర బిజెపి విధానాలను ప్రభావితం చేయడం జరగదని అర్థమవుతున్నది. ఆ విధమైన విధాన ప్రకటనలు, సూచనలు కూడా ఏమీ వెలువడింది లేదు. రాష్ట్రంలో వైసిపి పాలనపై శ్వేతపత్రాలను విడుదల చేయడంలో చంద్రబాబు ప్రభుత్వం నిమగ్నమై వుంది. అధికారుల నియామకాలు, బదిలీలు, పాత పాలకుల ఏజంట్లుగా వ్యవహరించిన వారికి హెచ్చరికలు వీటిపై దృష్టి కేంద్రీకృతమైంది. ఎన్నికల అనంతర ఉద్రేకాలు, ఉద్రిక్తతలు కూడా తీవ్రంగానే వుంటున్నాయి. సరైన అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలాల్లో కట్టారంటూ వైసిపి కార్యాలయాలకు నోటీసులు, కూల్చివేతలపై కోర్టుకు వెళ్లగా స్టే ఇచ్చి తీర్పు రిజర్వు చేశారు. తప్పులు జరిగి వుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి గాని కూల్చివేతలకు దిగితే గతంలో వలెనే కక్ష సాధింపు వాతావరణం పునరావృతమవుతుందని సిపిఎం, కాంగ్రెస్ వంటి పార్టీలూ, మీడియా కూడా వ్యాఖ్యానించిన పరిస్థితి. అసలు మాజీ ముఖ్యమంత్రి జగన్ కార్యాచరణ కూడా ఇప్పటికీ వెల్లడి కాకపోగా అసలు శాసనసభకు వస్తారా అనేదానిపైనే సందేహాలు నెలకొన్న విచిత్ర పరిస్థితి.

తెలకపల్లి రవి

జగన్ లేఖ

బలం తగ్గిన తాము శాసనసభకు వెళ్లినా సమయం ఇస్తారనే నమ్మకం లేదని జగన్ మొదట్లోనే మాట్లాడారు. తనపై తీవ్ర దుర్భాషలాడిన వ్యక్తిని స్పీకర్‌ను చేస్తున్నారని విమర్శించారు. సభ్యుడుగా ప్రమాణ స్వీకారం తర్వాతా ఆయన గాని ఇతర వైసిపి సభ్యులుగాని మీడియాతో పెద్దగా మాట్లాడలేదు. స్పీకర్ ఎన్నికలో గానీ పదవీ స్వీకారంలో గాని పాల్గొనలేదు. తర్వాత జగన్ ఆయనకు లేఖ రాస్తూ తన ఆరోపణను పునరుద్ఘాటించారు. ప్రతిపక్ష నాయకుడి హోదా ఇస్తే సభకు వస్తామని, లేకపోతే ప్రయోజనం వుండదన్నట్లు దాంట్లో పేర్కొన్నారు. లోక్‌సభ ఆనవాయితీ ప్రకారం ప్రతిపక్ష నాయకుడి హోదాకు అవసరమని భావిస్తున్న పది శాతం సీట్లు వైసిపికి రాలేదు గనక ఆ అవకాశం వుండదనే అభిప్రాయం బలంగా వుంది. దీనిపై భిన్న వాదనలు వినిపిస్తున్నా చట్టపరంగా మాత్రం ఇవ్వాలని చెప్పే బలమైన ఆధారాలు లేవు. ఇప్పుడు వైసిపికి వచ్చిన 11 సీట్ల కన్నా చాలా ఎక్కువ సీట్లు వచ్చిన సందర్భంలోనూ ప్రతిపక్ష నేతకు క్యాబినెట్ హోదా ఇవ్వలేదు. ఉమ్మడి ఎ.పి శాసనసభలో గానీ, గత రెండు లోక్‌సభలలో గానీ హోదాను ఆ కారణంగానే నిరాకరించారు. గత రెండు లోక్‌సభలలో కాంగ్రెస్‌కు 50 పైనే స్థానాలున్నా ఫలితం లేకపోయింది. ఫిరాయింపుల నిరోధ చట్టం తర్వాత పది శాతం వుంటేనే రాజకీయ పక్షం లేకపోతే గ్రూపు అన్న నిర్వచనం వర్తించదని ఒక వాదన, అయితే ఆ మేరకు పాత నిబంధనలు సవరించలేదు గనక ఆ వాదన నిలవదు. గతంలో పి.జనార్ధనరెడ్డి, పి.ఉపేంద్రలకు పది శాతం లేకున్నా హోదా ఇచ్చారంటూ జగన్ ఇచ్చిన ఉదాహరణ కూడా పూర్తిగా నిజం కాదు. అతి పెద్ద ప్రతిపక్ష గ్రూపు నేతలుగా గుర్తించడం తప్ప రాజ్యాంగబద్ధమైన ప్రతిపక్ష నేతలుగా వారికి సదుపాయాలు కల్పించింది లేదు. 70 మంది సభ్యులు గల ఢిల్లీ శాసనసభలో బిజెపికి ముగ్గురే వున్నా హోదా ఇచ్చిన ఉదాహరణ వుంది కాని అది అంతిమంగా స్పీకర్ విచక్షణపైనే ఆధారపడి, ఆయన ద్వారానే జరగవలసి వుంటుంది. ఎ.పి లో ఇప్పుడున్న అసహన వాతావరణంలో ఆ విధమైన అవకాశం లేదు. సూటిగా తిరస్కరించారు కూడా. ప్రజల తీర్పును గౌరవించి సభలో పాల్గొనాలనే అభిప్రాయమే అన్ని పార్టీలూ వెలిబుచ్చాయి. పైగా గత ప్రభుత్వానికి సంబంధించిన విమర్శలపై సమాధానాలు చెప్పడం ఆయన బాధ్యత కూడా. ఈ నేపథ్యంలో జగన్ లేఖ రాజకీయంగా రాసింది మాత్రమేనా లేక దానికి కట్టుబడి సభకు వచ్చినా ప్రయోజనం వుండదని సమర్థించుకోవడానికి ప్రయత్నమా అనేది ఆచరణలో చూడాలి.

రెండు రాష్ట్రాల సమస్యలు-బిజెపి

కేంద్రం నుంచి ఎ.పి ప్రయోజనాల సాధనకు తీవ్ర కృషి జరగాలని ప్రజలు కోరుకుంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత ప్రభుత్వ తప్పిదాలనూ లోపాలను నివేదించడంతో పాటు తాము ఇచ్చిన హామీల అమలుకు తొలి సానుకూల ప్రాధాన్యత ఇవ్వాలని ఆశిస్తున్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకోవడం వంటివి మరింత కీలకమవుతాయి. ఎన్‌డిఎలో కీలక భాగస్వామి అయినప్పటికీ రాష్ట్రంలో టిడిపి నాయకత్వమే వుంది గనక లౌకికతత్వానికి, మత సామరస్యానికి భంగం కలిగించే ఎలాంటి చర్యలకూ అవకాశం ఇవ్వరాదని ప్రజాస్వామిక వాదులు ఆకాంక్షిస్తున్నారు. రాష్ట్రంలో అసహన రాజకీయాలు, కక్ష సాధింపు వాతావరణం మారాలని, మీడియాపై ఆటంకాలు తొలగిపోవాలని ఎదురుచూస్తున్నారు. విభజిత రాష్ట్రంలో వరుసగా మూడు సార్లు ప్రభుత్వాలు మారుతున్న నేపథ్యంలో ఈ రెండు రాష్ట్ర పార్టీల మధ్యనే పరిభ్రమిస్తూ కేంద్రం పాత్ర మరుగుపడే పరిస్థితికి అవకాశమివ్వడం వాంఛనీయం కాదు. పోలవరంపై శ్వేతపత్రం విడుదల చేయడం వరకూ బాగానే వున్నా ఈ మొత్తం వ్యవహారంలో కేంద్రం పాత్రపై పల్లెత్తు మాట అనకుండా వుండటం ఎలా సాధ్యం? రాజధాని నిర్మాణం, విభజన సమస్యలు, హామీలు అన్నిటికీ ఇది వర్తిస్తుంది. ఇప్పటికీ వైసిపి కేంద్రంలో బిజెపినే మోస్తున్న తీరు చూస్తే ఎ.పి లో మోడీ ద్వంద్వ రాజకీయంలో మార్పు లేదనే అర్థమవుతుంది. ఇదే సమయంలో తెలంగాణ గవర్నర్‌గా వున్న బిజెపి నేత రాధాకృష్ణన్ చంద్రబాబును కలుసుకోవడం, బిఆర్ఎస్, బిజెపి కలసి పాచికలు వేస్తున్నాయనే వార్తలు, మరోవైపు బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు భిన్న సంకేతాలకు ఆస్కారం ఇస్తున్నాయి. మరింత పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ ఎంఎల్ఎలు కాంగ్రెస్‌లో చేరతారనే వార్తల నేపథ్యంలో బిజెపి ఎలా వ్యవహరిస్తుందనేది చూడవలసిందే. టిడిపిని మళ్లీ తెలంగాణలో క్రియాశీలం చేయడానికి చంద్రబాబు నిర్ణయాలు చేస్తున్నట్టు కనిపిస్తుంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా తెలంగాణ సందర్శనలు చేస్తున్నారు. తెలంగాణలో ఎన్‌డిఎను ఏర్పాటు చేసేందుకు అడుగులు పడుతున్నాయా అని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. చంద్రబాబుపై తనకు ఎంత గౌరవభావం వున్నా తన పదవికే ఎసరు తెచ్చుకునేలా ఎందుకు వ్యవహరిస్తానని రేవంత్ రెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలు ఆయన ఆలోచనను వెల్లడించాయనుకోవాలి.

ప్రత్యేక పరిస్థితి

ఏది ఏమైనా రెండు తెలుగు రాష్ట్రాల సమస్యలను సహేతుకంగా రాజ్యాంగ బద్ధంగా పరిష్కరించి సహాయపడే బదులు తన స్వప్రయోజనాల కోసం కేంద్రంలోని బిజెపి ఉభయ పక్షాలతో చెలగాటమాడటం నష్టదాయకం అవుతుంది. వివిధ రాష్ట్రాలలో తనతో చేతులు కలిపిన ఎజిపి, జెడిఎస్, బిఎస్‌పి, జెడియు వంటి పార్టీలను పథకం ప్రకారం దెబ్బ తీస్తూ వస్తున్న బిజెపి తెలుగు రాష్ట్రాలలో కూడా అంతకంటే భిన్నంగా వ్యవహరిస్తుందనుకోవడం పొరబాటు. పైగా స్వంత బలం తగ్గిన దృష్ట్యా ఈ తరహా కుటిల రాజకీయాలు ఇంకా తీవ్రం కావచ్చు కూడా. ఎన్నికల అవసరాల కోసం బిజెపితో చేరి మోడీ మూడో సర్కారుకు ప్రధాన ప్రాపుగా మారిన టిడిపికి ఈ వాస్తవాలు తెలియవని భావించలేము. ఇక ఎన్నికల్లో దారుణంగా దెబ్బతిన్న వైసిపి మనుగడ కోసం, కేసుల నుంచి రక్షణ కోసం బిజెపిని మరింత బలపర్చడమే తరుణోపాయమని భావించడం కూడా విచిత్రమే. తాము కాంగ్రెస్‌లో కలసిపోతామని కొందరు ఎ.పి బిజెపి నేతలు చెబుతున్న మాటలు నిజం కాదని కూడా వైసిపి వారంటున్నారు. బిఆర్ఎస్ తదుపరి అడుగుల విషయంలోనూ చాలా సందేహాలున్నాయి. ఏతావాతా రెండు రాష్ట్రాలలో వివిధ ప్రాంతీయ పార్టీలను తన గుప్పిట్లో పెట్టుకునే దిశలోనే బిజెపి అడుగులేస్తున్నది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను మరోసారి సిబిఐతో అరెస్టు చేయడంలోనూ ఆ యా పార్టీలను ఒత్తిడి పెట్టే ఎత్తుగడ వుంది. మోడీ సర్కారు మతతత్వ కార్పొరేట్ ఏకపక్ష విధానాలపై పోరాడేందుకు తాజా లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత వెసులుబాటు పెరిగినప్పటికీ తెలుగు రాష్ట్రాలలో నెలకొన్న ఈ పరిస్థితులను ప్రత్యేకంగా చూడవలసిన అగత్యమేర్పడుతున్నది. కనుకనే ఇక్కడ వామపక్ష లౌకిక శక్తులు, ప్రజాస్వామ్య ప్రియులు మరింత అప్రమత్తత వహించాల్సి వుంది. వివిధ పాలక పార్టీల వ్యూహాలకూ విశాల ప్రజాస్వామిక ప్రయోజనాలకు మధ్యన గల వ్యత్యాసాలను నిశితంగా గమనిస్తూ అడుగు వేయవలసి వుంటుంది.

ఎండియు వాహనాలతో ఇంటింటికీ రేషన్ వైపే ఆదివాసీల మొగ్గు

- డిఆర్ డిపోల ద్వారా ఇస్తే తిప్పలు తప్పవని ఆవేదన
- నడక ప్రయాస, మోతభారం మా కొద్దని వేడుకోలు

ప్రజాశక్తి- పాడేరు, డుంబ్రిగుడ, అరకు, విఆర్.పురం విలేకరులు (అల్లూరి జిల్లా)

రాష్ట్రంలో ఇటీవల అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం ప్రస్తుతం గిరిజన ప్రాంతాల్లో అమల్లో ఉన్న ఎండియు వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ పంపిణీ విధానానికి స్వస్తి చెప్పి అంతకుముందు మాదిరిగా డిఆర్ డిపోల ద్వారా రేషన్ సరఫరా చేయడానికి తీసుకున్న నిర్ణయం పట్ల గిరిజన ప్రాంతాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతాల్లో రేషన్ కష్టాలు మళ్లీ మొదటికి వచ్చే పరిస్థితి దాపురించిందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ పంపిణీ విషయంలో కూటమి ప్రభుత్వ నిర్ణయంపై జిల్లాలోని పలు మండలాల్లో 'ప్రజాశక్తి' క్షేత్రస్థాయి పరిశీలన జరిపింది. పలువురి అభిప్రాయాలు సేకరించింది. ఇంటింటికీ రేషన్ సరఫరా వల్ల గ్రామాల్లో గిరిజనులకు సౌలభ్యంగా ఉందని పలువురు తెలిపారు. గతంలో డిఆర్ డిపోల ద్వారా రేషన్ సరఫరా చేసినప్పుడు తమ గ్రామాల నుంచి సుమారు ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉండే గ్రామాలకు వెళ్లి కాలినడకన రేషన్ సరుకులు మోసుకుని తెచ్చుకునేవారిమని వారు గుర్తుచేసుకున్నారు.

గత వైసిపి ప్రభుత్వం రేషన్ సరుకుల సరఫరాకు 2021 నుంచి ఎండియు వాహనాల సేవలను అందుబాటులోకి తెచ్చింది. అల్లూరి జిల్లాలోని 22 మండలాల్లో ఉన్న 2,98,092 మంది రేషన్ కార్డుదారులకు 221 మొబైల్ డిస్పెన్సివ్ యూనిట్స్ (ఎండియు) వాహనాల ద్వారా రోడ్డు సౌకర్యం అందుబాటులో ఉన్న గ్రామాలకు వెళ్లి రేషన్ సరుకులు అందించేవారు. దీంతో, లబ్ధిదారులకు డిపోలకు వెళ్లి సరుకులు తెచ్చుకునే యాతన తప్పింది. డిఆర్ డిపోల ద్వారా రేషన్ ఇస్తే మళ్లీ తమ కష్టాలు మళ్లీ మొదటికే వస్తాయని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేశారు.

డుంబ్రిగుడ డిఆర్ డిపో పెదపాడు, అంత్రిగూడ గ్రామాలకు సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలోనూ, పాములరాయి, గొడసారు గ్రామాలు ఎనిమిది కిలోమీటర్ల దూరంలోనూ ఉంది. ఈ గ్రామాల వారు డిఆర్ డిపోకు వచ్చి బియ్యం తీసుకోవాలంటే ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. గుంటగన్నెల పంచాయతీ జాంగుడ డిఆర్ డిపో పరిధిలో కబడబోడ్డాపుట్టు గ్రామం సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడి వారు కాలినడకన డిపోకు వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. రంపచోడవరం డివిజన్‌లోని విఆర్.పురం మండల వాసులు ఎండియు వాహనం ద్వారానే ఇంటికి తెచ్చి రేషన్ ఇవ్వాలని కోరుతున్నారు. ఆ మండలంలోని శ్రీరామగిరి పంచాయతీ పరిధి చొక్కానపల్లి గ్రామవాసులు, విఆర్.పురం బిసి కాలనీ ప్రజలు ఎండియు వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ ఇచ్చే పద్ధతినే బాగుందని చెబుతున్నారు. ఆ మండలంలోని కొటారుగొమ్ము, మొలకనపల్లి, అడివి వెంకన్నగూడెం, దుర్భలంక, రామవరం, ధర్మతాలగూడెం, వడ్డిగూడెం, సీతంపేట, సున్నంవారిగూడెం. వెంకంపాలెం తదితర గ్రామాలవారిదీ అదే మాట. ఎండియు వాహనాలను తీసేస్తే తాము రెండు నుంచి ఐదు కిలోమీటర్ల మేర వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు.

డిపోల్లో ఇస్తే ఆటోపెట్టి రేషన్ తెచ్చుకోవాలి

మా ఇంట్లో వారిమంతా కాళ్ల నొప్పులతో బాధపడుతున్నాం. రెండు కిలోమీటర్ల దూరంలోని శ్రీరామగిరికి వెళ్లి అక్కడి డిపోలో రేషన్ తెచ్చుకోవాలంటే కష్టమైన పని. ఆటోలోపోయి తెచ్చుకుంటే నలభై రూపాయలు ఖర్చవుతుంది. మా పరిస్థితిని అర్థం చేసుకుని మునుపటిలా ఇంటి వద్దకే తెచ్చి రేషన్ ఇవ్వాలి.

- రవణమ్మ, చొక్కానపల్లి గ్రామం, శ్రీరామగిరి పంచాయతీ, విఆర్.పురం మండలం

మూడు కిలోమీటర్లు నడవాలి

మా గ్రామానికి జాంగుడ డిఆర్ డిపో మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. బియ్యం తీసుకోవడానికి నడిచి వెళ్లి, తిరిగి రావాలంటే కష్టమైన పని. ఎండియు వాహనం ద్వారా ఇంటి వద్దకే బియ్యం తెచ్చి ఇవ్వాలి.

- జి.నాగేశ్వరరావు, కబడబోడ్డాపుట్టు గ్రామం, జాంగుడ డిపో పరిధి, డుంబ్రిగుడ మండలం

వ్యాన్ ద్వారా సరుకులు బాగానే అందుతున్నాయి

మా గ్రామానికి వ్యాన్ ద్వారా సరుకులు బాగానే అందుతున్నాయి. మా ఊరు నుంచి మూడు కిలోమీటర్ల దూరంలోని డోకులూరు గ్రామంలోగల డిఆర్ డిపోకు వెళ్లి రావాలంటే రెండు గంటల సమయం పడుతుంది. నడిచి వెళ్లి తలపై బియ్యం మోసుకురావడమంటే కష్టమే.

- కిల్లో ముత్తమ్మ, మర్రిపాలెం గ్రామం, డోకులూరు పంచాయతీ, పాడేరు మండలం

ఏరులా మద్యం

ఏడాదిలో రూ. 30 వేల కోట్ల అమ్మకాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో మద్యం ఏరులా పారుతోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 30 వేల కోట్ల రూపాయల మద్యం విక్రయాలు రాష్ట్రంలో జరిగాయి. వీటి నుంఇ 25 వేల కోట్ల రూపాయల ఆదాయం రాష్ట్ర ఖజానాకు చేరింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ నివేదికను రూపొందించింది. ఈ నివేదిక ప్రకారం 3.47 కోట్ల మద్యం కేసులు ఏడాదిలో అమ్ముడు పోయాయి, ఈ ఏడాదిలో మద్యంతో పాటు బీర్లు కూడా ఏరులైపారినట్లు అధికారులు చెబుతున్నారు. ఏడాది మొత్తం మీద 1.17 కోట్ల బీరు కేసులు అమ్ముడు పోయాయి. అంటే మొత్తం మద్యం, బీరు కలిపి 4.64 కోట్ల కేసుల అమ్మకాలు జరిగాయి. ఈ లెక్కన 40.8 కోట్ల బీర్లు, 66 కోట్ల మద్యం సీసాలు విక్రయాలు జరిగినట్లు తేలింది. ఒక్క ఏడాదిలో ఇంత మద్యం విక్రయాలు జరగడం ఒక రికార్డుగానే భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో కొత్త మద్యం విధానం తీసుకువచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మళ్లీ ప్రయివేటు మద్యం దుకాణాల విధానం తీసుకువచ్చే అవకాశాలు ఉండడంతో ఆదాయం ఏమాత్రం తగ్గకుండా చూడాలని అబ్కారీ శాఖ భావిస్తోంది. లైసెన్సు ఫీజులను భారీగా పెంచే ఆలోచన కూడా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

రిజిస్టర్డు ఆఫీసు: శ్రీ టవర్స్, ప్లాట్ నం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గ్యూండి, చెన్నై-600032.
అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసు: 6వ అంతస్తు (లెవల్-2), బిల్డింగ్ నం.క్యూ2, అరం క్యూ పార్క్, జెన్ 4/1, టిటిసి, థాణే-బేలాపూర్ రోడ్, ఘన్‌సోలి, నేవి ముంబయి-400710.

డిమాండ్ నోటీసు

ఏదైతే, ఇక్కడ దిగువ పేర్కొనబడిన రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/హామీదారులు మెసర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్"గా పేరుగలది శ్రీరామ్ (ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిటెడ్‌తో అమాల్గమేషన్‌చేసి మరియు శ్రీరామ్ (ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిటెడ్ అనునది శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్)గా 30.11.2022దాని ఇన్‌కార్పొరేషన్ ద్వారా మార్పుచెందినది) దాని నుండి ఇందు దిగువ పేర్కొన్న ఆర్థిక సహాయం పొందియున్నారు. మేము చెప్పేది ఏమనగా, పొందిన ఆర్థిక సహాయం డిస్బర్స్‌అయినది, రుణగ్రహీతలు/హామీదారులు చెల్లించు వాయిదా తేదీల ప్రకారం అసలు మొత్తాలు మరియు వడ్డీని తిరిగి చెల్లించుటలో పలు విధాలుగా డిఫాల్టిచెందారు. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తోచదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, ఇందు దిగువ పేర్కొన్న సదరు తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేసినప్పటికీ వారు చెల్లించనందున శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి అభిప్రాయం మేరకు, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాచే జారీచేయబడిన ఆదేశాలు/ మార్గదర్శకాలతో అనుసరించి సదరు ఖాతా నాన్-పెర్ఫామింగ్ అసెట్‌గా వర్గీకరించబడినది, సార్ఫేసీ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద నోటీసులు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా చెల్లించు తేదీ వరకుగల ఇన్సిడెంటల్ వ్యయాలు, ఖర్చులు, చార్జీలు మొ॥వాటితోసహా నోటీసుల్లో పేర్కొనబడిన మొత్తాల పై కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసుల్లో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా దిగువ రుణగ్రహీతలు/హామీదారులు/తాకట్టుదారులను కోరబడుచున్నది. వారు గతంలో తెలిసిన చిరునామాల పై వారికి జారీచేయబడిన నోటీసులు బట్వాడా కాకుండానే తిరిగి వాపసు పంపబడినవి మరియు ఇట్టి పరిస్థితుల్లో దానికి సంబంధించి బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయబడుచున్నది. సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8)యొక్క నియమాలపై రుణగ్రహీతలు శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/హామీదారుల పేరు	ఎన్‌పిఏ తేది	రుణబకాయి మొత్తాలు
1) ఎస్. ఉమా మహేశ్వర రావు తండ్రి సుబ్బారావు, నివాసం: ఇ.నం.19-28/1, భారత్ టాకీస్ సెంటర్, నందిగామ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-521185. 2) శ్రీమతి ఎస్. పద్మజా, భర్త ఎస్. ఉమా మహేశ్వర రావు, నివాసం: ఇ.నం.19-28/1, భారత్ టాకీస్ సెంటర్, నందిగామ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-521185. 3) ఎ. చిరంజీవి, తండ్రి నాగభూషనం, నివాసం: డోర్ నం.16-28/1, రామాలయం వీధి, నందిగామ, కృష్ణా జిల్లా-521185.	08.09.2016	Rs. 12962104
	డిమాండ్ నోటీసు తేది 09.03.2024	రుణ మొత్తాలు Rs. 25,00,000

ఎండిహెచ్‌ఆర్1టిఎఫ్1602290003- స్థిరాస్తి వివరణ: ఆస్తి యజమాని పేరు: ఎస్. ఉమా మహేశ్వర రావు, సర్వే నం.522/3 సైటు విస్తీర్ణం 60.00చ.గ.ల్లో నిర్మాణంతో గ్రామపంచాయతి నందిగామ యొక్క 19వ బ్లాక్ లోగల ఎలక్ట్రిసిటీ సర్వీస్ నంబరు 995తో ఆర్‌సిసి బిల్డింగ్ నం. 19-17 (పాత) 19-26(కొత్త), డాక్యుమెంట్ నం. 1308/2016తోసహా. సరిహద్దులు: తూర్పు వైపు: జాయింట్ గొండి, పడమర వైపు: సముద్రాల సురేశ్ దుకాణం, ఉత్తరం వైపు: ఉమ్మడి గొండి, దక్షిణం వైపు: రోడ్డు.

పై చెప్పిన ఇట్టి పరిస్థితుల్లో, పై రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు మరియు/లేదా వారి హామీదారులకు(వర్తించునట్లుగా) ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి 60 రోజుల్లోగా తదుపరి వడ్డీ మరియు వర్తించు చార్జీలతోసహా పై పేర్కొన్నట్లుగా బకాయి మొత్తాలను చెల్లింవలసిందిగా కోరబడుచున్నది, విఫలం చెందిన ఏదైతే, ఈ నోటీసు తేది నుండి 60 రోజులు ముగిసిన తరువాత సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(4) క్రింద మరియు దాని క్రింది వర్తించబడు రూల్స్‌తో రుణగ్రహీతలు మరియు తాకట్టుదారుల యొక్క సెక్యూర్డ్ అసెట్స్ స్వాధీనంచేసుకొనుటతో సహా సెక్యూర్డ్ అసెట్స్‌పై చర్యలు తీసుకోబడుతాయి. **సదరు చట్టం యొక్క సెక్షన్ 13(13) క్రింద దయచేసి గమనించడి: సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతిలేకుండా, ఈ నోటీసులో పేర్కొనబడిన ఇతని సెక్యూర్డ్ అసెట్స్‌ను రుణగ్రహీత అమ్మకం, లీజు లేదా ఇతర విధానాల ద్వారా బదిలీచేయలేరని దయచేసి గమనించగలరు.**

తేది: 29.06.2024, ప్రదేశం: నందిగామ. సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఆదిలాబాద్ మాజీ ఎంపి రాథోడ్ రమేష్ మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్ మాజీ ఎంపి రాథోడ్ రమేష్(57) మృతి చెందారు. శుక్రవారం అర్ధరాత్రి ఉట్నూర్‌లోని తన నివాసంలో తీవ్ర అస్వస్థతకు గురికావడంతో వెంటనే అదిలాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. కోమాలోకి వెళ్లడంతో పరిస్థితి విషమించింది. శనివారం ఆదిలాబాద్ నుంచి హైదారాబాద్ తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే తుదిశ్వాస విడిచారు. నార్నూర్ మండలంలోని తాడిహత్నూర్ గ్రామానికి చెందిన రాథోడ్ రమేష్ 1966 అక్టోబర్ 20న జన్మించారు. టిడిపిలో రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టిన ఆయన తొలుత నార్నూర్ జడ్‌పిటిసిగా పనిచేశారు. టిడిపి హయాంలో పొలిట్‌బ్యూరో సభ్యుడిగానూ పనిచేశారు. 1999 నుంచి 2004 వరకు ఖానాపూర్ ఎమ్మెల్యేగా సేవలందించారు. 2009లో టిడిపి తరపున ఎంపీగా గెలుపొందారు. అనంతరం టిఆర్‌ఎస్‌లో చేరారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరి 2018లో ఖానాపూర్ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత ఎంపి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2021 జూన్‌లో బిజెపిలో చేరారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి తరపున ఖానాపూర్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. రాథోడ్ మృతి పట్ల వివిధ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు.

పోలీస్ స్టేషన్ ఆవరణలో భారీ పేలుడు

ప్రజాశక్తి- కొత్తకోట (అనకాపల్లి జిల్లా)

అనకాపల్లి జిల్లా రావికమతం మండలం కొత్తకోట పోలీస్ స్టేషన్లో ఆవరణలో గతంలో గంజాయి కేసులో సీజ్ చేసిన కంటైనర్లో భారీ పేలుడు చోటు చేసుకుంది. శనివారం సాయంత్రం జరిగిన ఈ భారీ పేలుళ్ల శబ్దాలకు స్టేషన్లో సిబ్బంది భయంతో బయటకు పరుగులు తీశారు. భారీ శబ్దాలకు గ్రామానికి చెందిన పలువురు స్టేషన్‌కు తరలివచ్చారు. ఏ ఒక్కరూ సంఘటనా స్థలానికి వెళ్లేందుకు సాహసించలేదు. 2019లో గంజాయి కేసులో ఈ కంటైనర్‌ను సీజ్ చేసినట్లు కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. పేలుడు కారణంగా కంటైనర్ పూర్తిగా కాలిపోయిందని, అయితే, ఎటువంటి ప్రమాదమూ చోటు చేసుకోలేదని, స్టేషన్ భవనానికి ఎటువంటి నష్టమూ వాటిల్ల లేదని ఆయన తెలిపారు.

సరకా ల్యాబొరేటరీస్‌లో రియాక్టర్ పేలుడు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్ (శ్రీకాకుళం జిల్లా)

పేలిన రియాక్టరు

శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం పైడిబీమవరం సమీపంలోని సరకా ల్యాబొరేటరీస్ రసాయన పరిశ్రమలో శనివారం భారీ పేలుడు సంభవించింది. కేమ్ ప్రొడక్షన్ బ్లాక్-బిలో సార్ట్‌సర్క్యుట్ వల్ల రియాక్టరు ఒక్కసారిగా పేలింది. మధ్యాహ్నం కార్మికుల భోజన విరామ సమయంలో ఈ ఘటన జరగడంతో పెను ప్రమాదం తప్పింది. కార్మికులు అప్రమత్తమై ప్రమాదం జరిగిన బ్లాక్ వద్దకు చేరుకొని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న డిఎఫ్ఒ మోహనరావు, రణస్థలం అగ్నిమాపక అధికారి అశోక్ ఆధ్వర్యాన సిబ్బంది, అరబిందో, డాక్టర్ రెడ్డీస్ అగ్నిమాపక వాహనాలు చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే ఆ ప్రాంతమంతా పెద్దఎత్తున పొగకమ్ముకోవడంతో చుట్టు పక్కల ప్రజలు భయాందోళన గురయ్యారు.

స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాద వివరాలను అక్కడి అధికారులకు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తక్షణ చర్యలు తీసుకోవాలని, మరలా ఇటువంటి సంఘటనలు జరగకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ కూడా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఇందిరాగాంధీ మమ్మల్ని దేశద్రోహులనలేదు : లాలూప్రసాద్ యాదవ్

పాట్నా : ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన తమను ఇందిరాగాంధీ జైలులో పెట్టించారని, కానీ ఎప్పుడూ తమను దుర్భాషలాడలేదని, దేశద్రోహులని అనలేదని ఆర్‌జెడి నేత, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. ఈమేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇప్పుడు ఎమర్జెన్సీ గురించి విమర్శిస్తున్న బిజెపి, సంఘపరివార్ ఆ సమయంలో సైలెంట్‌గా ఉన్నాయని లాలూ విమర్శించారు. ఈ విషయమై జర్నలిస్టు నళిన్ వర్మ రాసిన కథనాన్ని కూడా ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

'అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు జయప్రకాశ్ నారాయణ్ ఏర్పాటు చేసిన స్టీరింగ్ కమిటీకి నేను కన్వీనర్‌గా ఉన్నాను. అప్పుడు నేను 15 నెలలకు పైగా భద్రతా చట్టం (ఎంఐఎస్ఎ) కింద జైలులో ఉన్నాను. ఈరోజు ఎమర్జెన్సీ గురించి చాలామంది బిజెపి మంత్రులు మాట్లాడుతున్నారు. ఎమర్జెన్సీలో జైళ్లకు వెళ్లిన నాకు కానీ, నా సహచరులకు కానీ వీళ్లగురించి తెలియదు. మోడీ, జెపి నడ్డా, మోడీ మంత్రివర్గ సహచరుల గురించి మేము వినలేదు. ఈరోజు మాకు వీరంతా స్వేచ్ఛ, దాని విలువ గురించి ఉపన్యాసాలు ఇస్తున్నారు.' అని ఆయన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

'ఇందిరాగాంధీ మాలో చాలామందిని కటకటాల వెనక్కి నెట్టారు. కానీ ఆమె మమ్మల్ని ఎప్పుడూ దుర్భాలాషలాడలేదు. ఆమె కానీ, ఆమె మంత్రులు కానీ మమ్మల్ని 'జాతీయ వ్యతిరేకులు' లేదా 'దేశభక్తి లేనివారు' అని పిలవలేదు. మన రాజ్యాంగాన్ని రూపొందించిన బాబాసాహెబ్ అంబేద్కర్ స్మృతిని అపవిత్రం చేయడానికి ఆమె విధ్వంసకారులను అనుమతించలేదు. 1975 ఎమర్జెన్సీ మన ప్రజాస్వామ్యానికి మచ్చే. కానీ అప్పుడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన ప్రతిపక్షాలను సైతం గౌరవించేవారు. అదే ఇప్పుడయితే 2024లో మోడీ కానీ, ఆయన మంత్రివర్గ సహచరులు ఎవరూ కూడా ప్రతిపక్షాలను గౌరవించడం లేదనేది మరిచిపోకూడదు.' అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

గాజాలో ఇజ్రాయిల్ కార్పెట్ బాంబింగ్ 40 మంది మృతి

గాజా సిటీ: గాజాపై ఇజ్రాయిల్ సైన్యం కార్పెట్ బాంబు దాడికి దిగింది. నివాస ప్రాంతాలపై జరిపిన ఈ బాంబుదాడుల్లో 40 మంది దాకా పాలస్తీనీయులు మరణించగా, మరో 224 మంది గాయపడ్డారు. తిండి, తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. ఆకలిని తట్టుకోలేక ఆకులు తింటున్నారు. అటువంటి వారిపై కార్పెట్ బాంబు దాడికి దిగడం ఇజ్రాయిల్ క్రూరత్వానికి పరాకాష్ట. ఐరాస ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్ మాట్లాడుతూ, గాజా సిటీలోని నీటి సరఫరా కేంద్రంపై దాడిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు చనిపోయారని అన్నారు. గాజా సిటీ చుట్టూ దాడి జరుగుతోందని, దీంతో 60 వేల మంది పాలస్తీనీయులు ఇళ్లు వీడి బలవంతంగా పారిపోవాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. ఇజ్రాయిల్ గత ఎనిమిది మాసాలుగా సాగిస్తున్న దాడుల్లో 37,834 మంది మరణించినట్లు గాజా ఆరోగ్యశాఖ తెలిపింది. గాయపడినవారి సంఖ్య 81వేలకు చేరింది. .

ఆయుధాలతో నినాదాలు చేస్తున్న గిరిజనులు

మా సాగు భూముల జోలికొస్తే తరిమికొడతాం

- గిరిజన రైతుల ఆందోళన

ప్రజాశక్తి- అనంతగిరి (అల్లూరి జిల్లా)

తాత, ముత్తాతల కాలం నుండి సాగులో ఉన్న తమ భూముల జోలికి వస్తే తరిమి కొడతామని, ఆర్మీ మాజీ సైనికులు తక్షణమే వెనక్కి వెళ్లి పోవాలని గిరిజనులు సంప్రదాయ ఆయుధాలు చేతిలో పట్టుకుని శనివారం సాగు భూమి వద్ద గిరిజన రైతులు ఆందోళన చేపట్టారు. 'సాగు భూముల జోలికి వస్తే తరిమి కొడతాం... గో బ్యాక్ మాజీ సైనికులు సాగులో ఉన్న రైతులకు పట్టాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలోని నాన్ షెడ్యూల్ గరుగుబిల్లి పంచాయతీ పరిధి సింగవరం గ్రామానికి చెందిన వార్డ్ మెంబర్ ఎరకన్న దొర, .గ్రామ పెద్దలు కె.పోలన్నదొర, కె.పోతన్నదొరలు మాట్లాడుతూ, తాత, ముత్తాతల కాలం నుండి భూమిని నమ్ముకుని వివిధ రకాల పంటలు సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని తెలిపారు. సర్వే నెంబర్ 22 లో సుమారు 160 ఎకరాలలో 70 మంది రైతులము సాగు చేస్తున్నామన్నారు. ఈ భూమిని మాజీ సైనికులకు పట్టాలు మంజూరు చేశామంటూ రెవెన్యూ శాఖ అధికారులు, ఈ భూమి ఖాళీ చేయాలంటూ, లేకుంటే కేసులు బనాయిస్తామంటూ ఫారెస్ట్ ఉన్నత అధికారులు తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఈ భూమి తప్ప మరో ఆధారం తమకు లేదని, సంబంధిత అధికారులు పునరాలోచించి సాగులో ఉన్న 70 మంది రైతులకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. తాము ఓట్లు వేసి గెలిపించిన ఎంపిటిసి, సర్పంచులు తమ పక్షాన అండగా నిలవాల్సిందిపోయి మాజీ సైనికులవైపు ఉండడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే రెవెన్యూ అధికారులు పట్టాలు మంజూరు చేయాలని, మాజీ సైనికులు వెనక్కి వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సాగు రైతులు జమ్మనదొర, పి.పోతన్నదొర, కె.రామన్నదొర, ప్రసన్నదొర తదితరులు పాల్గొన్నారు.

ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్,

IDBI BANK

బివిఎస్ఆర్ ప్లాజా, మేరిస్ స్టెల్లా కాలేజి దగ్గర, రింగ్ రోడ్, విజయవాడ-520008, ఆం.ప్ర.

అనుబంధం-4 (రూల్ 8(1))
స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారు **ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని తేది:**28.062023** నాటి డిమాండు నోటీసు జారీచేసి, రుణగ్రహీత **శ్రీ శ్రీధర్ బాబు కుమ్మమూరు** తండ్రి శ్రీ రాజ భగవానులు & **శ్రీమతి శ్రీదేవి కుమ్మమూరు** భర్త శ్రీ శ్రీధర్ బాబు కుమ్మమూరు అనువారిని సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలుగా **రూ.10,49,312.80 పై.లు** (రూపాయలు పది లక్షల నలభై తొమ్మిది వేల మూడు వందల పన్నెండు మరియు ఎనభై పైసలు మాత్రమే)లను తిరిగి చెల్లించవసలిందిగా కోరబడినది. రుణగ్రహీత మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు ది సెక్యూరిటీ ఇంటరెస్టు (ఎన్ఫోర్సుమెంటు) రూల్సు, 2002 యొక్క రూలు 8తో చదువబడే చట్టం యొక్క సెక్షను 13 యొక్క సబు-సెక్షను (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, ఇందు దిగువ వివరించిన ఆస్తిని **27 జూన్ 2024న స్వాధీనంచేసుకున్నారు.**
ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, **ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్** కు 11.03.2024 నాటికిగల మొత్తాలు **రూ.11,57,830.80 పై.లు** (రూపాయలు పదకొండు లక్షల యాభై ఏడు వేల ఎనిమిది వందల ముప్పై మరియు ఎనిమిది పైసలు మాత్రమే) మరియు దానిపై వడ్డీని చెల్లించుటకులోబడి ఉంటుంది. సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై రుణగ్రహీత శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.
ఆస్తి వివరణ: (ఎ) తాకట్టుపెట్టిన ఆస్తి: (31.05.2006న రిజిస్టరైన డాక్యుమెంట్ నం.8621/2006 ఆధారంగా ఐడిబిఐ బ్యాంక్ పేరున రిజిస్టర్డు సేల్ డీడ్ ప్రకారం శ్రీ శ్రీధర్ బాబు కుమ్మమూరుచే స్వంతమైన ఆస్తి)
షెడ్యూలు-ఎ: కృష్ణా జిల్లా, విజయవాడ సబ్ రిజిస్ట్రార్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, సత్యనారాయణ పురం, కొమ్మువారి వీధి, సర్వే నం.129/6, మున్సిపల్ వార్డు నం.21/బి, కొత్త వార్డు నం.-30, అసెస్మెంట్ నం.18202 ఏ, డోర్ నం.23-31-3/బి, రెసిడెన్షియల్ ఫ్లాట్ నం.ఎఫ్ఎఫ్-2, మొదటి అంతస్తులో ఫ్లింత్ ఏరియా 704.00చ.అ.లు తోపాటు 351.00చ.గ.లకుగాను 28.00చ.గ.ల విడదీయలేని& సూచించజాలని ల్యాండ్‌భాగం మొత్తం. **అపార్టుమెంట్‌కు సరిహద్దులు:** తూర్పు: ఉప్పలపాటి చిన్న చెంకం రాజు ఆస్తి, పడమర: కొమ్మువారి వీధి మున్సిపల్ రోడ్, ఉత్తరం: రుద్రరాజు వెంకట్రామరాజు ఆస్తి, దక్షిణం: దాదా రామరాజు ఇతరులకు విక్రయించిన ఆస్తి.
షెడ్యూలు-బి: పై షెడ్యూలు-ఎ పరిధిలోని నిర్మించిన "శ్రీ తాయి నిలయం", మొదటి అంతస్తు, ఎఫ్ఎఫ్-2 (డబల్ బెడ్ రూమ్). సరిహద్దులు: **ఫ్లాట్ కు సరిహద్దులు:** తూర్పు: ఫ్లాట్ నం.1, పడమర: ఫ్లాట్ నం.3, ఉత్తరం: ఉమ్మడి దారి, దక్షిణం: ఒపెన్ టు స్కై.ఈ నాలుగు సరిహద్దుల్లో, 704చ.అ.ల ఫ్లింత్ ఏరియా ఎఫ్ఎఫ్-2 (డబుల్‌బెడ్‌రూమ్), గ్రౌండ్ ఫ్లోర్‌లో 20చ.అ.ల టూవీలర్ ఉమ్మడి పార్కింగ్, అన్ని ఈజిమెంట్ హక్కులతోపాటు వాటర్ కనెక్షన్, డ్రైనేజి మొ॥వంటి అన్ని ఉమ్మడి సదుపాయాలతో.

తేది: 30.06.2024
ప్రదేశం: విజయవాడ.
సం/- అధీకృత అధికారి, ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్.

చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

Chola Enter a better life

కార్పొరేట్ ఆఫీసు: "చోలక్రెస్ట్" సి54&55, సూపర్ బి-4, తిరు వి క ఇండస్ట్రియల్ ఎస్టేట్, గ్యూండి, చెన్నై-600032.

స్వాధీనతా ప్రకటన (అనుబంధం-4) రూల్ 8(1) క్రింద

ఏదైతే, క్రింది సంతకందారు మెసర్స్ **చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద, మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, సదరు చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద దిగువ పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీచేసి, రుణగ్రహీతలు (**పేర్లు మరియు చిరునామా దిగువ పేర్కొనబడినవి**)లను సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా దానిపై వడ్డీ తో మరియు సదరు నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది. ఇందు దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీతలు మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు ఇందు దిగువ పేర్కొన్న రుణగ్రహీతలకు ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, ఇందు దిగువ వివరించిన ఆస్తిని స్వాధీనంచేసుకొన్నారు. ప్రత్యేకించి ఇందు పై పేర్కొన్న రుణగ్రహీతలు మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, సదరు ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, **మెసర్స్ చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** కు ఇందు దిగువ పేర్కొన్న మొత్తాలను దానిపై వడ్డీతోసహా చెల్లించుటకులోబడి ఉంటుంది. సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై రుణగ్రహీత శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

క్ర. సం.	రుణగ్రహీతల పేరు& చిరునామా & రుణ ఖాతా నం.	డిమాండ్ నోటీసు తేది	బకాయి మొత్తాలు	స్థిరాస్తి వివరణ	స్వాధీనతా తేది
1.	లోన్ ఖాతా నం.లు HL01GIV000060466 కాపవరపు తారక వీర వెంకటేశ్వర రావు, మోహన్ కాపవరపు, లక్ష్మి కాపవరపు, అందరని నివాసం: డోర్ నం.5-14, పెనమ్మలూరు, ఆంజనేయ స్వామి టెంపుల్, కృష్ణా-521139. మరియు: శ్రీ శిర్డీ సాయి హైట్స్, ఆంజనేయ స్వామి టెంపుల్ దగ్గర, మద్దూరు గ్రామపంచాయతి, కంకిపాడు మండలం, కృష్ణా జిల్లా-521151, ఆం.ప్ర.,	22-04-2024	11.04.2024 నాటికి రూ.24,62,470/- (రూపాయలు ఇరువై నాలుగు లక్షల అరవై రెండు వేల నాలుగు వందల డెబ్బై మాత్రమే) మరియు దానిపై వడ్డీ.	కృష్ణా జిల్లా, కంకిపాడు ఎస్ఆర్ఒ, కంకిపాడు మండలం, మద్దూరు గ్రామపంచాయతి ఏరియా, మద్దూరు గ్రామం, డోర్ నం.2-52 దగ్గర, ఆర్.ఎస్.నం.106/2లో గల 1694చ.గ.ల పూర్తి విస్తీర్ణంనకుగాను, 56.46చ.గ.ల విస్తీర్ణంతో విడదీయలేని మరియు సూచించజాలని ఉమ్మడి హక్కులతో అన్ని ఉమ్మడి వసతులతోసహా 240చ.అ.ల ఉమ్మడి ఏరియా మరియు 910చ.అ.ల ఉమ్మడి ఫ్లింత్ ఏరియాతో శ్రీ శిర్డి సాయి హైట్స్‌గా పేరు& స్టైల్‌గల భవనములో రెండవ అంతస్తులోని ఫ్లాట్ నం.306 ఆస్తి. ల్యాండ్ సరిహద్దులు: తూర్పు: పడవల వెంకట రమణ ఆస్తి, దక్షిణం: ఆర్& బి రోడ్, పడమర: యనమదల మధు బాబు ఆస్తి, ఉత్తరం: యనమదల మధు బాబు ఆస్తి, ఫ్లాట్ సరిహద్దులు: తూర్పు: ఒపెన్ టు స్కై, దక్షిణం: ఒపెన్ టుస్కై, పడమర: ఉమ్మడి కారిడార్, ఉత్తరం: లిఫ్టు& ఒపెన్ టు స్కై	స్వాధీనతా తేది: 27.06.2024
2.	లోన్ ఖాతా నం.లు HL01VJI000063013 పెకెటి భరత్ కృష్ణా రెడ్డి, సునీత పెకెటి, ఇరువురి నివాసం: 4-88, ఖాజా, కృష్ణ జిల్లా, మెయిన్ రోడ్, ఘంటసాల, 521150. మరియు: ఆర్.ఎస్.నం. 219/7, 220/5, 220/6, 222/1, 222/4 & 245/3/ ఫ్లాట్ నం.313 (టి-బ్లాక్ నం.7, చలపల్లి గ్రామపంచాయతి, చల్లపల్లి మండలం, పద్మావతి హాస్పిటల్ దగ్గర, చల్లాపల్లి-521126.	15-04-2024	11.04.2024 నాటికి రూ.27,48,698/- (రూపాయలు ఇరువై ఏడు లక్షల నలభై ఎనిమిది వేల ఆరు వందల తొంభై ఎనిమిది మాత్రమే) మరియు దానిపై వడ్డీ.	కృష్ణా జిల్లా, ఎస్ఆర్ఇ చల్లపల్లి, చల్లపల్లి మండలం, చల్లపల్లి గ్రామం& గ్రామపంచాయతి, పాత బ్లాక్ నం.5, కొత్త బ్లాక్ నం.7, చల్లపల్లి ఆర్.ఎస్.నం.219/7, 220/5, 220/6, 222/1, 222/4, 245/3లోగల అనుబంధ ఫిక్చర్స్& ఈజిమెంట్ హక్కులన్నింటితో స్టిల్ట్‌ఫ్లోర్ ఆర్‌సిసి రూఫ్, స్టిల్ట్ స్లాబ్ లెవల్‌లో 100చ.అ.ల కార్& స్కూటర్ పార్కింగ్ మరియు 1266చ.అ. (ఉమ్మడి& కార్ పార్కింగ్) ఫ్లింత్ ఏరియాతో "సన్ ఫ్లవర్ స్ప్లెండర్ సిటీ" ఎ-బ్లాక్, రెండవ అంతస్తు, ఫ్లాట్ నం.313 లో నిర్మించిన అపార్టుమెంట్‌తోపాటు సైటు పూర్తి విస్తీర్ణం ఎక.3.72సెంట్లు లేదా 17384.30చ.గ.లకుగాను 55చ.గ.లు లేదా 45.98చ.మీ.ల విస్తీర్ణపు విడదీయలేని& సూచించజాలని భాగం. సరిహద్దులు: తూర్పు: వరద ప్రభాకర్ రావు& ఇతరులు యొక్క ల్యాండ్ వైపు ఈ ఆస్తి మరియు ప్రహరీగోడ& 40అ.ల వెడల్పు రోడ్డు, దక్షిణం: బొందపాటి వెంకట రాజ్యలక్ష్మి& ఇతరుల ల్యాండ్ వైపు ఈ ఆస్తి ప్రహరీగోడప్రమర: వక్కలగడ్డ రాఘవులు,కామిశెట్టి ఆంజనేములు తండ్రి చలపతి రావు మరియు బొందలపాటి వెంకట రాజ్యలక్ష్మి& ఇతరుల ల్యాండ్ వైపు ఈ ఆస్తి ల్యాండ్ ప్రహరీగోడ. ఉత్తరం: ఘంట ఝాన్సి లక్ష్మి & సన్‌ఫ్లవర్ కాలనీ రోడ్, బత్తుల రత్తయ్య & మేక రజనిల ల్యాండ్ వైపు ఈ ఆస్తి ప్రహరీగోడ. బి-షెడ్యూలు: ఎ-బ్లాక్, రెండవ అంతస్తు, ఫ్లాట్ నం.313, "సన్‌ఫ్లవర్ స్ప్లెండర్ సిటీ" 1266చ.అ.ల ఫ్లింత్ ఏరియా (ఉమ్మడి& కార్ పార్కింగ్). సరిహద్దులు: తూర్పు: ఒపెన్ టు స్కై, దక్షిణం: లిఫ్టు & ఒపెన్ టు స్కై, పడమర: ఉమ్మడి కారిడార్, ఉత్తరం: ఒపెన్ టు స్కై, అన్ని ఈజిమెంట్ హక్కులతో.	స్వాధీనతా తేది: 26.06.2024
3.	లోన్ ఖాతా నం.లు HL04GIV000064771 కోడెబోయిన భావన శ్రీ సంతపకుమార్ వేమ, ఇరువురి నివాసం: డోర్ నం.6-105, అన్నె లక్ష్మి రోడ్, దత్తాత్రేయ టెంపుల్, కృష్ణా-521165, మరియు: ఆర్ఎస్ నం.59, సబ్-డివిజన్, ఆర్ఎస్ నం.59/1/ డోర్ నం.1-104, సచివాలయం దగ్గర, కనకవల్లి గ్రామపంచాయతి, తోట్లవల్లూరు మండలం, కృష్ణా జిల్లా-521165, ఆం.ప్ర.,	22-04-2024	11.04.2024 నాటికి రూ.30,81,839/- (రూపాయలు ముప్పై లక్షల ఎనభై ఒక వేల ఎనిమిది వందల ముప్పై తొమ్మిది మాత్రమే) మరియు దానిపై వడ్డీ.	కృష్ణా జిల్లా, వుయ్యూరు ఎస్ఆర్ఒ, తొట్లవల్లూరు మండలం, కనకవల్లి గ్రామ పంచాయతి ఏరియా, కనకవల్లి రెవెన్యూ గ్రామం కనకవల్లి గ్రామం, ఆర్.ఎస్.నం.59, సబ్-డివిజన్ ఆర్.ఎస్.నం.59/1 ప్రకారం, డోర్ నం.1-104, విస్తీర్ణం 780.95చ.గ.లు ఆస్తితోపాటు ఆర్‌సిసి& ఏసిసి ఇంటితో అన్ని ఈజిమెంట్ హక్కులతో సరిహద్దులు: తూర్పు: ఉమ్మడి దారి& మారెడు ఆంజనేయులు, ఇతరుల సైటు 64.4అ.లు, దక్షిణం: వెంపటి రాధా కృష్ణ, చల్లపల్లి వెంకట లక్ష్మి వర ప్రసాద్ 133అ.ల సైటు, పడమర: ఉమ్మడి బాట సైటు 60అ.లు, ఉత్తరం: ఇతరుల ఆస్తి 113అ.లు.	స్వాధీనతా తేది: 26.06.2024
4.	లోన్ ఖాతా నం.లు LAP1VJI000044566 మాదిరెడ్డి సుబ్బారావమ్మ, సత్యనారాయణ, ఇరువురి నివాసం: 10/236-1, అంకల వారి వీధి, బలరామునిపేట, రామాలయం వెనుక, కృష్ణా-521001. మరియు: సర్వే నం.లేదు/డోర్ నం.10/236-1, రామాలయం వెనుక, బలరామునిపేట మున్సిపల్ వార్డు నం.10, అసెస్మెంట్ నం.1070002439, చెమ్మనగిరిపేట వద్దగల, అంకలవారి వీధి, మచిలీపట్నం టౌన్, మచిలీపట్నం మున్సిపాలిటీ, కృష్ణా జిల్లా, రామాలయం వెనుక, బందర్-521001.	22-04-2024	17.04.2024 నాటికి రూ.20,27,943/- (రూపాయలు ఇరువై లక్షల ఇరువై ఏడు వేల తొమ్మిది వందల నలభై మూడు మాత్రమే) మరియు దానిపై వడ్డీ.	కృష్ణా జిల్లా, మచిలీపట్నం ఎస్ఆర్ఒ, మచిలీపట్నం టౌన్, బలరామునిపేట, మున్సిపల్ వార్డు నం.10, డోర్ నం.10/236-1, అసెస్మెంట్ నం. 1070002439. విస్తీర్ణం 137చ.గ.లు, ఏదైతే గ్రౌండ్& మొదటి అంతస్తు ఆర్‌సిసి భవనము. సరిహద్దులు: తూర్పు: ఆకుత సత్యమూర్తి ఇల్లు& సైటు, దక్షిణం: కోట సాయిబాబు సైటు, పడమర: కోక చిన్న మల్లికార్జున రావు ఆస్తి, ఉత్తరం: రోడ్, అన్ని ఈజిమెంట్ హక్కులతోసహా.	స్వాధీనతా తేది: 26.06.2024

తేది: 27.06.2024/ 26.06.2024
ప్రదేశం: విజయవాడ
మెసర్స్ చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరపున, సం/- అధీకృత అధికారి

నేడు అంతర్జాతీయ నిపుణుల బృందం పోలవరం రాక

- పనులను 4 రోజులు పరిశీలించనున్న నిపుణులు

ప్రజాశక్తి - పోలవరం

అంతర్జాతీయ నిపుణుల బృందం పోలవరం ప్రాజెక్టును సందర్శించనుంది. ఈ బృందం ఆదివారం ఉదయం 9:45 నిమిషాలకు ప్రాజెక్టు గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. నాలుగు రోజులపాటు పోలవరం ప్రాజెక్టును పరిశీలించి ప్రాజెక్టు నిర్మాణంలో ఎగువ, దిగువ కాపర్ డ్యాముల సీపేజీ, ప్రాజెక్ట్ నిర్మాణానికి ఎదురవుతున్న అవాంతరాలు, డయాఫ్రమ్ వాల్ పునర్నిర్మాణం తదితర అంశాలపై పరిశీలించనున్నారు. అనంతరం అధికారులు, కాంట్రాక్టర్‌తో సమీక్ష నిర్వహించనున్నారు.

స్పీకర్ స్థానానికి గౌరవం పెరిగేలా పని చేస్తా : అయ్యన్న

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

స్పీకర్ స్థానానికి మరింత గౌరవం పెరిగేలా పని చేస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. అతి చిన్న వయసులో ఎన్‌టిఆర్ మంత్రి పదవి ఇచ్చారని, ఇప్పుడు చంద్రబాబు స్పీకర్ పదవి ద్వారా అత్యున్నత గౌరవం ఇచ్చి ప్రధాన బాధ్యతలు అప్పగించారని అన్నారు. ముఖ్యమంత్రి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, పరిమితులకు లోబడి హుందాగా పని చేస్తానని పేర్కొన్నారు. స్పీకర్‌గా ఎన్నికై బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన శనివారం తొలిసారిగా విశాఖపట్నానికి విచ్చేశారు. ఈ క్రమంలో మీడియాతో మాట్లాడుతూ పైమేరకు స్పందించారు. విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్, పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్‌పి మరళీకృష్ణ, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, పోలీసు అధికారులు విశాల్ గున్ని, మేకా సత్తిబాబు, స్థానిక నేతలు, ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన నేతలు, అధికారులు స్పీకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

షాంఘై సదస్సుకు జైశంకర్

న్యూఢిల్లీ : వచ్చే వారంలో జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) శిఖరాగ్ర సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొనడం లేదు. కజకిస్థాన్ రాజధాని అస్తానాలో జరగనున్న ఈ సదస్సులో భారత్ తరుపున విదేశాంగ వ్యవహారాల మంత్రి ఎస్ జైశంకర్ పాల్గొననున్నారు. జులై 8, 9 తేదీలలో 5 ఏళ్ల తరువాత రష్యాలో ప్రధాని మోడీ పర్యటించనున్నారు. రష్యా పర్యటన అనంతరం ఆస్ట్రియాలో పర్యటించనున్నారు. ఈ రెండు దేశాల పర్యటనల కారణంగా ఎస్.సి.ఓ సదస్సుకు హాజరుకానవసరం లేదని మోడీ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. జులై 3, 4 తేదీలలో జరిగే ఎస్.సి.ఓ సదస్సు ప్రాంతీయ భద్రతా పరిస్థితి, కనెక్టివిటీ, వాణిజ్యాన్ని పెంచే మార్గాలపై దష్టి పెడుతుందని భావిస్తున్నారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఇటీవల మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. "ఎస్.సి.ఓ సమ్మిట్‌లో భారత ప్రతినిధి బృందానికి విదేశాంగ మంత్రి జైశంకర్ నాయకత్వం వహిస్తారు" అని పేర్కొన్నారు.

రీచా, రోడ్రిగ్స్, హర్మన్ అర్ధసెంచరీలు

చెన్నై: దక్షిణాఫ్రికా మహిళలతో జరుగుతున్న ఏకైక టెస్టులో టీమిండియా మహిళలు పట్టు బిగించారు. తొలిరోజే ఐదొందలకు పైగా పరుగులు చేసి రికార్డు నెలకొల్పిన హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం తొలి ఇన్నింగ్స్‌లో 6వికెట్ల నష్టానికి 603పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. అనంతరం స్నేహ్ రానా (3/61) విజృంభణతో సఫారీ అమ్మాయిలు చేతులెత్తేశారు. ఓపెనర్లు స్వల్ప స్కోర్‌కే విఫలమైనా.. మిడిల్ ఆర్డర్‌లో సునే లూస్(65), మరిజానే కాప్(69నాటౌట్)లు అర్ధ సెంచరీలతో జట్టును ఆదుకున్నారు. దాంతో, రెండోరోజు ఆట ముగిసే సరికి దక్షిణాఫ్రికా 4వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసింది. ఆ జట్టు ఇంకా తొలి ఇన్నింగ్స్‌లో 367 పరుగులు వెనకబడి ఉంది. వన్డే సిరీస్‌లో సఫారీలను వైట్ వాష్ చేసిన టీమిండియా ఏకైక టెస్టులోనూ అదరగొడుతోంది.

ఓవర్‌నైట్ స్కోర్ 4వికెట్ల నష్టానికి 525 పరుగులతో శనివారం రెండోరోజు ఆటను కొనసాగించిన టీమిండియాను వికెట్ కీపర్ రీచా ఘోష్(86), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(69)లు సఫారీ బౌలర్లను ఆడుకున్నారు. రోడ్రిగ్స్(55) కూడా రాణించడంతో టీమిండియా రెండోరోజు 603పరుగుల వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. అనంతరం బ్యాటింగ్‌లో తడబడ్డారు. స్పిన్నర్ స్నేహ్ రాణా దెబ్బకు దక్షిణాఫ్రికా ఓపెనర్లు డేంజరస్ లారా వొల్వార్డ్(20), అన్నెకె బోష్(39)లను ఔట్ చేసి సఫారీలను దెబ్బకొట్టింది. ఆ తర్వాత సునే లుస్, మరిజానే కాప్ అర్ధసెంచరీలతో మెరిసి ఇన్నింగ్స్ చక్కదిద్దారు. భారత బౌలర్లను వీరు సమర్థంగా ఎదుర్కొంటూ జట్టు స్కోర్ 150 దాటించారు. ఆ దశలో మరో స్పిన్నర్ దీప్తి శర్మ సూపర్ డెలివరీతో లినేను ఔట్ చేసి ఈ జోడీని విడదీసింది. ఆ తర్వాత నడినే డి క్లెర్క్(27 నాటౌట్) సాయంతో మరిజానే జట్టును ఆదుకుంది. వీళ్లిద్దరూ ఐదో వికెట్‌కు ఇప్పటికే 38 పరుగులు జతచేశారు. దాంతో, రెండో రోజు ఆట ముగిసే సరికి దక్షిణాఫ్రికా 4 వికెట్ల నష్టానికి 236పరుగులు చేసింది. ఆ జట్టు ఇంకా తొలి ఇన్నింగ్స్‌లో 367 పరుగులు వెనకబడింది.

'ఉక్కు నాణ్యతకు 'జిందాల్' దెబ్బ!

- నాసిరకం మాంగనీసు, డోలమైట్ సరఫరాతో ఉత్పత్తిపైనా తీవ్ర ప్రభావం
- స్టీల్ ప్లాంట్ యాజమాన్య ఒప్పందాలపై అనుమానాలు

ప్లాంట్‌లో ఉన్న నాసిరకం డోలమైట్ నిల్వలు ,జిందాల్ నుంచి వచ్చిన బూడిదతో కూడిన మాంగనీస్

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

జిందాల్ ప్రవేశంతో విశాఖ స్టీల్ ప్లాంట్ ముడి సరుకు కొరతను అధిగమిస్తుందని కేంద్ర ప్రభుత్వం చెప్పిన మాటలకు, ఆచరణకు పొంతన లేకుండా ఉంది. స్టీల్ ప్లాంట్ గొంతు నొక్కేందుకే జిందాల్‌ను తీసుకొచ్చిందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, కార్మికులు అప్పట్లో తెలిపిన అభ్యంతరాలు నేడు అక్షర సత్యమవుతున్నాయి. జిందాల్ సరఫరా చేస్తోన్న నాసిరకం ముడిసరుకు స్టీల్ నాణ్యతకు, ఉత్పత్తికి గండికొడుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిందాల్‌తో స్టీల్ యాజమాన్యం చేసుకున్న మాంగనీసు, డోలమైట్ సరఫరా అగ్రిమెంట్‌లో పెద్ద స్కాము జరిగిందని ఆరోపణ వినిపిస్తున్నాయి. నాసికరం ముడి సరుకును సరఫరా చేస్తూ స్టీల్ ప్లాంట్ ఉత్పత్తిని, స్టీల్ నాణ్యతను దెబ్బతీసేందుకు కేంద్ర ప్రభుత్వం అండదండలతో జిందాల్ ప్రయత్నిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. దీనికి స్టీల్ ప్లాంట్ యాజమాన్యం అన్ని విధాలా సహాయసహకారాలు అందిస్తోంది. జిందాల్ సరఫరా చేస్తున్న మాంగనీసులో బూడిద అధికంగా ఉండడంతో ఒప్పందంలో రూ.కోట్లు గోల్‌మాల్ జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 'లో క్వాలిటీ' మాంగనీసు ముడిసరుకును టన్నుల కొద్దీ జిందాల్ నుంచి రూ.కోట్లు పెట్టి స్టీల్ యాజమాన్యం కొనడం చర్చనీయాంశంగా మారింది. మాంగనీసు ఖనిజపు రాళ్లు ఒరిజనల్ కాగా, బూడిదైపోయిన మాంగనీసు నిల్వలను దిగుమతి చేసుకుటోంది. ఇప్పటికీ ప్లాంట్‌లో గుట్టలుగుట్టలుగా నాసిరకం డోలమైట్ నిల్వలు పడి ఉన్నాయి.

ప్రభావం ఇలా...

2047 నాటికి 500 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యమైతే ఇప్పటికే 200 మిలియన్ టన్నులు జరగాలి. కానీ, 117 మిలియన్ టన్నుల్లోనే ప్లాంట్ ఉంది. నాసిరకం మాంగనీసు, డోలమైట్ సరఫరాతో ప్లాంట్‌లో ఉక్కు ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం పడుతోంది. ఒక హీట్‌కు సుమారు 3.5 టన్నుల కాల్‌సైనింగ్ డోలమైట్‌ను వినియోగిస్తారు. ఇది ఒక టన్ను రూ.13 వేలు వరకూ ఉంటుంది. ఈ మధ్య కాలంలో రూ.36 కోట్ల విలువైన సుమారు 7,500 టన్నుల కాల్‌సైనింగ్ డోలమైట్‌ను జిందాల్ నుంచి స్టీల్ యాజమాన్యం కొనుగోలు చేసింది. ఇది అత్యంత నాసిరకంగా ఉన్నట్లు స్టీల్‌ప్లాంట్ ఎస్‌ఎంఎస్‌లో రుజువైంది. ఎస్‌ఎంఎస్ అవసరాలకు 10 నుంచి 40 ఎంఎం సైజు డోలమైట్ కావాల్సి ఉండగా, జిందాల్ నుంచి కొనుగోలు చేసిన డోలమైట్ పౌడరుతో కూడుకున్నది కావడంతో కార్మిక, ఉద్యోగులు నివ్వెరపోతున్నారు. కళ్లు మూసుకుని యాజమాన్యం ఎలా దిగుమతి చేసుకుంటుందంటూ మండిపడుతున్నారు. రూ.కోట్ల విలువైన మాంగనీసు ముడిసరుకు విషయంలోనూ సిఎండి వ్యవహారం అవినీతికరంగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమంగా తరలిపోతున్న డోలమైట్?

రూ.లక్షలు విలువ చేసే మైనస్ పది ఎంఎం సైజుగల డోలమైట్‌ను స్టీల్‌ప్లాంట్ నుంచి లారీల్లో అక్రమంగా తరలించుకుపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్లాంట్‌కు పహారా కాస్తున్న సిఐఎస్‌ఎఫ్ జవాన్లు ఇటీవల లారీల్లో అక్రమంగా తరలిపోతున్న డోలమైట్‌ను పట్టుకున్నారు. ప్లాంట్ బ్యాక్ హౌస్ నుంచి ఈ అక్రమ వ్యవహారం నడుస్తున్నట్లు గుర్తించారు. ఎంతకాలంగా ఇది సాగుతుందో విచారణ జరపాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) యాజమాన్యాన్ని డిమాండ్ చేస్తోంది.

రేపటి నుంచి ఐదు క్యాంటీన్ల మూసివేత!

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో 14 క్యాంటీన్లు ఉండగా, వాటిలో ఐదు క్యాంటీన్లను జులై 1 నుంచి మూసివేసేందుకు యాజమాన్యం రంగం సిద్ధం చేసింది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ నిర్దేశకత్వంలో ఈ చర్యలు చేపట్టింది. ఈ నిర్ణయం పట్ల అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కంపెనీ చట్టం ప్రకారం యాజమాన్యమే క్యాంటీన్‌లను నడపాలి. కానీ, కాంట్రాక్టర్లకు రూ.లక్షలు బకాయిలు కావాలనే పెట్టినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అధిక ఫీజులు నియంత్రించాలని ధర్నా

డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలని, పేదలకు 25 శాతం ఉచిత సీట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఏలూరు డిఇఒ కార్యాలయం వద్ద సిపిఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడుతూ.. ఏలూరులో కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలు ప్రతియేటా భారీగా ఫీజులు పెంచుకుంటూ పోతున్నాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలని, తమ ఆదాయాల్లో అధిక భాగం కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలకు ఫీజుల రూపంలో చెల్లిస్తున్నాయని తెలిపారు. దీంతో వారు అప్పుల పాలై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బుక్స్, మెటీరియల్, యూనిఫామ్ బ్యాగులు ఏవీ ప్రయివేట్ విద్యాసంస్థల్లో అమ్మకూడదన్నారు. కొన్ని ప్రయివేట్ విద్యాసంస్థలు దీనిని అతిక్రమిస్తున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్, ప్రయివేటు విద్య సంస్థల ఫీజుల నియంత్రణకు ఒక సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, వివిఎన్.ప్రసాద్, ఎం.ఇస్సాక్, జి.శారద, సీనియర్ నాయకులు కంది విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లు అడ్డుకున్నందుకే కేసులు

హైదరాబాద్ :సొసైటీ కాలనీలో అక్రమ రిజిస్ట్రేషన్లను అడ్డుకోవడం వల్లే కొందరు తనపై కేసులు పెట్టి జైలుకు పంపారని చిత్రపురి కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని సొసైటీ కార్యాలయంలతో శనివారం నాడు ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. "1994లో నటుడు ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక చొరవతో అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి సినీ కార్మికుల కోసం 67 ఎకరాల 16 గుంటల స్థలం కేటాయించారు. సభ్యులకు దానిని రిజిస్ట్రేషన్లు చేయటానికి ప్రయత్నిస్తుంటే కొందరు అడ్డుకుంటున్నారు. నేను దాని వ్యతిరేకిస్తే నాపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించారు. దీనివల్ల సినీ కార్మికుల గృహ నిర్మాణాలు నిలిచిపోయాయి. త్వరలోనే సొసైటీ జనరల్‌బాడీ సమావేశం ఏర్పాటు చేస్తాం. అధ్యక్ష పదవిని కోరుతున్న కొందరు నాపై కేసులు బనాయిస్తున్నారు. సినీ కార్మికుల శ్రేయస్సు కోసం అవసరమైతే అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తాను. ' అని అన్నారు.

మఠాలను ప్రక్షాళన చేయాలి

- ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ డిమాండ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

గోవింద నామ స్మరణతో మారుమోగే తిరుమలలో ఉన్న మఠాలను తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ప్రక్షాళన చేయాలని ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ డిమాండ్ చేస్తోందని శ్రీ ఆనందాశ్రమ పీఠాధిపతులు శ్రీనివాసానంద సరస్వతి డిమాండ్ చేశారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన వివిధ పీఠాధిపతులతో కలిసి మాట్లాడారు. తిరుమలలోని మఠాల్లో మఠాధిపతులు మాత్రమే ఉండాలని, అలా కాకుండా మఠాల నిర్వాహకులు ముఠాలుగా ఏర్పడి తిరుమలకు వచ్చే వారిని నిలువునా దోచుకుంటున్నారని, పెళ్లిళ్ల పేరుతో తిరుమలలో యాత్రికుల నుండి స్వామివారికి చెందాల్సిన ధనాన్ని పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా మ్యారేజ్ కాంట్రాక్టర్లుగా అవతారం ఎత్తిన రాఘవేంద్ర, రామారావు అనే వ్యక్తులు మఠాలను అడ్డుపెట్టుకొని అందులో పెళ్లిళ్లు చేయిస్తూ కోట్లు వెనకేశారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుమలతో ప్రక్షాళన చేస్తానని చెప్పి ఇఒను మార్చారని, ఒక్క ఇఒ మార్పుతో ప్రక్షాళన సాధ్యపడదని, ఇంకా గత ప్రభుత్వ మత్తులో ఉన్న అధికారులను తొలగించి పూర్తిగా ప్రక్షాళన చేయాలని విజ్ఞప్తి చేశారు. తిరుమలలో నిబంధనలను అతిక్రమించి వాగు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేసిన విశాఖ శారదా పీఠాన్ని తక్షణమే సీజ్ చేయాలని, భక్తుల భద్రత దష్ట్యా టిటిడి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

టిటిడి ఆన్లైన్ అప్లికేషన్లకు ఆధార్ అనుసంధానం : ఇఒ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

శ్రీవారి భక్తులకు టిటిడి అందిస్తున్న ఆన్లైన్ అప్లికేషన్ సేవలకు ఆధార్‌ను లింక్ చేయడం ద్వారా పారదర్శకతతో పాటు దళారీ వ్యవస్థను నియంత్రించేందుకు వీలవుతుందని టిటిడి ఇఒ జె.శ్యామలరావు చెప్పారు. తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనం సమావేశ మందిరంలో శనివారం యుఐడిఎఐ (ఆధార్ సంస్థ) నుండి విచ్చేసిన అధికారులు, టిసిఎస్ జియో, టిటిడి ఐటి విభాగంతో ఇఒ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ ఇదివరకే టిటిడి దర్శనం, వసతి, ఆర్జిత సేవలు, శ్రీవారి సేవ తదితర సేవలను ఆన్లైన్ ద్వారా యాత్రికులు బుక్ చేసుకునేందుకు వీలుకల్పిస్తోందన్నారు. అయితే, ఈ అప్లికేషన్ల ద్వారా కూడా దళారుల బెడద తప్పడంలేదని, వాటిని నియంత్రించడానికి ఆధార్ లింక్ చేసేందుకు సాధ్యాసాధ్యాలు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఐటి అధికారులను ఇఒ ఆదేశించారు. ఇందుకు సంబంధించి యుఐడిఎఐ అధికారుల సహకారాన్ని తీసుకోవాలన్నారు. ఆధార్ ద్వారా యాత్రికుల గుర్తింపు, పరిశీలన, బయోమెట్రిక్ వెరిఫికేషన్ ఎలా చేయాలి, ఆధార్ డూప్లికేషన్ ఎలా నిరోధించాలి తదితర అంశాలపై ఆయన చర్చించారు. అంతకుముందు యుఐడిఎఐ అధికారులు ఆధార్ ను ఏ విధంగా అప్లికేషన్ లకు లింక్ చేయవచ్చు, తదితరాంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో యుఐడిఎఐ డిప్యూటీ డైరెక్టర్ సంగీత, అధికారులు శ్రీనివాస్, రాజశ్రీ గోపాలకష్ణ, అనుకూర చౌదరి, సంజీవ్ యాదవ్, టీటీడీ జేఈఓలు వీరబ్రహ్మం, గౌతమి, సివి అండ్ ఎస్ఓ నరసింహ కిషోర్, రవాణా విభాగం జనరల్ మేనేజర్ శేషారెడ్డి పాల్గొన్నారు.

ఎపిఎల్ సీజన్-3 ట్రోఫీ ఆవిష్కరణ

- రేపటి నుంచి వైజాగ్‌లో మ్యాచ్‌లు ప్రారంభం

ప్రజాశక్తి -పిఎం పాలెం (విశాఖ)

ఆంధ్ర ప్రీమియర్ లీగ్ మూడవ సీజన్ ఆదివారం నుంచి వైజాగ్‌లోని డాక్టర్ వైఎస్ఆర్ ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ప్రారంభం కానుంది. మొత్తంగా 19 మ్యాచ్‌లు జరగనున్నాయి. మ్యాచ్‌లు జులై 13వ తేదీన ముగియనున్నాయి. వైజాగ్‌లోని ఓ హోటల్‌లో ఏపీఎల్ ట్రోఫీతో పాటు జెర్సీనిశనివారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ఆర్.గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ, చెన్నై, కర్ణాటకతో పాటు మరో రాష్ట్రంలో మాత్రమే స్థానిక ప్రీమియర్ లీగ్‌లు ఉండేవని, ఆ తర్వాత ఆంధ్రలో ఏపీఎల్‌ను ప్రారంభించామని చెప్పారు. స్థానిక క్రీడాకారుల ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ లీగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో ఏపీఎల్‌లో ప్రాతినిధ్యం వహించిన కెఎస్.భరత్, ఎన్.నితీష్‌కుమార్‌రెడ్డి, రిక్కి భుయ్, షేక్ రషీద్, పృధ్వీరాజ్, హరిశంకర్ రెడ్డి, విమెన్ లీగ్ నుంచి స్నేహ దీప్తి, షబ్నం ఐపిఎల్‌కు ప్రాతినిధ్యం వహించారని వివరించారు. ఏపీలో ఆడుతున్న క్రీడాకారులంతా ఏపీఎల్‌ను వేదికగా చేసుకుని పెద్ద స్థాయిలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. మ్యాచ్‌ను తిలకించేందుకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని, ఈ అవకాశాన్ని విద్యార్థులతో పాటు క్రికెట్ అభిమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైజాగ్ వారియర్స్ కెప్టెన్ కెఎస్.భరత్ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో సమానంగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అత్యాధునిక, మౌలిక వసతులు కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు వి.మురళీమోహన్, డి.ఆస్కార్‌వినోద్, అపెక్స్ కౌన్సిల్ మెంబర్ ఎన్.గీత, రాయలసీమ కింగ్స్, కోస్టల్ రైడర్స్, ఉత్తరాంధ్ర లయన్స్, గోదావరి టైటాన్స్, బెజవాడ టైగర్స్, వైజాగ్ వారియర్స్ జట్ల ఫ్రాంచైర్లు, కెప్టెన్లు తదితరులు పాల్గొన్నారు. స్టార్ స్పోర్ట్స్ తెలుగు, స్టార్ స్పోర్ట్స్ ఫస్ట్‌లో ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

మాయాబజార్ నాటకాన్ని రక్తికట్టిస్తున్న కళాకారులు

ఘనంగా సురభి నాటకోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖ)

సురభి సంస్కృతిని బతికిద్దామని, పౌరాణిక రంగాన్ని నిలబెడదామని విజయ నిర్మాణ సంస్థ అధినేత విజయ్ కుమార్ పేర్కొన్నారు. నాటక రంగ మనుగడకు విశాఖ వాసి బాదంగీర్ సాయి చేస్తున్న విశేష కృషిని కొనియాడారు. శనివారం నుంచి వారం రోజులపాటు కళాభారతి ఎసి ఆడిటోరియంలో జరిగే సురభి నాటకోత్సవాలను ఆయన ప్రారంభించారు. తొలిరోజు శ్రీ భానోదయ నాట్య మండలి (సురభి) హైదరాబాద్ సభ్యులు సురభి 140వ వార్షికోత్సవం సందర్భంగా కళాభారతి ప్రాంగణంలో మాయా బజార్ నాటకం ప్రదర్శించారు. రంగసాయి నాటక సంఘం - కళా భారతి సహకారంతో ఏర్పాటు చేసిన తొలి రోజు కార్యక్రమానికి సూరపనేని విజయ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉత్తరాంధ్రలో నాటక సంస్కృతి పురోగతికి అందరూ కృషి చేయాలన్నారు. బాదంగీర్ సాయి మాట్లాడుతూ జీవితాంతం కళారంగ సేవలోనే ఉంటానన్నారు. కార్యక్రమంలో నాటకోత్సవ నిర్వాహకులు నాగబోయిన నాగేశ్వరరావు, రచయిత కొరటాల ప్రభాకర్, పిల్లా రమణమూర్తి, మేడా మస్తాన్ రెడ్డి, వర్రె నాంచారయ్య, రంగస్థల నటీమణి శివజ్యోతి, రవి బ్రహ్మ, భానోదయ నాట్యమండలి ప్రతినిధి నాగబాబు తదితరులు పాల్గొన్నారు. సురభి నాటకోత్సవాలు ప్రారంభమవుతున్నాయని తెలిసి ఒక్కసారిగా జనం భారీగా తరలిరావడంతో కళాభారతి ఆడిటోరియం హౌస్‌ఫుల్‌గా కనిపించింది. చాలా మంది బయటే ఉండిపోయారు.

బాపట్ల జిల్లాలో ఘోరం

- బాలికపై సామూహిక అత్యాచారం

ప్రజాశక్తి- రేపల్లె (బాపట్ల జిల్లా)

బాపట్ల జిల్లాలో ఘోరం జరిగింది. బాలికపై ఐదుగురు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. నిందితుల్లో ఇద్దరు మైనర్లు ఉన్నారు. నిజాంపట్నం మండలం సజ్జవారిపాలెం గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. రేపల్లె డిఎస్‌పి మురళీకృష్ణ కథనం ప్రకారం... సజ్జవారిపాలేనికి చెందిన ఒక బాలిక పదో తరగతి తప్పడంతో ఇంటి వద్దే ఉంటోంది. తన బంధువుల ఊరైన వేమూరు మండలం పెరవలికి వెళ్లినప్పుడు అదే గ్రామానికి చెందిన మైనర్ బాలుడు పి.చైతన్యతో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో తరచూ వారు ఫోన్లో మాట్లాడుకొనేవారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి పది గంటల సమయంలో బాలికకు ఆ బాలుడు ఫోన్ చేసి ఊరు చివరకు రావాలని చెప్పాడు. దీంతో, అక్కడికి వెళ్లిన ఆ బాలికను పొలాల్లోకి తీసుకెళ్లాడు. అప్పటికే చైతన్య స్నేహితులు జొన్నకూటి వెంకటేష్, వీరంకి సతీష్, వీరంకి వేణు, ఎడాలి పవన్‌కుమార్ (మైనర్) అక్కడ ఉన్నారు. వారు ఐదుగురు బాలికపై అత్యాచారం చేశారు. ఈ విషయాన్ని ఆ బాలిక ఇంటికి వెళ్లి తన తల్లిదండ్రులకు చెప్పి బోరున విలపించింది. దీంతో, వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు రేపల్లె డిఎస్‌పి మురళీకృష్ణ తెలిపారు. రూరల్ సిఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఘటన జరిగిన గంటల వ్యవధిలోనే నిందితులను అరెస్టు చేశామని, నిందితులపై పోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు. అత్యాచారం కేసులో నిందితులను త్వరితగతిన పట్టుకున్న పోలీసు సిబ్బందిని డిఎస్‌పి అభినందించారు.

కళాకారులను అభినందిస్తున్న కలెక్టర్

మైనస్-2 డిగ్రీల వద్ద కూచిపూడి నృత్యం

- ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తాడిపత్రి కూచిపూడి కళాకారిణులు

ప్రజాశక్తి - అనంతపురం

ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ వద్ద మైనస్-2 డిగ్రీల ఉష్ణోగ్రతలో అనంతపురం జిల్లా తాడిపత్రి వందన డ్యాన్స్ అకాడమీకి చెందిన కూచిపూడి కళాకారిణులు సాయి మైత్రి, జ్యోషిత, వర్షిని, నవ్య, సాహిత్య, నిహారికలు కూచిపూడి నృత్యం చేసి ఇండియా బుక్‌ఆఫ్ రికార్డులో పేర్లు నమోదు చేసుకున్నారు. అత్యంత ప్రతిభ చాటిన ఈ విద్యార్థులను అనంతపురం కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అభినందించారు. కలెక్టరేట్‌లో తనను కలిసిన కళాకారిణులను ఆయన సత్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కూచిపూడి కళలో నిష్ణాతులైన ఆరుగురు విద్యార్థినులు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు దక్కించుకోవడం అభినందనీయమన్నారు. వందన డ్యాన్స్ అకాడమీకి చెందిన కూచిపూడి గురువు వందన భర్త ప్రవీణ్ మాట్లాడుతూ.. మే 13న కేదార్‌నాథ్ ఆలయం వద్ద మైనస్-2 డిగ్రీల చలిలో ఉదయం ఏడు గంటల నుంచి 8:30 గంటల వరకు గంటన్నర పాటు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారన్నారు. భవిష్యత్తులో కైలాస పర్వతం (మౌంట్ కైలాస్) వద్ద నృత్యాన్ని ప్రదర్శించేందుకు తాము సన్నద్ధం అవుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌డిఒ షఫీ తదితరులు పాల్గొన్నారు.

మేడే రచనల ఆవిష్కరణ, బహుమతుల ప్రదాన సభ నేడు

ప్రజాశక్తి - విజయవాడ

మేడే సందర్భంగా తాము నిర్వహించిన రచనల పోటీల్లో గెలుపొందిన, ఎంపికైన రచనలతో రూపొందించిన పుస్తకాల ఆవిష్కరణ, విజేతలకు బహుమతీ ప్రదానం ఆదివారం విజయవాడలోని బాలోత్సవ్ భవనం రెండో అంతస్థులో జరపనున్నట్టు జాషువా సాంస్కృతిక వేదిక కన్వీనర్ గుండు నారాయణ రావు తెలిపారు. మేడే సందర్భంగా కథలు, కవితలు, పాటల పోటీలు ప్రకటించి, రచనలు ఆహ్వానించగా రచయితల నుంచి మంచి స్పందన వచ్చిందని ఆయన తెలిపారు. "వచ్చిన రచనల నుంచి బహుమతులకు న్యాయనిర్ణేతలు ఐదేసి రచనలు ఎంపిక చేసి, బహుమతులు ప్రకటించారు. ప్రతి విభాగంలోనూ మరికొన్ని రచనలు ప్రచురణకు ఎంపిక చేశారు. వాటన్నిటితో "మాసిపోని మరకలు" కథల సంకలనం, "క్షేత్రం" కవితా సంకలనం, "దీపం" పాటల సంకలనం ప్రచురించాం. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకూ ఈ పుస్తకాల ఆవిష్కరణ సభలు, వక్తల ప్రసంగాలూ ఉంటాయి. ఈ సభల్లో తెలకపల్లి రవి, అట్టాడ అప్పలనాయుడు, సీతారాం, డాక్టర్ సుంకర గోపాలయ్య, ఉషారాణి, గోళ్ల నారాయణ రావు, చీకటి దివాకర్ తదితరులు అతిథులుగా పాల్గొంటారు. 'కళింగాంధ్ర కథాజాడ" పుస్తక పరిచయ సభ సాయంత్రం జరుగుతుంది. ఆయా సెషన్లకు వొరప్రసాద్, అనిల్ డ్యానీ, శాంతిశ్రీ, సత్యాజీ అధ్యక్షత వహిస్తారు. ఈ సభలో వివిధ విభాగాల్లో గెలుపొందిన రచయితలకు బహుమతీ ప్రదానం ఉంటుంది. సాహిత్యాభిలాషులు, కవులు, రచయితలూ హాజరై, సభను జయప్రదం చేయాల్సిందిగా నారాయణ రావు కోరారు.

వైవియు విసి, రిజిస్ట్రార్ రాజీనామా

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగివేమన యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య రాజీనామా చేశారు. ముందుగా రిజిస్ట్రార్ రాజీనామాను ఆమోదించి అనంతరం విసి ఆచార్య సుధాకర్ రాజీ నామా చేశారు. ఈ సమాచారాన్ని ఉన్నత విద్యా మండలి కార్యదర్శికి పంపారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా వైవీయూ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. వివిధ విశ్వవిద్యాలయాలకు డిప్యూటేషను పై వెళ్లిన వైవీయూ ప్రొఫెసర్లు ఇ.సి. సురేంద్ర నాథ్ రెడ్డి, ఆచార్య రామచంద్రారెడ్డి శనివారం తన మాత సంస్థ అయిన వైవీయూలోకి వచ్చారు.

సారా అమ్మకాలపై మహిళల ఆగ్రహం

ప్రజాశక్తి- సీతానగరం (తూర్పుగోదావరి జిల్లా)

నాటు సారా అమ్మకాలపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో మహిళలే ప్రతిఘటించి సారా ప్యాకెట్లను పోలీసులకు అప్పగించిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురంలోని వడ్డీలపేటలో శనివారం చోటుచేసుకుంది. 25 కుటుంబాలు నాటుసారా అమ్ముతూ తమ పిల్లల, కుటుంబ యజమానుల ఆరోగ్యంతో ఆడుకుంటున్నాయని మహిళలు వాపోతున్నారు. స్థానిక పోలీసులకు, ఎస్ఇబి అధికారులకు తెలియజేసినా ప్రయోజనం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చెందుతున్నారు. దీంతో, నాటు సారా అమ్ముతున్న ఇళ్లలోకి మహిళలు వెళ్లి సారా ప్యాకెట్లను బయటకు తీసుకొచ్చి పోలీసులకు అప్పగించారు. రఘుదేవపురం గ్రామంలో వడ్డీలపేట మహిళల ఆవేదన చూసి జిల్లా అధికారులు స్పందించాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి. వడ్డీలపేటలో ఇప్పటికే ఎంతోమంది సారాకు బానిసలై ప్రాణాలు కోల్పోయినట్టు వారు తెలిపారు. సారా అమ్మకాలపై ప్రశ్నిస్తే వ్యాపారులు దౌర్జన్యానికి దిగుతున్నారని మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసులు అధికారులు తక్షణమే స్పందించి సారా అమ్మకాలను పూర్తి స్థాయిలో అరికట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమం చేయడానికి వెనకాడబోమని హెచ్చరించారు.

గుజరాత్‌లో క్రికెట్ టోర్నీ సందర్భంగా ఘర్షణ

ముస్లిం యువకుడి దారుణ హత్య

- క్రికెట్ ప్రాంగణంలో కత్తులు, బ్యాట్‌లతో దాడి

చికోద్రా : లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తరువాత ముస్లింలపై మతోన్మాద శక్తుల దాడులు చివరికి క్రీడా ప్రాంగణాలకు కూడా పాకాయి. తాజాగా గుజరాత్‌లో క్రికెట్ టోర్నమెంట్ సందర్భంగా ఓ ముస్లింయువకుడు దారుణ హత్యకు గురయ్యాడు.: ఈ నెల 22న చికోద్రాలో క్రికెట్ టోర్నమెంట్‌ను చూడడానికి వెళ్లిన సల్మాన్ వోహ్రా (23) అనే యువకుడితో ఒక గ్యాంగ్ తగాదా పెట్టుకుని, అతనిపై కత్తులు, బ్యాట్‌లతో క్రూరంగా దాడి చేశారు. అనంతరం జై శ్రీరామ్ అంటూ నినాదాలిచ్చుకుంటూ వెళ్లిపోయారని ప్రత్యక్ష సాక్షులు ది 'క్వింట్'. పత్రికకు తెలిపారు. తీవ్రంగా గాయపడిన సల్మాన్‌ను ఆసుపత్రికి తరలించగా శనివారం ఆయన చనిపోయాడు. "రెండు మాసాల క్రితమే వోహ్రాకు పెళ్ళి అయింది, భార్య ముషీరా ఇప్పుడు గర్భవతి." అని సల్మాన్ అంకుల్ తెలిపారు. ఈ దాడిలో సల్మాన్‌తో పాటు మరో ఇద్దరు కూడా గాయపడ్డారు. వారిలో ఒకరికి 17కుట్లు పడ్డాయి. రెండో వ్యక్తికి ఏడు కుట్లు పడ్డాయి. గుజరాత్‌లోని ఆనంద్‌లో పోల్సన్ కాంపౌండ్ వాసి అయిన సల్మాన్ వస్త్ర వ్యాపారంలో పనిచేస్తున్నాడు. టోర్నమెంట్ సమయంలో మత ఘర్షణలు పెచ్చరిల్లే అవకాశం వుందని, క్రీడాకారులకు కూడా సురక్షితమైన వాతావరణం లేదని నిర్వాహకులే ఆందోళన వ్యక్తం చేశారంటే పరిస్థితి తీవ్రత ఏ స్థాయిలో వుందో అర్థమవుతోంది. టోర్నమెంట్‌లో, క్వార్టర్ ఫైనల్స్, ఫైనల్స్‌లో ముస్లిం యువకులు బాగా ఆడటాన్ని మతతత్వ మూకలు సహించలేక పోయాయని సామాజిక కార్యకర్త అసీమ్ ఖెద్వాలా తెలిపారు. ఫైనల్‌లో కూడా ఒక టీమ్‌లో ఎక్కువమంది ముస్లింలే వున్నారని, మరో దాంట్లో ఇద్దరు ముగ్గురు ముస్లింలు వున్నారని ఆయన తెలిపారు. తమకు భద్రత వుందని భావించడం లేదని, తాము ఆడుతుంటే కొంతమంది జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారని ముస్లిం ఆటగాళ్లలో చాలామంది చెప్పారన్నారు.

వివాదం రేగిందిలా !

వెహికల్ పార్కింగ్ వద్ద మొదట వివాదం ప్రారంభమైంది. కొంతమంది గ్రూపుగా మోటార్‌సైకిళ్లపై వచ్చి సల్మాన్ బైక్‌ను స్టాండ్ నుండి తీసేయాలంటూ గొడవ పెట్టుకున్నారు. ఆ బృందంలో కొంతమంది బాగా తాగేసి వున్నారు. మేం చెప్పింది చేయాలంటూ సల్మాన్‌ను హెచ్చరించారు. కొద్దిసేపు అయిన తర్వాత మరో నలుగురైదుగురిని తీసుకుని అక్కడకు వచ్చారు. బాగా తాగి వున్న వ్యక్తి మరో ముస్లిం యువకుడు సుహైల్‌ను సల్మాన్ అనుకుని దాడి ప్రారంభించాడు. వారినుండి సుహైల్‌ను రక్షించేందుకు సల్మాన్ రావడంతో అతనిపై అల్లరి మూక బ్యాట్‌లు, కత్తులతో దాడికి పాల్పడింది.

ఒక చెవిని కొరికేశారు !

ఆ వ్యక్తులు నిర్దాక్షిణ్యంగా సల్మాన్‌ను కొడుతున్నా, అక్కడకు చేరిన జనం చోద్యం చూస్తున్నట్లుగా వుండగా, మరికొంతమంది దాడి చేస్తున్న వారికి మద్దతిచ్చేలా వ్యవహరించారు. 'అతడిని చంపేయండి, చంపేయండి అంటూ కొంతమంది అరవడం ది క్వింట్ సంపాదించిన వీడియోలో వినిపిస్తోంది. సల్మాన్ నిస్సత్తువుగా పడిపోవడంతో వారు కొట్టడం ఆపారు. ఈలోగా కొంతమంది అతడిని లేపి, మంచినీరు తాగించి అంబులెన్సుని పిలిపించారు. సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా వారు పెద్ద ఆసుపత్రికి తీసుకెళ్లమని సూచించారు. రెండో ఆస్పత్రికి వెళ్ళేసరికే సల్మాన్ చనిపోయాడు. 'సల్మాన్ మృతదేహాన్ని చూశాను. కుడి చేతిపై గాయాలు వున్నాయి. కళ్ళకింద కత్తిగాట్లు వున్నాయి. చెవి ఒకటి దారుణంగా దెబ్బతింది. దాడి చేసిన వారు దాదాపుగా సల్మాన్ చెవిని కొరికేశారు. కత్తితో జరిపిన దాడితో ,చాలా పెద్ద గాయమవడంతో అతడి కిడ్నీ తీవ్రంగా దెబ్బతింది. నడుం కింది బాగంలో, మెడపై తీవ్రంగా చావబాదారు. మొత్తంగా శరీరం రక్తమోడుతూ వుంది.' అని కార్యకర్త ఆసిమ్ తెలిపారు. కత్తి నేరుగా సల్మాన్ కిడ్నీలోకి దిగబడిపోయిందని పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది. బహుశా మరణానికి ఇదే ప్రధాన కారణమై వుంటుందని సల్మాన్ మామ నార్మన్ అన్వర్ పేర్కొన్నారు.

ఎఫ్ఐఆర్ నమోదు

సల్మాన్ కుటుంబం ఆనంద్ రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసింది. ఈ కేసులో ఇప్పటివరకు తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు దర్యాప్తు అధికారి ఎ.జె.అసారి తెలిపారు. వారిని ఏడు రోజుల రిమాండ్‌కు పంపారు. కత్తులతో క్రికెట్ గ్రౌండ్‌కు వచ్చారంటే వారు దాడులకు ముందస్తు పథకంతోనే వచ్చారని అర్థమవుతోందని అసీమ్ ఖెద్వాలా వ్యాఖ్యానించారు. కాగా, మ్యాచ్ చూసేందుకు వచ్చిన జనం దాదాపుగా 5వేల మంది వరకు వుంటే, వారిలో ముస్లింలు 500మంది కన్నా ఎక్కువమంది వుండరని ప్రేక్షకుల్లో కొంతమంది తెలిపారు.

నీట్ అవకతవకలపై 1,100 కేసులు

- సుప్రీంకోర్టులో 159, రాష్ట్రాల హైకోర్టుల్లో 941 కేసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో సంచలనం సృష్టించిన వైద్య విద్యా ప్రవేశానికి జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) అవకతవకలపై దేశవ్యాప్తంగా కోర్టుల్లో 1,100 కేసులు సంబంధించిన పిటిషన్లు దాఖలయ్యాయి. అందులో సుప్రీంకోర్టులో 159 కేసులకు సంబంధించిన పిటిషన్లు దాఖలు కాగా, 13 రాష్ట్రాల్లోని హైకోర్టుల్లో 941 కేసులు సంబంధించిన పిటిషన్లు దాఖలయ్యాయి. అత్యధికంగా 216 కేసులు తమిళనాడులోని మద్రాస్ హైకోర్టులో 216 పిటిషన్లు, రాజస్థాన్ హైకోర్టులో 127, ఢిల్లీ హైకోర్టులో 99 పిటిషన్లు దాఖలయ్యాయి. మహారాష్ట్రలోని ముంబయి హైకోర్టులో 78, పంజాబ్, హర్యానా హైకోర్టులో 62, కేరళ హైకోర్టులో 60, ఒరిస్సా హైకోర్టులో 49, ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ హైకోర్టులో 39, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో 37, కర్నాటక హైకోర్టులో 36, మధ్యప్రదేశ్ హైకోర్టులో 24, బీహార్‌లోని పాట్నా హైకోర్టులో 19, గుజరాత్ హైకోర్టులో 15 పిటిషన్లు నమోదయ్యాయి. 2018లో 6, 2019లో 125, 2020లో 137, 2021లో 191, 2022లో 317, 2023లో 185, 2024 (ఇప్పటి వరకు)లో 139 పిటిషన్లు దాఖలయ్యాయి.

గుజరాత్‌లో సిబిఐ సోదాలు

గాంధీనగర్ : నీట్ (యుజి) స్కామ్‌లో గుజరాత్‌లోని అనేక ప్రాంతాల్లో సిబిఐ శనివారం సోదాలు నిర్వహించింది. గోద్రా, అహ్మదాబాద్, ఖేడ, ఆనంద్ జిల్లాల్లోని వివిధ ప్రదేశాల్లో ఈ సోదాలు జరిగాయి. ఈ కేసులో మరొక నిందితుడు, జార్ఖండ్‌లోని హజారీబాగ్‌కు చెందిన ఒక హిందీ దినపత్రిక జర్నలిస్టు జమాలుద్దీన్‌ను అరెస్టు చేసినట్లు సిబిఐ శనివారం తెలిపింది. పేపర్ లీక్ వ్యవహారంలో బీహార్‌లోని ఒయాసిస్ స్కూల్ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌కు సహాయం చేసాడనే ఆరోపణలతో జమాలుద్దీన్‌ను అరెస్టు చేసినట్లు తెలిపింది. గుజరాత్‌లోని గోద్రాలో ఒక పరీక్షా సెంటర్‌లో కాపీ జరిగిందనే ఆరోపణలతో ఐదుగురిని గుజరాత్ పోలీసులు ఈ నెల 14న అరెస్టు చేశారు. వీరిలో ఒక కోచింగ్ సెంటర్ అధిపతి కూడా ఉన్నాడు. అలాగే గుజరాత్‌లోని వడోదరలో నిర్వహించే ఒక కోచింగ్ సెంటర్ కూడా ఈ స్కామ్‌లో భాగముందని ఆరోపణలు ఉన్నాయి.

రెండు రోజుల్లో నీట్-పిజి కొత్త షెడ్యూల్

పంచకుల : నీట్-పిజికి సంబంధించిన కొత్త షెడ్యూల్‌ను మరో రెండు రోజుల్లో నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (ఎన్‌బిఇ) ప్రకటిస్తుందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ తెలిపారు. పోటీ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ముందస్తు చర్యగా గతవారంలో నీట్-పిజిని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. 'నీట్-పిజి తేదీని ఒకటి, రెండు రోజుల్లో ఎన్‌బిఇ ప్రకటిస్తుంది' అని విలేకరులకు మంత్రి శనివారం తెలిపారు. ఇప్పటికే రద్దు చేసిన మూడు పోటీ పరీక్షలకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) కొత్త తేదీలు ప్రకటించిన ఒక రోజు తరువాత కేంద్ర మంత్రి ఈ విధంగా ప్రకటించారు. గతవారంలో రద్దు చేసిన యుజిసి-నెట్‌ను ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 4 వరకూ నిర్వహిస్తామని ఎన్‌టిఎ ప్రకటించింది. కౌన్సిల్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సిఎస్ఐఆర్) యుజిసి నెట్‌ను జులై 25 నుంచి జులై 27 వరకూ నిర్వహించనున్నారు. నాలుగు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ (ఐటిఇపి)లో ప్రవేశం కోసం నిర్వహించే నేషనల్ కామన్ ఎంట్రన్స్ టెస్టు (ఎన్‌సిఇటి)ను జులై 10న నిర్వహించనున్నారు.

నీటి కోసం వెళితే కాల్పులు

- ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి
- సుజయెలో కొనసాగుతున్న సైనిక దాడులు

గాజా : గాజా నగరంలో నీటి పంపిణీ కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ బలగాలు దాడులకు పాల్పడ్డాయి. ఈ దాడుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మరణించారని పాలస్తీనా ఆరోగ్య శాఖాధికారులు తెలిపారు. వీరిలో పిల్లలు కూడా వున్నారు. దాడుల కారణంగా నీటి కాలుష్యం బాగా పెరిగిపోయింది, దీంతో నిర్వాసితులైన పాలస్తీనియన్లు కంటెయినర్లతో నీటిని పట్టుకుంటుండగా, వారిపై కాల్పులు జరిగాయి. శనివారం ఉదయం నుండి వివిధ ప్రాంతాల్లో జరిగిన దాడుల్లో మొత్తంగా 31మంది పాలస్తీనియన్లు మరణించారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. గత రాత్రి నివాస భవనాలపై జరిగిన సైనిక దాడుల్లో నలుగురు పిల్లలతో సహా ఆరుగురు మరణించగా, మరో 15మంది గాయపడ్డారు. సెంట్రల్ గాజాలోని మఘాజి శరణార్థ శిబిరంపై కూడా దాడి జరిగిందని, అనేకమంది మరణించారని పాలస్తీనా వార్తా సంస్థ వాఫా తెలిపింది. బురెజి శరణార్థ శిబిరంపై కూడా ఇజ్రాయిల్ బలగాలు దాడులు జరిపాయి. నివాస భవనాలను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఈ దాడుల్లో అనేకమంది మరణించారని మీడియా వార్తలు తెలిపాయి. సాబ్రా ప్రాంతంలో ఇంటిపై, కారుపై జరిగిన దాడిలో నలుగురు మరణించగా, 8మంది గాయపడ్డారు. గత 9మాసాలుగా జరుగుతున్న దాడుల్లో ఇప్పటివరకు 37,834మంది మరణించగా, 86,858మంది గాయపడ్డారు. సెంట్రల్ గాజాలో మున్సిపల్‌పార్క్‌పై బాంబు దాడి జరగడంతో మరో ఐదుగురు పాలస్తీనియన్లు మరణించారు. సుజయె ప్రాంతంలో సైనిక చర్యలు చేపడతామని, ప్రమాదకరమైన యుద్ధ జోన్‌గా మారుతుందని హెచ్చరిస్తూ ప్రజలను ఖాళీ చేయాలని సైన్యం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఇప్పటికే దాదాపు 60వేల మంది ప్రజలు అక్కడ నుండి వెళ్లిపోయారు. దక్షిణ గాజాలోని అల్ మవాసి ఏరియాలో సైనిక చర్యల ఫలితంగా ఐదు వేల మంది ప్రజలు నిర్వాసితులయ్యారు. అనేకమంది మరణించారు. సుజయెలో సైనిక చర్యలు కొనసాగుతున్నాయని ఆర్మీ ప్రకటించింది. మొత్తంగా వాయు, భూతల దాడులు ఒకేసారి కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. స్కూలు ఆవరణలో ఆయుధాల నిల్వ కేంద్రాన్ని కనుగొన్నామని సైన్యం ప్రకటించింది. తమకందిన నిఘా సమాచారం ప్రాతిపదికగా భూతలదాడులు సాగుతున్నాయని తెలిపారు.

భారత శతకోటీశ్వరుల్లో 88 శాతం అగ్ర కులస్తులే...

- ఎస్‌టిల నుంచి ఒక్కరూ లేరు..
- ప్రపంచ అసమానతల నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ : భారత్‌లో ఆర్థిక అసమానతలు తీవ్రస్థాయిలో పెరుగుతున్నాయని వరల్డ్ ఇన్ ఇక్వాలిటీ నివేదిక స్పష్టం చేసింది. దేశంలో ఉన్న శతకోటీశ్వర్లుల్లో 88 శాతం అగ్ర కులస్తులే అని తెలిపింది. ఎస్‌టిల నుంచి ఒక్కరూ లేరని పేర్కొంది. 'టువర్డ్స్ ట్యాక్స్ జస్టిస్ అండ్ వెల్త్ రిడిస్ట్రిబ్యూషన్ ఇన్ ఇండియా' పేరుతో ఈ నివేదికను విడుదల చేశారు. భారత్‌లోని మొత్తం సంపదలో 40 శాతం సంపద ఒక్క శాతం జనాభా నియంత్రణలో ఉందని ఈ నివేదిక తెలిపింది.

ఈ నివేదిక ప్రకారం దేశంలో శతకోటీశ్వరుల్లో 88.4 శాతం వరకూ అగ్రకులస్తులే ఉన్నారు. అత్యంత అట్టడుగు వర్గాలుగా భావించే ఎస్‌టిల నుంచి ఒక్కరూ లేరు. ఇది దేశంలో పెరుగుతున్న అర్థిక అసమానతలను సూచిస్తుందని నివేదిక తెలిపింది. 2018-19 అల్ ఇండియా డెట్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సర్వే (ఎఐడిఐఎస్) నివేదిక ప్రకారం మొత్తం దేశ సంపదలో 55 శాతం సంపద అగ్ర కులస్తుల చేతిలోనే ఉందని తాజా నివేదిక గుర్తు చేసింది. భారత కుల వ్యవస్థలోని అసమానతలు దేశ ఆర్థిక వ్యవస్థలోనూ వ్యాప్తి చెందాయని తెలిపింది.

ఆర్థిక వ్యవస్థపై కులాధిపత్యం

దేశ ఆర్థిక వ్యవస్థపైనా కులాధిపత్యం కొనసాగుతోందని నివేదిక స్పష్టం చేసింది. సంపద సృష్టికి, పరిశ్రమల స్థాపనకు అవసరమైన విద్య, ఆరోగ్య సంరక్షణ, సోషల్ నెట్‌వర్క్స్, రుణాలు వంటి అన్ని అంశాలపైనా కులాధిపత్యం తీవ్రస్థాయిలో ఉందని నివేదిక పేర్కొంది. చారిత్రాత్మకంగా దళితులకు అనేక ప్రాంతాల్లో భూమి లేకుండా నిషేధించారని, ఇది దళితుల ఆర్థిక పురోగతిని పరిమితం చేస్తుందని తెలిపింది. కుల అధారిత ఆర్థిక అసమానత ఎంటర్‌ప్రైజ్ యజమానుల్లోనూ ఉందని పేర్కొంది. అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం విడుదల చేసిన స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా 2023 నివేదికను ప్రస్తావించింది. ఈ నివేదిక ప్రకారం ఎస్‌సిలు, ఎస్‌టిల శ్రామిక శక్తితో పోల్చుకుంటే, ఎంటర్‌ప్రైజ్ ఓనర్లుగా చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారు. శ్రామిక శక్తిలో ఎస్‌సిలు 19.3 శాతం వరకూ ఉండగా, సొంతంగా వ్యాపారాలు చేసుకునేవారిలో 11.4 శాతం మాత్రమే ఉన్నారు. శ్రామిక శక్తిలో 10.1 శాతంగా ఉన్న ఎస్‌టిల్లో 5.4 శాతం మాత్రమే ఎంటర్‌ప్రైజ్ ఓనర్లుగా ఉన్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం అధిక సంపదవర్గంలో ఎస్‌సిలు 12.3 శాతం, ఎస్‌టిలు 5.4 శాతం ఉన్నారు. తక్కువ సంపద వర్గంలో ఎస్‌సిలు 25 శాతం, ఎస్‌టిలు 46.3 శాతం ఉన్నారు. ఒబిసిలు అధిక సంపద వర్గంలో 19.2 శాతంగానూ, తక్కువ సంపద వర్గంలో 16.3 శాతం ఉన్నారు.

రికార్డు స్థాయికి ఆర్థిక అసమానతలు

స్వాతంత్ర్యం తరువాత దేశంలో ఆర్థిక, ఆదాయ అసమానతల్లో క్షీణత ఉంది. 1980 నుంచి మళ్లీ ఇవి పెరగడం ప్రారంభమైంది. 2000 నుంచి పెరుగుదల తీవ్రమైంది. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి 2022-23 ఏడాది వరకూ ఆర్థిక, ఆదాయ అసమానతలు, సంపద కేంద్రీకరణ రికార్డు స్థాయికి చేరుకున్నాయి. ఆర్థిక అసమానతల విషయంలో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉంది. దేశ సంపదలో 90 శాతం 10 శాతం జనాభా చేతిలోకి పోతుంటే, మిగిలిన 10 శాతం సంపదను మిగిలిన 90 శాతం జనాభా పంచుకుంటున్నారు.

నిన్న ఢిల్లీ.. నేడు రాజ్‌కోట్

రాజ్‌కోట్‌లో కూలిన కెనోపీ

- విమానాశ్రయాల్లో కరువవుతున్న భద్రత
- రాజ్‌కోట్ విమానాశ్రయంలో కూలిన కెనోపీ
- వారంలో మూడో ఘటన

రాజ్‌కోట్ : భారీ వర్షాలకు ఢిల్లీ విమానాశ్రయంలో టెర్మినల్-1లో కొంత భాగం కూలిపోయిన ఘటన మర్చిపోకముందే రాజ్‌కోట్ హిరసార్ అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్ వద్ద ఏర్పాటు చేసిన కెనోపీ (గుడ్డతో ఏర్పాటు చేసిన పందిరి)లో కొంతభాగం శనివారం కూలిపోయింది. ప్రయాణికులను పికప్, డ్రాప్ చేసే టెర్మినల్ వెలుపలి భాగం వద్ద ఈ ఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ప్రమాదంలో ఎవ్వరూ గాయపడటం కానీ, మరణించడం కానీ జరగలేదని అధికారులు తెలిపారు.

నూతనంగా నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును గత ఏడాది జులైలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించారు. ఈ ఎయిర్‌పోర్టును రాజ్‌కోట్‌కు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న హిరసార్ గ్రామంలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ) నిర్మించింది.

విమానాశ్రయాల్లో ఇలాంటి ఘటన జరగడం వారం రోజుల్లోనే ఇది మూడోది. ఈ నెల 27న మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ విమానాశ్రయంలోనూ ఫ్యాబ్రిక్ కెనోపిలో కొంతభాగం కూలిపోయింది. దాని కింద పార్క్ చేసిన కారు నుజ్జునుజ్జయిందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. ఈ ప్రమాదంపై ప్రాజెక్టు అధికారిని విచారణకు ఆదేశించామని, ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశామని విమానాశ్రయ డైరెక్టర్ రాజీవ్ రత్న పాండే తెలిపారు.

ఢిల్లీ విమానాశ్రయంలో శుక్రవారం టెర్మినల్1లో కొంత భాగం కూలిపోవడంతో ఒకరు మృతి చెందగా, ఆరుగురు తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. నాలుగు వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి.

గుజరాత్‌లో భారీ వర్షాలు

వాయుగుండం కారణంగా గుజరాత్‌లో గత రెండు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. రానున్న ఐదు రోజుల పాటు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. దక్షిణ గుజరాత్‌కు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

చట్ట పరమైన చర్యలపై నిర్ణయం తీసుకుంటాం
ఢిల్లీ మృతుడి కుటుంబం వెల్లడి

అంత్యక్రియల తరువాత చట్ట పరమైన చర్యలపై నిర్ణయం తీసుకుంటామని ఢిల్లీ విమానాశ్రయం టెర్మినల్-1 శుక్రవారం కూలిపోవడంతో ప్రాణాలు కోల్పోయిన క్యాబ్ డ్రైవర్ రమేష్‌కుమార్ కుటుంబం తెలిపింది. సఫ్దర్ జంగ్ ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం అనంతరం రమేష్‌కుమార్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు శనివారం అప్పగించారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ కుమారుడు 25 ఏళ్ల రవీందర్ విలేకరులతో మాట్లాడారు. తన తండ్రి అంత్యక్రియల తరువాత తన తండ్రి మరణానికి కారణమైన వారిపై కేసు నమోదు చేయాలా? వద్దా? అనే విషయంపై తన కుటుంబం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. కేంద్రం ప్రకటించిన రూ.20 లక్షల పరిహారంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తన తండ్రి ఇటీవలే రూ.5 లక్షలతో వాహనం కొనుగోలు చేశారని చెప్పారు. రూ.లక్ష డౌన్ పేమెంట్ కట్టాల్సి వచ్చిందని చెప్పారు. రమేష్‌కుమార్‌కు భార్య ఆశా, కుమారులు రవీందర్, ఆశిష్, కుమార్తెలు రాశి, భావన ఉన్నారు. వీరంతా రోహిణిలోని విజయ్ విహార్ ప్రాంతంలో అద్దె ఇళ్లలో నివసిస్తున్నారు.

90 విమాన సర్వీసులపై ప్రభావం

ఢిల్లీ విమానాశ్రయంలో టెర్మినల్-1లో కొంత భాగం కూలిపోయిన ఘటన ప్రభావం ఇంకా కొనసాగుతోంది. శని, ఆదివారాల్లో 90 విమాన సర్వీసులపై ప్రభావం పడనుందని విమానాశ్రయాన్ని నిర్వహించే జిఎంఆర్ తెలిపింది. ఇది దేశవ్యాప్తంగా విమాన సర్వీసులపై ప్రభావం చూపుతుందని పేర్కొంది.

ఆందోళన చేస్తున్న ఆప్ శ్రేణులు

కేజ్రీవాల్‌కు 14 రోజుల కస్టడీ

- బిజెపి ప్రధాన కార్యాలయం వద్ద ఆప్ శ్రేణుల ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు శనివారం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో తీహార్ జైలులో ఉన్న కేజ్రీవాల్‌ను ఇటీవల అరెస్ట్ చేసిన సిబిఐ, ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపర్చగా, మూడు రోజుల రిమాండ్ విధించిన సంగతి తెలిసిందే. ఈ రిమాండ్ ముగియడంతో శనివారం అధికారులు మరోసారి కేజ్రీవాల్‌ను కోర్టులో హాజరుపర్చారు. సిబిఐ కోరడంతో, కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. కేజ్రీవాల్‌ను తీహార్ జైలుకు తరలించారు. జులై 12 వరకు కేజ్రీవాల్ రిమాండ్ కొనసాగనుంది. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు కేజ్రీవాల్‌ను ఈ ఏడాది ఫిబ్రవరి 19న అరెస్ట్ చేశారు. కేజ్రీవాల్‌ను వెంటనే జైలు నుంచి విడుదల చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేసింది. శనివారం ఢిల్లీలోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ మార్గ్‌లోని బిజెపి కేంద్ర కార్యాలయం ఎదుట ఆప్ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. కేంద్ర ప్రభుత్వ సంస్థల దుర్వినియోగం, నియంత పాలన అంతం కోసం.. అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ, పెద్దపెట్టున నినాదాలు చేశాయి. ఆందోళనకారులను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి.

ఇరాన్ అధ్యక్ష ఎన్నికల్లో ఎవరికీ దక్కని మెజారిటీ

టెహరాన్ : ఇరాన్ అధ్యక్ష ఎన్నికల్లో చాలా తక్కువ శాతం పోలింగ్ నమోదు కావడం, ఏ అభ్యర్థి మెజారిటీ సాధించలేకపోవడంతో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన అభ్యర్థుల మధ్య జులై 5న రెండో రౌండ్ ఎన్నికలు జరగనున్నాయి. 6.1కోట్ల మందికి పైగా అర్హులైన ఓటర్లు వుండగా, 40శాతం మందే ఓటు హక్కు వినియోగించుకున్నారని హోం శాఖ వర్గాలు శనివారం తెలిపాయి. 1979 విప్లవం అనంతరం అధ్యక్ష ఎన్నికల్లో ఇంత తక్కువ స్థాయిలో పోలింగ్ నమోదు కావడం ఇదే తొలిసారి కాగా, రెండో రౌండ్ అధ్యక్ష ఎన్నిక జరగడం కూడా రెండోసారి మాత్రమే. మధ్యేమార్గవాది పెజెషికాన్‌కు కోటీ 41 లక్షల ఓట్లు రాగా, అణు చర్చల మాజీ ప్రతినిధి సయీద్ జలీల్‌కు 90.47లక్షల ఓట్లు లభించాయి. పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాఘర్ ఘలిబఫ్‌కు 30.38లక్షలు, కన్జర్వేటివ్ ఇస్లామిక్ నేత ముస్తఫాకు 2,06,397ఓట్లు వచ్చాయి. దీంతో పెజెషికాన్, జలీల్ రెండో రౌండ్‌పోటీకి ఎంపికయ్యారు. జలీల్‌కు ఓటు వేయాల్సిందిగా వీరందరూ వారి మద్దతుదారులకు పిలుపునిచ్చారు. మే 19న హెలికాప్టర్ ప్రమాదంలో అధ్యక్షుడు ఇబ్రహీం రైసి మరణించడంతో ఈ ఎన్నికలు అనివార్యమయ్యాయి. 2022-23లో దేశవ్యాప్త నిరసనల నేపథ్యంలో ప్రజలకు భ్రమలు తొలగడం, అమెరికా ఆంక్షల కారణంగా 40శాతానికి పైగా ద్రవ్యోల్బణం నెలకొనడంతో ఎన్నికల పట్ల ఓటర్లకు ఉదాసీనత బాగా పెరిగింది.

బిజెపికి దొడ్డిదారిన జిఎంఆర్ విరాళాలు!

టెర్మినల్-1 ప్రారంభం తర్వాత నిధుల ప్రవాహం

- ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ ద్వారా అందజేత
- ట్రస్ట్ నిధుల్లో 75 శాతం కమలం పార్టీకే
- బయటపెట్టిన రాయిటర్స్, ఎడిఆర్



ఢిల్లీలో టెర్మినల్ కూలడంతో నుజ్జయిన కార్లు

న్యూఢిల్లీ : జిఎంఆర్ కంపెనీ నిర్వహిస్తున్న ఢిల్లీ విమానాశ్రయంలోని టెర్మినల్-1 పైకప్పు పాక్షికంగా కూలిపోవడంతో ఒక వ్యక్తి మరణించాడు. ఈ జిఎంఆర్ కంపెనీ 2018 నుండి ఓ ఎలక్టోరల్ ట్రస్ట్ ద్వారా అధికార బిజెపికి విరాళాలు అందించింది. ఈ విరాళాలు నేరుగా కాకుండా ట్రస్ట్ ద్వారా దొడ్డిదారిన బిజెపి ఖాతాకు చేరాయి. ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్‌కు పెద్ద మొత్తంలో నిధులు అందించిన సంస్థలలో జిఎంఆర్ ఒకటి. ఈ ట్రస్ట్ తనకు అందిన నిధులలో అధిక భాగాన్ని బిజెపికే సమకూర్చింది.

అధిక నిధులు అధికార పార్టీకే

ఎన్నికల కమిషన్ విడుదల చేసిన బాండ్ల కొనుగోలుదారుల జాబితాలో జిఎంఆర్ పేరు లేదు. ఈ కంపెనీ బిజెపికి పరోక్షంగా విరాళాలు అందించిందని ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయి. దేశంలో పదిహేను ఎలక్టోరల్ ట్రస్ట్‌లు ఉండగా వాటిలో అతి పెద్దది, సంపన్నమైనది ప్రుడెంట్ ఎలక్టొరల్ ట్రస్టే. 2013లో ఈ ట్రస్ట్ ఏర్పడగా ఇప్పటి వరకూ 272 మిలియన్ డాలర్ల నిధులు సమీకరించిందని రాయిటర్స్ వార్తా సంస్థ ఏప్రిల్‌లో విడుదల చేసిన నివేదిక తెలిపింది. ఇందులో సుమారు 75% నిధులను బిజెపికే సమర్పించిందని తేల్చింది.

దాతల జాబితాలో లేకున్నా...

వ్యక్తులు, కార్పొరేట్ సంస్థలు ఏ విధంగా విరాళాలు అందించిందీ ప్రుడెంట్ బహిర్గతం చేయలేదు. 2018-23 మధ్యకాలంలో బడా భారతీయ కంపెనీల నుండి ట్రస్ట్‌కు అందిన నిధుల వివరాలను రాయిటర్స్ సంస్థ ప్రభుత్వ రికార్డుల నుండి సేకరించింది. 2019-23 మధ్యకాలంలో ఎనిమిది బడా వ్యాపార గ్రూపులు ఈ ట్రస్టుకు కనీసం యాభై మిలియన్ డాలర్ల నిధులు సమకూర్చాయి. ఆ మొత్తం బిజెపికి చెక్కు రూపంలో చేరాయి. ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్, భారతీ ఎయిర్‌టెల్, ఎస్సార్, జిఎంఆర్ సంస్థల లావాదేవీలను రాయిటర్స్ గుర్తించింది. ఈ కంపెనీలు బిజెపికి నేరుగా విరాళాలు ఇవ్వలేదని, అందుకే అవి దాతల జాబితాలో లేవని తెలిపింది. తన ఆంతరంగిక మార్గదర్శకాల మేరకు ప్రుడెంట్ ఆయా పార్టీలకు విరాళాలు అందజేసిందని జిఎంఆర్ ప్రతినిధి ఒకరు చెప్పారు. ఆ మార్గదర్శకాలేమిటో ఇప్పటి వరకూ తెలియరాలేదు. ఏదో ఒక పార్టీకి కొమ్ము కాయడం జిఎంఆర్‌కు ఇష్టం లేదని రాయిటర్స్ చెప్పింది. ప్రుడెంట్ ట్రస్ట్ ఇతర పార్టీలకు కూడా విరాళాలు అందించింది కానీ ఎక్కువ భాగం బిజెపి ఖాతాకే చేరాయని రాయిటర్స్ స్పష్టం చేసింది.

ఎడిఆర్ నివేదిక కూడా...

సంవత్సరాల వారీగా ఎన్నికల ట్రస్టుల లావాదేవీలను విశ్లేషించిన అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) కూడా ప్రుడెంట్ వైపే వేలెత్తి చూపింది. 2018-19లో జిఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయ లిమిటెడ్ సంస్థ అందరి కంటే అత్యధికంగా పాతిక కోట్ల రూపాయల విరాళం అందించిందని ఎడిఆర్ తెలిపింది. ఈ సంస్థ నివేదిక ప్రకారం 2018-19లో ప్రుడెంట్ ట్రస్ట్ బిజెపికి రూ.67.25 కోట్ల విరాళాన్ని అందించింది. దానికి ముందు సంవత్సరం రూ.154.30 కోట్లు ఇచ్చింది. 2019-20లో కూడా అన్ని ట్రస్టులు కలిపి తమకు అందిన నిధులలో 76% నిధులను బిజెపికే సమర్పించుకున్నాయి. ఆ ఏడాది ప్రుడెంట్ ట్రస్ట్ బిజెపికి రూ.217.75 కోట్లు అందజేసింది. ఈ ట్రస్ట్‌కు సిఎంఆర్ గ్రూప్, భారతీ ఎయిర్‌టెల్, డిఎల్‌ఎఫ్, అపోలో టైర్స్ సంస్థలు పెద్ద ఎత్తున నిధులు అందించాయి.

అంగీకరించిన కమలం పార్టీ

2021-22లో ప్రుడెంట్ ట్రస్ట్ తనకు అందిన నిధులలో అత్యధికంగా రూ.336.509 కోట్లను బిజెపికి అందజేసింది. ఇందులో రూ.20 కోట్లు జిఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయ లిమిటెడ్ ఇచ్చినవే. 2022-23లో కూడా ఈ తంతు కొనసాగింది. ఆ ఏడాది ప్రుడెంట్‌కు రూ.360 కోట్ల కార్పొరేట్ నిధులు అందాయి. ఆ సంవత్సరం ఎలక్టోరల్ ట్రస్టుల ద్వారా బిజెపికి లభించింది రూ.259.08 కోట్లు. అందులో ఒక్క ప్రుడెంట్ నుండే రూ.256.25 కోట్లు అందాయి. తనకు అందిన నిధులలో అధిక భాగాన్ని ప్రుడెంట్ సంస్థ బిజెపికి అందజేసిందని, ఢిల్లీ విమానాశ్రయంలో టెర్మినల్-1ను ప్రధాని మోడీ ప్రారంభించిన నెల రోజుల తర్వాత ఈ విరాళాలు అందాయని రాయిటర్స్ తెలిపింది. ప్రుడెంట్ ట్రస్ట్ నుండి తనకు భారీగా విరాళాలు అందాయని 2019లో ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన వివరాలలో బిజెపి స్వయంగా అంగీకరించింది.

అమెరికాలోని నార్త్ కరోలినాలో కరువు

- అధిక ఉష్ణోగ్రతలతో పంటలకు తీవ్రనష్టం

వాషింగ్టన్ : అమెరికాలోని యావత్తు నార్త్ కరోలినా రాష్ట్రాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించారు. ఈ రాష్ట్రంలో నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలు, వేడి గాలులు స్థానిక రైతులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అధిక వేడికి పొగాకు, పత్తి, మొక్కజొన్న పంటలు నేలరాలుతున్నాయి. నార్త్ కరోలినాలోని 100 కౌంటీలలో 99 కౌంటీల్లో అసాధారణ ఉష్ణోగ్రతలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. వర్షాలు కురవకపోవడంతో పరిస్థితి దారుణంగా మారింది. నదీ ప్రవాహాలు, జలాశయాలు ఎండిపోయాయి. వసంత రుతువు చివరిలోనూ, వేసవి ప్రారంభంలోనే ఇలాంటి పరిస్థితి తలెత్తడం ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి పరిస్థితి తలెత్తడం రాష్ట్రంలో గత 24 ఏళ్లలో ఇది రెండోసారి. ఆదివారం వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేస్తున్నా.. కరువు పరిస్థితులను అధిగమించడానికి ఈ వర్షాలు సరిపోవని నిపుణులు చెబుతున్నారు. సోమవారం నుంచి మరో 18 రోజుల పాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. వేడి గాలులతో భూగర్భ జలాలపై కూడా ఒత్తిడి పడుతోంది. అధిక వినియోగంతో భూగర్భ జలాలు కూడా అడుగంటుతున్నాయి.

జార్ఖండ్‌లో బిజెపి తుడిచిపెట్టుకుపోతుంది

- హేమంత్‌సోరెన్

రాంచీ : త్వరలో జార్ఖండ్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి తుడిచిపెట్టుకుపోతుందని ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అన్నారు. మనీలాండరింగ్ కేసులో బెయిల్‌పై జైలు నుంచి శుశుక్రవారం విడుదలైన ఆయన శనివారం రాంచీలో జెఎంఎం పార్టీ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించాలని బిజెపి పగటి కలలు కంటోందన్నారు. 'మాపై కుట్ర పన్నిన వారికి తగిన సమాధానం చెబుతాం. బిజెపి శవపేటికకు చివరి మేకు వేసే సమయం వచ్చింది. జార్ఖండ్‌లో బిజెపి తుడిచిపెట్టుకుపోతుంది. ఈ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ముందుగానే జరగవచ్చని నాకు సమాచారం అందింది. అందుకు మేం సిద్ధంగా ఉన్నాం' అని ఆయన అన్నారు. తనపై పెట్టిన మనీలాండరింగ్ కేసు గురించి ఆయన మాట్లాడుతూ 'నిజాన్ని ఎవరూ దాచలేరు. త్వరలో లేదా ఆ తర్వాతైనా అది బయటకు వస్తుంది. మరోసారి నాయకత్వం అందించడానికి మీ ముందుకు వచ్చాను' అని అన్నారు.

ఆకస్మిక వరదల్లో ఐదుగురు సైనికుల మృతి
కొట్టుకుపోయిన యుద్ధట్యాంక్

శ్రీనగర్ : ఆకస్మిక వరదల్లో టి-72 యుద్ధట్యాంక్ కొట్టుకుపోవడంతో ఐదుగురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. లఢఖ్‌లోని వాస్తవ నియంత్రణ రేఖ (ఎల్‌ఎసి) సమీపంలో ష్యోక్ నదిలో మందిర్ మోర్‌కు సమీపంలో శనివారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. ఎక్సర్‌సైజులో భాగంగా ట్యాంక్ నదిని దాటుతుండగా జరిగిన ఈ ఘటనలో మరణించిన జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ (జెసిఒ)తోసహా ఐదుగురు సైనికుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. ష్యోక్ నదిలో అకస్మాత్తుగా నీటిమట్టం పెరగడంతో ఈ ప్రమాదం జరిగిందని, సహాయక బృందాలు వెంటనే అక్కడకు చేరుకున్నా.. నీటి ప్రవాహ ఉధృతి కారణంగా సిబ్బందిని రక్షించలేకపోయారని లేహ్‌లోని ఆర్మీ ప్రధాన కార్యాలయం తెలిపింది. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు.

మీకోసం

చిటికెడు పసుపుకు ఏదేని ఫేస్ పౌడర్ ఒక చెంచా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని వంటగదిలో ఉండే నూనె సీసాలు, పచ్చళ్ల జాడీలు, మొక్కల కుండీల మధ్య చల్లినట్లైతే చీమలు, ఈగలు చేరకుండా ఉంటాయి.

జీవన సౌరభం

మన ఆలోచనా సరళే.. మనం చేసే పనులను నిర్ణయిస్తుంది.

ఒంటె



ఒంటె ఒంటె ఒంటె
పిల్లలంతా నీ వెంటే
అమ్మమ్మ చెప్పిన కథలు వింటే
ఆనందం మా వెంటే

బైటో అంటే కూర్చుంటావు
ఉటో అంటే నిలుచుంటావు
అనాదిగా మనిషికి వాహనమైనావు
బరువులు ఎన్నో మోస్తావు

ఆకులు అలములు తింటావు
నీళ్ళు తాగక కొన్ని రోజులుంటావు
అలసట ఎరుగక నడుస్తావు
మూపురం నీకు శక్తి అంటావు

ఎడారి నౌకవు నీ వంటా
ఇసుకపై చక చక నడుస్తావంటా
కొండలు గుట్టలు ఎక్కేవంటా
గుడులు గోపురాలు చూపేవంటా

నీవు కూర్చుంటే, లేస్తుంటే
అది ఒక యోగాసనం
ఆరోగ్యానికి మేము వేస్తున్న
ఒంటె పోజుల ఉష్ట్రాసనం

- పి.బక్కారెడ్డి, 97053 15260.

గుణింత పదాలు రాయండి

పిల్లలూ, ఇక్కడ గుణింత పదాలతో మొదలయ్యే మూడక్షరాల పదాలు కొన్ని రాయండి. ఉదాహరణకు ఒకటి ఇచ్చాం.

గునపం

ర ___ ___	మ ___ ___
కా ___ ___	పా ___ ___
చై ___ ___	తీ ___ ___
జా ___ ___	ట ___ ___
వే ___ ___	దూ ___ ___

నేను గీసిన బొమ్మ



సిహెచ్.భవ్య,
8వ తరగతి,
ఎంపియుపి స్కూలు,
పెదపూడి,
మొవ్వ మండలం,
కృష్ణా జిల్లా.

జి.డేవిడ్ కుమార్,
7వ తరగతి,
ప్రభుత్వ ఉన్నత పాఠశాల,
నౌదువీధి,
చోడవరం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

నేలమట్టమైన ఆశల్లోంచి ...

డాక్టరు సాక్షి, వార్డులోకి అడుగు పెట్టగానే రోగులందరూ ఆమెని ఆశ్చర్యంగా చూస్తారు. కొంతమందైతే ఆమె దగ్గరకు వచ్చి 'నువ్వే మాకు స్ఫూర్తి. నిన్ను చూసే మేము కోలుకుంటున్నాం. నువ్వు నడిచి, మమ్మల్ని నడిపిస్తున్నావు' అంటూ ఆప్యాయంగా పలకరిస్తారు. ఇక ఇంట్లోనైతే వాళ్ల అమ్మ 'సాక్షి-2.0' అని పిలుస్తుంది. గుజరాత్ అహ్మదాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ సర్జన్‌గా (ఎముకల విభాగం వైద్యురాలిగా) విధుల్లో ఉన్న 27 ఏళ్ల సాక్షి మహేశ్వరి ఎందుకంతమందికి స్ఫూర్తిగా నిలిచింది? ఇంట్లో ఆమెను ఎందుకు అలా పిలుస్తున్నారు?

వైద్య విద్యార్థిగా ఎంతో ప్రతిభతో రాణిస్తున్న సాక్షి, మల్టీ టాలెంటడ్ గాళ్‌గా కాలేజీలో అందరికి సుపరిచితురాలు. వైద్యురాలిగా సేవలు చేయాలని, జీవితాన్ని ఉన్నత శిఖరాలవైపు నడిపించాలని ఎన్నో కలలుగంది. కానీ ఆ కలలు తల్లకిందులయ్యేలా అత్యంత దారుణమైన రోడ్డు ప్రమాదానికి గురైంది. ఎంబిబిఎస్ రెండో సంవత్సరం చదువుతున్నప్పుడు, సరిగ్గా ఏడేళ్ల క్రితం ఓ రోడ్డు ప్రమాదంలో సాక్షి తీవ్రంగా గాయపడింది. శరీరం నిలువెల్లా గాయాలు. ఎక్కడికక్కడ ఎముకలు గుల్లగుల్ల అయ్యాయి. బాహ్య, అంతర్గత అవయవాలు బాగా దెబ్బతిన్నాయి. సర్జరీలు చేసినా 10 శాతమే బతికే ఛాన్స్ అని డాక్టర్లు తేల్చి చెప్పేశారు. ఆ మాటలు విన్న తల్లిదండ్రులు తమ గారాలపట్టికి వచ్చిన కష్టం చూసి కన్నీరు మున్నీరయ్యారు. కానీ ఎక్కడో ఓ చిన్న ఆశ, తనని ఎలాగైనా దక్కించుకోవాలని ఆరాటపడ్డారు. అమ్మానాన్న తాపత్రయానికి సాక్షి ఆత్మవిశ్వాసం కొండంత ధైర్యమిచ్చింది. 20 సర్జరీలు చేశారు. నెల పాటు ఐసియుకే పరిమితమైంది. ఆరు నెలలు ఆస్పత్రి మంచంలోనే ఉండిపోయింది. రెండేళ్ల పాటు ఫిజియోథెరపీ చేయించుకుంది. ఇన్ని ప్రతికూలతలు ఎదురైనా, సాక్షి తిరిగి కోలుకుంది. అయితే అప్పటి నుండే ఆమె మరో యుద్ధానికి సిద్ధపడాల్సి వచ్చింది. నీళ్ల తాగుదామంటే, బాటిల్ మూత తీయలేని పరిస్థితి, వాష్‌రూమ్‌కు వెళ్లాలంటే మంచం మీద నుంచి కదల్లేని స్థితి.

"వైద్య విద్యార్థిగా ఉన్న నాకు, ఆ పరిస్థితి తీవ్రత అర్థమైంది. ఇక నుంచి నా జీవితం, ఇంతకుముందులా ఉండదని నాకు తెలుసు. నా చుట్టూ చేరిన వారు, నా భవిష్యత్తుకై ఆందోళన చెందడం నాకు స్పష్టంగా కనిపించింది. ఆ పరిస్థితుల్లో అమ్మా, నాన్న నాకు ఎంతో అండగా నిలబడ్డారు. వారు ఇచ్చిన ప్రోత్సాహంతోనే నేను మళ్లీ కోలుకున్నాను" అని సాక్షి చెబుతోంది.

ఆడుతూపాడుతూ తిరిగే బిడ్డ ఒక్కసారిగా మంచానికే పరిమితమైతే ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. "సాక్షిని ఆ పరిస్థితుల్లో చూసి, మేము తల్లడిల్లిపోయాం. చిన్నపిల్లలా ప్రతి ఒక్కటి నేర్పించాం. తినడం, తాగడం, నడవడం అన్నీ తను మళ్లీ నేర్చుకుంది. ఇట్లాంటి పరిస్థితుల్లోనే తను చదువును కొనసాగిస్తానని చెప్పింది. ఆ రోజు మేము చాలా భయపడిపోయాం. అయినా తన కల నెరవేరాలని తోడ్పాటునిచ్చాం" అని సాక్షి అమ్మానాన్న చెబుతున్నారు.

"చదువు కొనసాగించడం సాక్షికి ఇంతకుముందంత సులభం కాదు. మంచం దాటి గది బయటికి రావాలి. వాకర్‌ని వదిలి అడుగులు వేయాలి. నీళ్ల బాటిల్ మూత తీయగలగాలి. ఇవన్నీ చాలా చిన్న విషయాలే. కానీ సాక్షికి అవి కష్టమైన అంశాలు. అయినా ఆమె పట్టుదలతో సాధించింది. అందుకే ఆమె నాకు గొప్ప స్ఫూర్తిగా కనిపిస్తుంది" అని సాక్షి సోదరి ఇషా, నీళ్ల నిండిన కళ్లతో చెబుతోంది.

"ప్రతి రోజూ ఉదయం నిద్ర లేవగానే, నిన్నటి రోజు నేను చేయలేని పనుల గురించి ఆలోచించను. బదులుగా ఈ రోజు ఏమి సాధించగలనో అని ఎదురుచూస్తాను" అంటున్న సాక్షి ఎంతోమంది యువతకి ఆదర్శం.



పురుగులు ఇంట్లోకి రాకుండా ...

వర్షాకాలంలో పురుగులు, బొద్దింకలు, చిన్న చిన్న కీటకాల సమస్య విపరీతంగా ఉంటుంది. వర్షం పడ్డ వెంటనే పరిసరాల్లో నీరు నిలిచి బురదగా మారుతుంది. దీంతో దోమలు, కీటకాలు వృద్ధి చెందుతాయి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా అవి ఇంటి లోపలకు వచ్చేస్తాయి. కొన్ని చిట్కాలు పాటించి ఇంట్లోకి పురుగులు రాకుండా కాపాడుకోవచ్చు.

- మామూలుగా ఇంటి బయట తెలుపు రంగు కాంతి వచ్చే బల్బులను వాడతాం. వాటికి పురుగులు ఎక్కువగా ఆకర్షితమవుతాయి. బదులుగా ఎరుపు రంగు లేదా పసుపు రంగు వెలుతురు నిచ్చే బల్బులను అమర్చాలి. వీటికి పురుగులు అంతగా రావు.
- అలాగే బయట వీలైనంత తక్కువ సేపు లైట్లు వేసి ఉంచాలి. వీలైతే మోషన్ డిటెక్టివ్ లైట్లు వాడాలి. వీటివల్ల సగం సమస్య తగ్గుతుంది.
- సిట్రోనెల్లా ఒక గడ్డిజాతి మొక్క. దీనికి సహజంగానే పురుగులను వికర్షించే లక్షణం ఉంటుంది. కాబట్టి సిట్రోనెల్లా నూనెను చల్లడం వల్ల పురుగులు రాకుండా చేయొచ్చు. మార్కెట్లో ఇది లభ్యం అవుతుంది. లేదంటే సిట్రోనెల్లా వాసన ఉండే క్యాండిళ్లు ఇంట్లో వెలిగించినా ఆ వాసనకు పురుగులు రావు.
- ఇంట్లో లేదా కిచెన్‌లో కొన్ని సహజంగా కీటకాలను తరిమికొట్టే మొక్కల్ని పెట్టుకోవాలి.
- తులసి, ల్యావెండర్, కలబంద, నిమ్మగడ్డి, రోజ్మేరీ, పుదీనా.. లాంటి మొక్కల్ని ఒక మూలన పెట్టుకుంటే చిన్ని చిన్న దోమల్లాంటి కీటకాలు రావు.
- వంటల మీద, పండ్లు, కూరగాయల మీద, డైనింగ్ టేబుల్ మీద పెట్టిన వస్తువుల మీద చిన్న చిన్న పురుగులు వచ్చి వాలుతుంటాయి. అలాంటప్పుడు వాటి మీద జాలీ లాంటిది పెట్టొచ్చు.
- ఆన్‌లైన్‌లో మెటల్ మెష్ బాస్కెట్లు, మెష్ క్యాప్ దొరుకుతాయి. వాటిని వాడితే ఏ ఇబ్బందీ ఉండదు.
- లైట్లకు కీటకాలు ఆకర్షించి ఎక్కువవుతాయి. కాబట్టి లైట్ల కింద నూనెలో ముంచిన కాగితాన్ని లేదా న్యూస్ పేపర్ వేలాడదీయాలి లేదా అతికించాలి. దీంతో కొన్ని పురుగులు ఆ కాగితానికి అతుక్కుపోతాయి. పురుగులు ఎక్కువగా లేనప్పుడు, చాలా చిన్న చిన్న పురుగులతో ఇబ్బంది ఉంటే ఈ చిట్కా బాగా పనిచేస్తుంది.
- దోమలు, పురుగులు రాకుండా గది మూలల్లో కర్పూరం వెలిగించొచ్చు. రెండు మూడు కర్పూర బిళ్లలు ప్లేట్ లో పెట్టి వెలిగించి కనీసం పది నిమిషాలు అలా వదిలేయాలి. గది తలుపులు మూసి ఉంచాలి. దాంతో దోమలు కాస్త తగ్గుతాయి.
- నీలగిరి నూనె, నిమ్మనూనె, ల్యావెండర్ నూనె, పెప్పర్ మింట్ నూనెతో సమస్య ఎక్కువున్న చోట స్ప్రే చేస్తే పురుగులు రావు.

'కల్కి 2898 ఏడీ' అఖండ విజయం: అశ్వనీదత్



'కల్కి 2898 ఏడీ' ప్రపంచవ్యాప్తంగా విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. విడుదలైన రోజు ఉదయం షో నుంచే అన్ని ప్రాంతాల నుంచి గొప్ప రిపోర్టు వచ్చింది. నేను ఏదైతే అనుకున్నానో అలాంటి అఖండ విజయం వచ్చింది. హ్యాట్సప్ టు నాగ్ అశ్విన్. ఐయామ్ వెరీ వెరీ హ్యాపీ' అని దర్శకుడు సి.అశ్వనీదత్ చెప్పారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సైన్స్ ఫిక్షన్ మూవీ 'కల్కి 2898 ఏడీ' శుక్రవారం విడుదలైన విషయం తెలిసిందే. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, ప్రభాస్, దీపికా పదుకొణె లీడ్ రోల్స్‌లో నటించారు. వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత సి. అశ్వనీదత్ ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. ఈ సినిమా విజయవంతంగా ప్రదర్శితమవుతున్న నేపథ్యంలో అశ్వనీదత్ విలేకరులతో మాట్లాడారు. 'నాగ్ అశ్విన్ మొదటి సినిమా నుంచి జర్నీ చేస్తున్నాం. తను ఎంత పెద్ద సినిమా అయినా తీయగలడనే కాన్ఫిడెన్స్ నాకు మొదటి నుంచీ వుంది. అదే మా అమ్మాయిలతో చెప్పాను. తను ఏ సబ్జెక్ట్ చెప్పినా వెంటనే దూకేయమని అన్నాను. ఈ శతాబ్దంలో ఒక దర్శకుడు మా ఇంట్లోనే దొరికాడు (నవ్వుతూ). నా మొదటి సినిమా ఎదురులేని మనిషి నుంచి ఇప్పటివరకూ దర్శకుడు చెప్పింది వినడం, తనకు కావల్సినది సమకూర్చడం తప్ప మరో డిస్కషన్ పెట్టను. కల్కి మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకూ ఇంకా ఏం కావాలని అడగడం తప్ప నేను ఎక్కడా జోక్యం చేసుకోలేదు. అమితాబ్‌ను చాలా అద్భుతంగా చూపించారు. బుజ్జి వాహనం.. నాగ్ అశ్విన్ విజన్. ఈ కాన్సెప్ట్ గురించి చెప్పినప్పుడు చాలా అద్భుతంగా అనిపించింది. సినిమాలో చాలా గొప్పగా ప్రజెంట్ చేశారు. ఈ స్టోరీ అనుకున్నప్పుడే పార్ట్ 2 థాట్ వచ్చింది. కమల్ ఎంటరైన తర్వాత పార్ట్2 డిసైడ్ అయిపోయాం. ఆయనది అద్భుతమైన పాత్ర. నాగీ, స్వప్న, ప్రియాంక ఈ ముగ్గురే కాపీ చూశారు. సినిమా అద్భుతమైన విజయం సాధించింది.' అని వివరించారు.

అవేమీ నిజం కాదు..

కమల్ హాసన్, శంకర్ కాంబినేషన్లో వస్తోన్న 'భారతీయుడు 2' సినిమాపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ సినిమా కథపై, కమల్ హాసన్ పాత్రపై సోషల్ మీడియాలో అనేక వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. అవినీతికి పాల్పడే ప్రభుత్వ అధికారులందరినీ సిద్ధార్థ్ చంపేస్తాడని కొందరూ సోషల్ మీడియా వేదికగా కామెంట్స్ చేస్తున్నారు. దీనిపై తాజాగా కమల్ హాసన్ స్పందిస్తూ.. ఓ ట్వీట్ రిలీజ్ చేశారు. 'ఈ సినిమా గురించి రకరకాల కథలు వినిపిస్తున్నాయి. సేనాపతి గెటప్ గురించి కూడా కొన్ని కథలు రాస్తున్నారు. అయితే.. మీరు ఊహించుకున్నవి ఏవీ నిజం కాదు. ఈ సినిమా కథను ఎవరూ ఊహించలేకపోయారు. అందుకు నేను ఎంతో సంతోషిస్తున్నాను' అని చెబుతూ, "ఇండియన్ 3'లో సేనాపతి తండ్రి పాత్ర కూడా తెరపై కనిపిస్తుంది' అని ఆసక్తికర కామెంట్స్ చేశారు.

పవన్ కోసం నిరీక్షణ : ఎఎం రత్నం

పవన్ కళ్యాణ్ హీరోగా రూపొందుతున్న పీరియాడికల్ చిత్రం 'హరిహర వీరమల్లు' గురించి నిర్మాత ఎఎం రత్నం తాజాగా కొన్ని విషయాలను మీడియాకు వివరించారు. 'పవన్ కల్యాణ్ షూటింగ్ చాలావరకూ పూర్తయింది. ఇంకో 20-25 రోజులు ఆయన షూటింగ్ చేస్తే సినిమా పూర్తవుతుంది. ఆయన వీలునుబట్టి త్వరలోనే పూర్తి చేసే ప్లాన్ చేస్తున్నాం. అమెజాన్ ఓటీటీ హక్కులు తీసుకుంది. వారి అగ్రిమెంట్ ప్రకారం సినిమా అక్టోబర్‌లో విడుదల కావాలి. వాళ్లని రిక్వెస్ట్ చేసి విడుదల కాస్త వెనక్కి తీసుకెళ్తాం. ఈ ఏడాదిలోనే సినిమాను విడుదల చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం. మచిలీపట్నం పోర్ట్ సీక్వెన్స్ కొన్ని సీన్లు ఉన్నాయి. ఆ సన్నివేశాల సీజీ బావుండాలని ఇరాన్లో చేయిస్తున్నాం. కుస్తీ ఎపిసోడ్ బెంగళూరులో సీజీ చేస్తున్నారు. ఆడియన్స్‌ని ఈ సినిమా పీరియాడికల్ అట్మాస్పియర్‌కు తీసుకెళ్తుంది. పవన్ కల్యాణ్ చేసే వీరోచిత పోరాటాలు ఆకట్టుకుంటాయి' అని వివరించారు. తొలుత ఈ చిత్రానికి క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. ఆయన మరో చిత్రంతో బిజీగా ఉండటం వల్ల ఆయన పర్యవేక్షణలో జ్యోతి కృష్ణ సినిమాను పూర్తి చేయనున్నారు. మెగా సూర్య మూవీస్ పతాకంపై ఏ.ఎం.రత్నం ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.

టి20 ప్రపంచకప్ మనదే

- మెరుపు బౌలింగ్‌తో హార్దిక్ పాండ్యా, సూపర్ క్యాచ్‌తో సూర్యకుమార్
- ఉత్కంఠ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై ఏడు పరుగుల తేడాతో గెలుపు

టి20లకు కోహ్లి గుడ్‌బై

టైటిల్ చేజారిందనుకొని టీమిండియా అభిమానులు టీవీలను కట్టేసినా.. ఫలితంపై ఆశ చావలేదు. ఏ రీతిగా టీమిండియా ఓడిందో అనుకున్న దశ నుంచి టైటిల్‌ను చేజిక్కించుకోవడం.. అదే క్రికెట్ మజా అంటే. ఈ ప్రపంచకప్‌లో ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్ ఏదైనా ఉందంటే అది ఇదే. చివరి 30బంతుల్లో 30 పరుగులు చేస్తే దక్షిణాఫ్రికాదే గెలుపు అనుకున్న దశలో ఒత్తిడిని జయించలేక ఆ జట్టు మరోసారి బోర్లాపడింది. 16వ ఓవర్‌లో బుమ్రా 4 పరుగులు ఇవ్వడం.. 17వ ఓవర్ తొలిబంతికే హార్దిక్ ఫామ్‌లో ఉన్న క్లాసెన్‌ను ఔట్ చేయడం చక చకా జరిగిపోయాయి. ఆ తర్వాతి ఓవర్లో బుమ్రా 2పరుగులే ఇవ్వడంతో ఫలితంపై ఆశలు చిగురించాయి. ఇక 19వ ఓవర్లో ఆర్ష్‌దీప్ 4పరుగులే ఇవ్వడంతో ఫలితం మనవైపు మొగ్గింది. ఇక చివరి ఓవర్లో దక్షిణాఫ్రికా 16పరుగులు చేయాల్సి రాగా.. హార్దిక్ వేసిన తొలిబంతికి సూర్యకుమార్ యాదవ్ బౌండరీ లైన్ వద్ద డేవిడ్ మిల్లర్ క్యాచ్‌ను సూపర్‌గా అందుకోవడంతో ఫలితం టీమిండియా వైపు మొగ్గింది. దీంతో టీమిండియా 2007 తర్వాత రెండోసారి టి20 ప్రపంచకప్ విజేతగా నిలిచి 17ఏళ్ల తర్వాత ఈ టైటిల్‌ను మరోసారి కైవసం చేసుకుంది. అలాగే 11ఏళ్ల తర్వాత రోహిత్ శర్మ సారథ్యంలో మరో ఐసిసి టైటిల్‌ను ముద్దాడింది.

టి20 ప్రపంచకప్ టైటిల్‌తో టీమిండియా ఆటగాళ్లు

కోచ్,కెప్టెన్, కోహ్లిలకు ప్రత్యేకం..

కోచ్ రాహుల్ ద్రావిడ్, కెప్టెన్ రోహిత్ శర్మతోపాటు, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లిలకు ఈ ప్రపంచకప్ టి20 ప్రపంచకప్ టైటిల్ గెలుపు ఎంతో ప్రాముఖ్యతను సంపాదించిపెట్టింది. ఈ టోర్నీ ముగిసిన తర్వాత హెడ్ కోచ్ పదవినుంచి రాహుల్ ద్రావిడ్ వైదొలనుండగా.. కెప్టెన్ హోదాలో రోహిత్ శర్మకు ఇదే తొలి ఐసిసి ట్రోఫీ. ఇక విరాట్ కోహ్లి టి20 ప్రపంచకప్ ముగిసిన అనంతరం ఈ ఫార్మాట్‌కు గుడ్‌బై చెబుతున్నటు ప్రకటించాడు. దీంతో ఈ ముగ్గురి కల సార్థకమైంది.

బార్బొడాస్: టి20 ప్రపంచకప్‌ను ఫైనల్లో టైటిల్‌ను టీమిండియా రెండోసారి కైవసం చేసుకుంది. చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో భారతజట్టు ఏడు పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై సంచలన విజయం సాధించింది. విజయానికి దక్షిణాఫ్రికా జట్టు చివరి 30బంతుల్లో 30పరుగులు చేయాల్సిన దశలో ఒత్తిడికిలోనై చేజేతులా ఓటమిపాలైంది. దీంతో తొలిసారి ఫైనల్‌కు చేరిన దక్షిణాఫ్రికా జట్టు ఒత్తిడిని జయించడంలో విఫలమై రన్నరప్‌కే పరిమితమైంది. తొలుత టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి ఫైనల్లో కదం తొక్కాడు. 34పరుగులకే 3వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ టీమిండియాను అర్ధసెంచరీతో ఆదుకున్నాడు. భారీషాట్లకు వెళ్లకుండా ఆచి తూచి ఆడారు. మరో ఎండ్‌లో అక్షర్ పటేల్(47; 31బంతుల్లో ఫోర్, 4సిక్సర్లు) బ్యాట్ ఝుళిపిస్తున్నా.. నిలకడగా ఆడాడు. అర్ధసెంచరీ పూర్తయ్యాక భారీషాట్స్ ఆడాడు. మొత్తమ్మీద 59బంతులను ఎదుర్కొన్న కోహ్లి 6ఫోర్లు, 2భారీ సిక్సర్ల సాయంతో 75పరుగులతో రాణించాడు. శివమ్ దూబే(27; 16బంతుల్లో 3ఫోర్లు, సిక్సర్)కూడా రాణించడంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా ఓపెనర్, కెప్టెన్ రోహిత్ శర్మ 9 పరుగులకే అవుట్ కాగా, అదే ఓవర్లో కేశవ్ మహరాజ్ బౌలింగ్‌లో చెత్త షాట్ ఆడి రిషబ్ పంత్(0) కూడా వెనుదిరిగాడు. ఆ తర్వాత సూర్యకుమార్ యాదవ్(3) సైతం పెవిలియన్ చేరడంతో టీమిండియా కష్టాల్లో పడింది. అయితే అక్షర్ పటేల్‌తో కలిసి కోహ్లి ఇన్నింగ్స్ ను నడిపించిన తీరు అద్భుతం. ఓ వైపు తాను దూకుడుగా ఆడుతూ, ఇతర బ్యాటర్లు కూడా ధాటిగా ఆడే వాతావరణం సృష్టించాడు. కోహ్లి అండతో అక్షర్ పటేల్ చెలరేగాడు. అక్షర్ ఔటయ్యాక శివమ్ దూబే కూడా ధాటిగా ఆడడంతో టీమిండియా స్కోరు గౌరవప్రద స్కోర్ చేసింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో కేశవ్ మహరాజ్, ఆన్రిచ్ నోర్జేకు రెండేసి, మార్కో యన్సెన్, కగిసో రబడాకు ఒక్కో వికెట్ దక్కాయి.

ఛేదనలో దక్షిణాఫ్రికా ఓపెనర్ హెండ్రిక్స్(4) నిరాశపరిచాడు. ఆ తర్వాత కెప్టెన్ మార్క్రమ్(4) కూడా త్వరగా పెవీలియన్‌కు చేరడంతో 12పరుగులకే 2వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో డికాక్(39), స్టబ్స్(31)కి తోడు క్లాసెన్(52) అర్ధసెంచరీతో రాణించి దక్షిణాఫ్రికాను విజయతీరాలకు చేర్చారు. అక్షర్ పటేల్ వేసిన ఇన్నింగ్స్ 15వ ఓవర్‌లో దక్షిణాఫ్రికా బ్యాటర్లు 24పరుగులు రాబట్టారు. దీంతో సమీకరణలు మారిపోయాయి. దీంతో చివరి 30బంతుల్లో దక్షిణాఫ్రికా జట్టు 30పరుగులు చేయాల్సి వచ్చింది. ఆ దశలో 16వ ఓవర్ వేసిన బుమ్రా, హార్దిక్, ఆర్ష్‌దీప్ 4ఓవర్లు బౌలింగ్ చేసి 14పరుగులి వ్వడంతో విజయానికి టీమిండియా చేరువైంది. చివరి ఓవర్లో విజయానికి 16పరుగులు కావాల్సి దశలో హార్దిక్ పాండ్యా వేసిన ఓవర్ 8పరుగులే వచ్చాయి. దీంతో నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యే సరికి దక్షిణాఫ్రికా 8వికెట్ల నష్టానికి 169పరుగులే చేసి ఓటమిపాలైంది. టీమిండియా బౌలర్లు హార్దిక్ పాండ్యాకు మూడు, ఆర్ష్‌దీప్, బుమ్రాకు రెండేసి, అక్షర్ పటేల్‌కు ఒక వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కోహ్లికి, సిరీస్ బుమ్రాకు లభించింది.

స్కోర్‌బోర్డు...

ఇండియా ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి)క్లాసెన్ (బి)మహరాజ్ 9, విరాట్ కోహ్లి (సి)రబడా (బి)జాన్సెన్ 76, పంత్ (సి)డికాక్ (బి)మహరాజ్ 0, సూర్యకుమార్ యాదవ్ (సి)క్లాసెన్ (బి)రబడా 3, అక్షర్ పటేల్ (రనౌట్)డికాక్ 47, దూబే (సి)డేవిడ్ మిల్లర్ (బి)నోర్జే 27, హార్దిక్ (నాటౌట్) 5, జడేజా (సి)మహరాజ్ (బి)నోర్జే 2, అదనం 7. (20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 176పరుగులు. **వికెట్ల పతనం:** 1/23, 2/23, 3/34, 4/106, 5/163, 6/174, 7/176 **బౌలింగ్:** జాన్సెన్ 4-0-49-1, మహరాజ్ 3-0-23-2, రబడా 4-0-36-1, నోర్జే 4-0-26-2, షాంసీ 3-0-26-0

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: హెండ్రిక్స్ (బి) బుమ్రా 4, డికాక్ (సి)కుల్దీప్ (బి)ఆర్ష్‌దీప్ 39, మార్క్రమ్ (సి)పంత్ (బి)ఆర్ష్‌దీప్ 4, స్టబ్స్ (బి)అక్షర్ 31, క్లాసెన్ (సి)పంత్ (బి)పాండ్యా 52, డేవిడ్ మిల్లర్ (సి)సూర్యకుమార్ (బి)పాండ్యా 21, జాన్సెన్ (బి)బుమ్రా 2, మహరాజ్ (నాటౌట్) 2, రబడా (సి)సూర్యకుమార్ (బి)హార్దిక్ 4, నోర్జే (నాటౌట్) 1, అదనం 9. (20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 169పరుగులు. **వికెట్ల పతనం:** 1/7, 2/12, 3/70, 4/106, 5/151, 6/156, 7/161, 8/168 **బౌలింగ్ :** ఆర్ష్‌దీప్ 4-0-20-2, బుమ్రా 4-0-18-2, అక్షర్ 4-0-49-1, కుల్దీప్ 4-0-45-0, హార్దిక్ 3-0-20-3, జడేజా 1-0-12-0

నాగల్ ప్రత్యర్థి మియోమిర్

- సిన్నర్‌కు టాప్ ర్యాంక్
- వింబుల్డన్ డ్రా విడుదల



లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ-2024 మెయిన్ డ్రా విడుదలైంది. పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్ సంచలనం సుమిత్ నాగల్ నేరుగా అర్హత సాధించిన సంగతి తెలిసిందే. వింబుల్డన్ టోర్నీ నిర్వాకులు శుక్రవారం విడుదల చేసిన డ్రాలో 77వ సీడ్ సుమిత్ నాగల్ తొలిరౌండ్‌లో సెర్బియాకు చెందిన మియోమిర్ కెచ్మనోవిక్‌తో తలపడనున్నాడు. 26ఏళ్ల సుమిత్ వరుసగా రెండో మేజర్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ బరిలోకి దిగనున్నాడు.

మియోమిర్ ఎటిపి ర్యాంకింగ్స్‌లో 53వ ర్యాంక్ ఆటగాడు. ఇక టాప్‌సీడ్ జెన్నిక్ సిన్నర్(ఇటలీ)కి వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలోనూ టాప్‌సీడ్ దక్కింది. ఇక పురుషుల డబుల్స్‌లో రోహన్ బొప్పన్న-మాథ్యూ ఎబ్డెన్(ఆస్ట్రేలియా) జోడీకి 2వ సీడ్ దక్కింది. వీరు తొలిరౌండ్ ఆండ్రియన్ మనారియో- గొవ్వని (ఫ్రాన్స్) ఆటగాళ్లతో తలపడనున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68